

'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50 సంపుటి: 16 సంచిక: 156

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


సచివాలయ విశేషాలను గవర్నర్ తమిళిసైకి వివరిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో సీఎస్ శాంతికుమారి

స్వయంగా తీసుకెళ్లి.. సచివాలయమంతా చూపించి..

- నల్ల పోచమ్మ గుడిలో తొలిపూజ.. చర్చి, మసీదులలో తొలి ప్రార్థనలు
- కార్యక్రమాల్లో కలసి పాల్గొన్న గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్

8లో

అసైన్డ్ భూములపై సర్వహక్కులు!

- ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో ప్రకటించనున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇచ్చిన అన్నిరకాల భూములపై యాజమాన్య హక్కులు
- దళితబంధుతో పాటు గిరిజనబంధు.. ఒక్కొక్కరికి రూ.12 లక్షల సాయం

7లో

నేటి సాయంత్రం చేవెళ్ల వేదికగా 'ప్రజా గర్జన'సభ

ఆరని అసమ్మతి జ్వాల

బీఆర్ఎస్‌లో టికెట్ల ప్రకటనతో బయటపడుతున్న అసమ్మతులు


ఖమ్మంలో నిర్వహించిన ర్యాలీలో అభివాదం చేస్తున్న తుమ్మల నాగేశ్వరరావు

- పార్టీ జెండా లేకుండానే ఖమ్మం వెళ్లిన తుమ్మల
- నేడు తన నివాసంలో అనుచరులతో మైనంపల్లి భేటీ
- ప్రగతిభవన్ నుంచి ముత్తిరెడ్డి, చిన్నయ్యకు పిలుపు
- సీఎం కేసీఆర్‌తో చెన్నమనేని రమేశ్ భేటీ.. ప్రభుత్వ సలహాదారుగా నియామకం
- కోదాడ, స్టేషన్ ఘన్‌పూర్‌ల్లోనూ రగులుతున్న అసంతృప్తి
- నర్సాపూర్ సీటుపై కొనసాగుతున్న ఉత్కంఠ

సాక్షి, హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల జాబితాను ఇతర పార్టీల కంటే ముందే ప్రకటించిన భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో అసమ్మతి జ్వాలలు చల్లారడం లేదు. ఒకరొకరుగా అసంతృప్త నేతలు బయటపడుతున్నారు. తమ అసమ్మతిని బహిరంగంగా వ్యక్తం చేస్తున్నారు. తమ భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించేందుకు సన్నద్ధమవుతున్నారు. మరికొందరు అసంతృప్తులు రహస్య భేటీలతో పార్టీ, అభ్యర్థులపై ఒత్తిడి పెంచే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇంకొందరు పార్టీలో ఉంటామంటూనే అభ్యర్థులను మాత్రం మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. టికెట్ దక్కించుకున్న నేతలతో సయోధ్య కుదుర్చుకునేందుకు అసమ్మతి నేతలు ససేమిరా అంటుండటం చర్చనీయాంశంగా మారుతోంది.

బీఆర్ఎస్ జెండా లేకుండా భారీ ర్యాలీగా

పాలేరు టికెట్ ఆశించిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆ పార్టీ అధినేత కేసీఆర్ రాయబారానికి మెత్తబడిన సూచనలు కనిపించడం లేదు. ఎంపీ నామా నాగేశ్వర్‌రావు, మిర్యాలగూడ ఎమ్మెల్యే ఎన్. భాస్కర్‌రావు రెండు రోజుల క్రితం తుమ్మలను కలిసి కేసీఆర్ సందేశాన్ని అందించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్లిన తుమ్మలకు.. ఆయన అనుచరులు జిల్లా సరిహద్దు నాయకన్‌గూడెం వద్ద భారీ స్థాయిలో స్వాగతం పలికారు. ఖమ్మంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అయితే ఎక్కడా

మిగతా 8వ పేజీలో ▶


UPSCALE NEIGHBORHOOD IS NOW ALONG MUMBAI HIGHWAY!
GOOD NEWS, YOU CAN OWN A PLOT FOR YOUR DREAM HOME.
YOSHITHA, established in A.P. & Telangana and spreading its wings all over India
OUR ONGOING PROJECTS
YOSHITHA'S CELEBRITY WOXRIDGE
CELEBRITY HillView GLAZED IN STARLIGHT
SUPREME ZONE
EMINENT EMPIRE
LUMINOUS Serenity
YOSHITHA'S STELLAR ESTATE @ ISHRATABAD, SADASHIVPET
OPEN PLOTS | PREMIUM VILLA PLOTS | COMMERCIAL PLOTS
FASTEST SELLING PLOT COMMUNITY AT HYDERABAD
info@yoshithainfra.in
www.yoshithainfra.in
Plot # 135, Pillar # A601, Mathrusri Nagar
Miyapur, Hyderabad - 500049
YOSHITHA
HOUSING & INFRA
IT'S AN EMOTION
- Concept & Designed by www.envizonstudio.com - +91 98494 99191

క్లుప్తంగా...

5 వేల టీచర్ పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ ఆమోదం

సాక్షి, హైదరాబాద్: డిపార్ట్‌మెంటల్ సెలక్షన్ కమిటీ(డీఎస్‌సీ) ద్వారా 5,089 టీచర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ఆర్థికశాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఫైనాన్స్ విభాగం ఉత్తర్వులు జారీచేసింది. ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధించేందుకు అవసరమైన 1,523 మంది టీచర్లుసహా మొత్తం 6,612 మంది టీచర్ల నియామకం చేపడుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. స్పెషల్ టీచర్ల విషయంలో ఫైనాన్స్ క్లియరెన్స్‌కు కొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఆర్థికశాఖ ఆమోదం తెలిపిన 5,089 పోస్టులకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ నిబంధనలు పొందుపర్చాల్సి ఉంటుంది. జిల్లాలవారీగా సబ్జెక్టు టీచర్ల ఖాళీలు, రోస్టర్ విధానం, ఇతర అంశాలను పరిశీలించి నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంటుంది.

నేటినుంచి పీజీ దంతవైద్య కోర్సులకు వెబ్ ఆప్షన్లు

సాక్షి, హైదరాబాద్: పీజీ దంత వైద్య సీట్ల భర్తీకి శనివారం నుంచి 28వ తేదీ వరకు మొదటి విడత వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటించింది. దరఖాస్తుల ప్రక్రియ ముగియడంతో మొదటి విడత వెబ్ ఆప్షన్లకు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. యూనివర్సిటీ పరిధిలోని పీజీ దంత కళాశాలల్లో యాజమాన్య కోటా సీట్లను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు మెరిట్ జాబితాలోని అర్హులైన అభ్యర్థులు కళాశాలల వారీగా ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. మెరిట్ జాబితా, సీట్ల ఖాళీల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. మరింత సమాచారం కోసం www.knruhs.telangana.gov.in వెబ్‌సైట్ చూడాలని యూనివర్సిటీ వర్గాలు ఒక ప్రకటనలో సూచించాయి.

ఈసెట్ ద్వారా 10 వేల సీట్ల భర్తీ

సాక్షి, హైదరాబాద్: డిప్లొమా పూర్తి చేసి ఈసెట్ ద్వారా అర్హత సాధించిన విద్యార్థులకు రాష్ట్ర సాంకేతికవిద్య విభాగం శుక్రవారం తుది కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తిచేసింది. ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశానికి సంబంధించి మొత్తం 10,496 సీట్లు భర్తీ చేసినట్టు వెల్లడించింది. 170 ఇంజనీరింగ్ కాలేజీలు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నాయని, 11,855 సీట్లు అందుబాటులో ఉన్నాయని, తుది కౌన్సెలింగ్ తర్వాత ఇంకా 1,359 సీట్లు మిగిలిపోయాయని తెలిపింది. ఫార్మసీలో 1,228 సీట్లు అందుబాటులో ఉండగా 77 సీట్లు భర్తీ చేశారు. ఇంకా 1,151 సీట్లు మిగిలిపోయాయి. సీట్లు పొందిన విద్యార్థులు శనివారం నుంచి ఈ నెల 29లోగా సంబంధిత కాలేజీల్లో రిపోర్టు చేయాలని పేర్కొంది. తుదిదశ కౌన్సెలింగ్ ముగిసే నాటికి సివిల్ ఇంజనీరింగ్ సీట్లు 99.74 శాతం, మెకానికల్ 95.27 శాతం భర్తీ అయ్యాయి. కంప్యూటర్ కోర్సుల్లో 84.75 శాతం విద్యార్థులకు సీట్లు వచ్చాయి.

ఇదం జగత్



ఉక్రెయిన్ అనే దేశాన్నే హత్య చేశాం.. ఇదెంత సార్!

తగ్గిన పోస్టులు.. పెరిగిన ఆందోళన

- కాక రేపుతున్న టీచర్ పోస్టుల నియామక ప్రకటన
- భారీగా కుదించారంటూ నిరుద్యోగుల నిరసన
- ఆందోళన బాటలో యువత.. ప్రమోషన్లు లేవంటూ టీచర్లలో అసంతృప్తి
- అదనపు పనిభారం తప్పదని ఉపాధ్యాయుల ఆందోళన



పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చేసిన ప్రకటనపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. నిరుద్యోగులు ఆందోళన బాట పడుతుంటే, ఉపాధ్యాయుల నుంచి తీవ్ర విమర్శలు తప్పడం లేదు. 2017 తర్వాత ఇప్పుడు టీచర్ల రిక్రూట్‌మెంట్ ఉంటుందంటే నిరుద్యోగులు భారీ ఆశలు పెట్టుకున్నారు. విద్యాశాఖ దాదాపు 22 వేల ఖాళీలున్నాయని లెక్కగట్టడం దీనికి ఓ కారణం. కానీ ప్రభుత్వం మాత్రం అన్నీ కలిపి దాదాపు 6,612 పోస్టుల భర్తీకే సుముఖత వ్యక్తం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల మంది టెట్ అర్హులు టీచర్ నియామక నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ప్రభుత్వ ప్రకటనలో సగం పోస్టులు కూడా లేకపోవడంతో వాళ్లంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టీచర్లలో అసంతృప్తి

ఇప్పటికే స్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. వేరే సబ్జెక్టు టీచర్లతో బోధన చేయిస్తున్నారు. గత ఏడాది నుంచి ఆంగ్ల మాధ్యమంలో బోధన చేపట్టారు. దీంతో టీచర్లు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఉన్న రెండు సెక్షన్లకూ బోధన చేయాల్సి వస్తోంది. ఈ కారణంగా తమపై పని భారం పెరిగిందని టీచర్లు అంటున్నారు. రాష్ట్రంలోని 26 వేల ప్రభుత్వ స్కూళ్లలో 22 వేల వరకూ ఖాళీలున్నాయని విద్యాశాఖ గత ఏడాది లెక్కలు వేసింది. ఇందులో 13,086 పోస్టులు భర్తీ చేస్తామని ప్రభుత్వమే ప్రకటించింది. ఇటీవల మంత్రి వర్గ ఉపసంఘం కూడా 9,370 పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ప్రస్తుతం ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధించే టీచర్లను కలుపుకొంటే 6,612 మందిని మాత్రమే నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. దీంతో భారీ ఎత్తున చేపట్టాల్సిన నియామకాల జాడే కన్పించలేదు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీలో ఎక్కువగా సైన్స్, సోషల్ సబ్జెక్టు టీచర్ పోస్టులే ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో ఇంగ్లిష్, మాథ్స్ సబ్జెక్టులకు భారీగా కోత తప్పదని ఉపాధ్యాయ వర్గాలు అంటున్నాయి. దీనివల్ల ఉన్న టీచర్లపై పనిభారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదోన్నతులు వస్తే తప్ప మిగతా ఖాళీలు భర్తీ చేయడానికి వీల్లేదని ప్రభుత్వం అంటోంది. న్యాయ వివాదం కొన్నేళ్లుగా నలుగుతోంది, దీంతో తమకు అన్యాయం జరుగుతుందని ఉపాధ్యాయులు అంటున్నారు.

ఆందోళన బాటలో నిరుద్యోగులు

టీచర్ ఉద్యోగాలపై టెట్ ఉత్తీర్ణులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గత ఏడాది వరుస నోటిఫికేషన్ల సమయంలో కొంతమంది ప్రైవేటు ఉద్యోగాలు మానుకొని మరీ కోచింగ్ కేంద్రాలకు వెళ్లారు. ఉపాధ్యాయ నియామక పరీక్షలో ఎలాగైనా మంచి ర్యాంకు సాధించాలని అప్పులు చేసి, హాస్టళ్లలో ఉండి సిద్ధమయ్యారు. కానీ టీచర్ల పదోన్నతులు ఇస్తేనే స్కూల్ అసిస్టెంట్స్, ఎస్‌జీటీ పోస్టుల ఖాళీలు తెలుస్తాయి. వాటిని భర్తీ చేయడానికి వీలుంటుంది. ఇవేవీ జరగకపోవడంతో నిరుద్యోగులు ఏడాదిగా నలిగిపోతున్నారు. తాజాగా 6,612 టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం సమ్మతించడంతో వారు ఆందోళనలకు దిగుతున్నారు. 13,500 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు శుక్రవారం పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు.

జిల్లాల వారీగా టీచర్ పోస్టులు ఇవీ..

- 5,089 ఉద్యోగాల వివరాలను వెల్లడించిన విద్యా శాఖ
- నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 309 పోస్టులు
- పెద్దపల్లి జిల్లాలో అతి తక్కువగా 43 పోస్టులు ఖాళీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్న నేపథ్యంలో.. ఆయా ఖాళీల వివరాలను విద్యాశాఖ శుక్రవారం వెల్లడించింది. మొత్తంగా 5,089 టీచర్ పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతించగా.. జిల్లాల వారీగా భర్తీ చేసే పోస్టుల వివరాలను తెలిపింది.

జిల్లాల వారీగా టీచర్ పోస్టులు ఇవీ..

జిల్లా	ఎస్ఏ	ఎస్జీటీ	ఎల్పీ	పీఈటీ	మొత్తం	జిల్లా	ఎస్ఏ	ఎస్జీటీ	ఎల్పీ	పీఈటీ	మొత్తం
ఆదిలాబాద్	54	206	13	2	275	ములుగు	16	33	15	1	65
ఆసిఫాబాద్	49	214	24	2	289	నాగర్‌కర్నూల్	61	36	15	2	114
భద్రాద్రి	76	101	7	1	185	నల్లగొండ	86	102	25	6	219
హనుమకొండ	21	21	5	7	54	నారాయణపేట్	71	62	20	1	154
హైదరాబాద్	116	163	57	22	358	నిర్మల్	16	91	4	4	115
జగిత్యాల	50	53	37	8	148	నిజామాబాద్	96	183	21	9	309
జనగాం	23	29	17	7	76	పెద్దపల్లి	30	7	5	1	43
భూపాలపల్లి	12	38	17	7	74	రాజన్న సిరిసిల్ల	23	64	12	4	103
గద్వాల	34	77	27	8	146	రంగారెడ్డి	48	117	25	6	196
కామారెడ్డి	97	86	12	5	200	సంగారెడ్డి	80	174	24	5	283
కరీంనగర్	22	52	18	7	99	సిద్దిపేట	60	49	24	8	141
ఖమ్మం	89	83	13	10	195	సూర్యాపేట	80	78	23	4	185
మహబూబాబాద్	35	69	19	2	125	వికారాబాద్	102	77	12	0	191
మహబూబ్‌నగర్	23	47	19	7	96	వనపర్తి	43	19	9	5	76
మంచిర్యాల	36	58	16	3	113	వరంగల్	56	55	21	6	138
మెదక్	70	48	28	1	147	యాదాద్రి	39	38	20	2	99
మేడ్చల్	25	45	7	1	78	మొత్తం	1,739	2575	611	164	5,089

ఎస్సీ గురుకులాల్లో 567 మంది ఉద్యోగుల క్రమబద్ధీకరణ

- ఫైలుపై సంతకం చేసిన సీఎం కేసీఆర్
- ఒకట్రెండు రోజుల్లో ఉత్తర్వులు జారీ: మంత్రి కొప్పుల ఈశ్వర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు శుభవార్త ప్రకటించారు. సుదీర్ఘకాలంగా ఈ సొసైటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు బోధన సిబ్బంది సర్వీసును క్రమబద్ధీకరించారు. ఇందుకు సంబంధించిన ఫైలుపై సీఎం కేసీఆర్ శుక్రవారం సంతకం చేశారు. ఒకట్రెండు రోజుల్లో ఈ మేరకు ఉత్తర్వులు వెలువడనున్నాయి. 16 సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఎస్సీ గురుకుల ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించి ప్రభుత్వ ఉద్యోగులుగా మార్పు చేయడం పట్ల ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌కు కొప్పుల కృతజ్ఞతలు తెలిపారు.

హామీ నిలబెట్టుకున్న సీఎం

ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరిస్తానని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారంటూ తెలంగాణా సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.బాలరాజు, ఎస్.దయాకర్ హర్షం వ్యక్తం చేశారు. సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, జనరల్ గురుకుల సొసైటీల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడం శుభపరిణామమని ఆల్ తెలంగాణ గవర్నమెంట్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్(ఏటీజీఆర్ఈఐఈడబ్ల్యూఏ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కూకుట్ల యాదయ్య, వై.పాపిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎస్టీ, మైనార్టీ సొసైటీల్లోని కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును కూడా క్రమబద్ధీకరిస్తే నూరుశాతం హామీ అమలు చేసినట్లవుతుందని సీఎం కేసీఆర్‌ను కోరారు.

టీటీసీ లోయర్ గ్రేడ్ థియరీ పరీక్ష రేపు

సాక్షి, హైదరాబాద్: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (టీటీసీ) లోయర్ గ్రేడ్ థియరీ పరీక్షను ఆదివారం నిర్వహించనున్నట్టు పాఠశాల పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకూ సైకాలజీ, స్కూల్ అడ్మినిస్ట్రేషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకూ మెథడ్స్ ఆఫ్ టీచింగ్, 3.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ మెథడ్స్ ఆఫ్ టీచింగ్ స్పెషల్ సబ్జెక్టులపై పరీక్ష ఉంటుందని వివరించారు. హాల్ టికెట్లు తమ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

ఓటరు జాబితా 'ప్రక్షాళన'

- ఒకే ఇంటి నంబర్‌తో నమోదైన భారీ సంఖ్యలో ఓట్ల తొలగింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ కోసం ఎన్నికల సంఘం పకడ్బందీ చర్యలు చేపట్టింది. సమగ్ర ఇంటింటి సర్వే ద్వారా పలు రకాల తప్పులను గుర్తించి ఓటరు జాబితా రూపకల్పనలో ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంది. ఒకే ఇంటి నెంబర్‌తో భారీ సంఖ్యలో ఓట్లు నమోదైన విషయాన్ని పలు రాజకీయ పార్టీలు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి దృష్టికి తీసుకురావడంతో పాటు ఓటరు జాబితా తయారీలో తప్పులు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్న కేంద్ర ఎన్నికల సంఘం సూచనల ఆధారంగా ఈ సర్వే చేపట్టినట్లు తెలంగాణ ఎన్నికల కమిషన్ వర్గాలు వెల్లడించారు. కమిషన్ వర్గాల సమాచారం ప్రకారం ఈఆర్‌వో.నెట్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్న ఓటరు డేటాను పరిగణనలోకి తీసుకుని ఇంటింటి సర్వే నిర్వహించడం ద్వారా సూక్ష్మ పరిశీలన జరిపారు. ఈ విధంగా జరిపిన పరిశీలనలో రాష్ట్రంలోని మొత్తం 7,66,557 ఆవాసాల్లో ఉన్న 75,97,433 ఓట్ల సవరణ జరిగింది. హైదరాబాద్ నగరంలోని కార్వాన్ నియోజకవర్గంలో అత్యధికంగా 17,398 ఆవాసాల్లోని 2,20,316 మంది ఓటర్లు, యాకుత్‌పురా పరిధిలోని 14,883 ఆవాసాల్లో ఉన్న 1,84,060 ఓటర్లు, రాజేంద్రనగర్‌లోని 13,901 ఆవాసాలకు చెందిన 1,57,972 ఓటర్లు, ఎల్బీనగర్ పరిధిలోని 13,987 ఆవాసాల్లో ఉన్న 1,48,378 ఓటర్లు, మల్కాజిగిరి నియోజకవర్గంలోని 10,649 ఆవాసాల్లోని 1,06,336 మంది ఓటర్లను గుర్తించి సవరణలు చేశారు. దీంతో పాటు ఓటర్ కార్డులోని చిరునామాతో పాటు ఇతర మార్పులు, ఓటరు కార్డుల మార్పు కోసం ఫారం-8 ద్వారా వచ్చిన దాదాపు 9,00,115 దరఖాస్తులను ఎన్నికల కమిషన్ పరిష్కరించింది. ఇందులో అత్యధికంగా ఆసిఫాబాద్ నుంచి 25,026 దరఖాస్తులు రాగా గద్వాల, హుస్నాబాద్, ఖానాపూర్, మక్తల్‌ల నుంచి ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్లు కమిషన్ వర్గాలు వెల్లడించాయి. పట్టణ ప్రాంతాల విషయానికి వస్తే అత్యధికంగా సిద్దిపేటలో 18,148, శేరిలింగంపల్లిలో 17,312, మేడ్చల్‌లో 16,569 దరఖాస్తులు రాగా, వాటిని సమగ్రంగా పరిశీలించిన అనంతరం పరిష్కరించినట్లు ఎన్నికల కమిషన్ వర్గాలు తెలిపాయి.

చనిపోయిన ఓటర్ల పేర్లు తొలగించాలి

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో చనిపోయిన, ఇతర ప్రాంతాలకు తరలిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) వికాస్‌రాజ్‌కు బీజేపీ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ నియోజకవర్గాల్లో ఒకే కుటుంబానికి చెందిన వారి ఓట్లను ఒకే పోలింగ్ బూత్‌లోకి మార్చాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం బీజేపీ జాతీయ ఈసీ కమిటీ సభ్యుడు ఓం పాఠక్, రాష్ట్రపార్టీ ఈసీ ఎఫైర్స్ కమిటీ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి నేతృత్వంలో కమిటీ సభ్యులు ఏడెల్లి అజయ్ కుమార్, పొన్న వెంకటరమణ, కేతినేని సరళ, కొల్లూరి పవన్ కుమార్ వినతిపత్రం సమర్పించారు. శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాను తప్పుల తడకగా తయారుచేసిన ఈఆర్‌వోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఈవోకు మరో వినతి పత్రం అందజేశారు.

చట్ట సభల్లో యాదవుల నాయకత్వం పెరగాలి

- ఐక్యతతోనే యాదవుల అభివృద్ధి: మంత్రి తలసాని
- త్వరలో 25 లక్షల మంది యాదవులతో భారీ సభ నిర్వహిస్తామని వెల్లడి
- బీసీలే బీ ఫామ్ ఇచ్చే స్థాయికి ఎదగాలి: ఈటల
- రాజ్యాధికారం వస్తేనే మన బతుకులు మారతాయి: వీహెచ్



యాదవ్ యుద్ధభేరి సభలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నాగోల్: రాష్ట్రంలో యాదవుల జనాభా ప్రకారం రాజకీయ పార్టీలు అవకాశాలు కల్పించాలని యాదవ సంఘాలు ముక్తకంఠంతో డిమాండ్ చేశాయి. యాదవుల సంక్షేమం కోసం చేపట్టే కార్యక్రమాలు స్పష్టం చేయాలని కోరాయి. అఖిల భారత యాదవ మహాసభ యాదవ విద్యావంతుల వేదిక, యాదవ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నాగోల్‌లో యాదవ యుద్ధభేరి పేరిట బహిరంగ సభ నిర్వహించారు. యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పలు పార్టీలు, యాదవ సంఘాల నేతలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మంత్రి తలసాని మాట్లాడుతూ చట్టసభల్లో యాదవుల నాయకత్వం పెరగాలని చెప్పారు. త్వరలో హైదరాబాద్‌లో 25లక్షల మంది యాదవులతో భారీ బహిరంగ సభ నిర్వహించి సత్తా చాటుతామన్నారు. యాదవుల్లో ఐక్యత కోసం ప్రతి జిల్లా కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి, దీపావళి సదర్ వేడుకలు పెద్ద ఎత్తున జరుపుకోవాలని కోరారు. యాదవుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామని చెప్పారు.

యాదవ నాయకుడు ప్రధాని కావాలి

బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో టికెట్ల కేటాయింపులో గొల్ల కురుమలతోపాటు అన్ని బీసీ, ఎంబీసీ కులాలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తామని వెల్లడించారు. రాజకీయ పార్టీల బీఫామ్ కోసం బిక్కుబిక్కుమనే పరిస్థితి దాపురించిందని, బీసీలే బీ ఫామ్‌లు ఇచ్చే పరిస్థితి రావాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలందరూ ఏకమై రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు. అంబర్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్‌ను యాదవ సంఘ నేత ఆర్.లక్ష్మణ్ యాదవ్‌కు ఇస్తామని, ఐక్యంగా గెలిపించుకోవాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల ప్రదాత బీపీ మండల్ మనవడు, ఢిల్లీ వర్సిటీ ప్రొఫెసర్ సూరజ్ మండల్ యాదవ్ మాట్లాడుతూ దేశంలో 20 శాతం జనాభా ఉన్న యాదవ నాయకుడు ప్రధానమంత్రి కావాల్సిన అవసరముందని తెలిపారు. తెలంగాణలో 18 శాతం జనాభా ఉన్నప్పటికీ రాజకీయ ప్రాతినిధ్యం నామమాత్రమేనని ఆందోళన వ్యక్తం చేశారు. యాదవుల అభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యంపై యాదవ డిక్లరేషన్‌ను చలకాని వెంకట్ యాదవ్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బడుగు లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

తాబేలు తన అంగాలను ఉపసంహరించుకున్నట్లుగా,
అతడు ఇంద్రియాలను విషయ వస్తువుల నుండి ఎప్పుడు
ఉపసంహరించుకుంటాడో అప్పుడు ప్రజ్ఞ నిలకడగా ఉంటుంది.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 26 ఆగస్టు 2023

ప్రిగోజిన్ ఉత్థాన పతనాలు!

కిరాయి సైన్యం అధిపతి యెవ్‌గనీ ప్రిగోజిన్ బుధవారం విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడని రెండు రోజుల తర్వాత రష్యా అధికారికంగా ధ్రువీకరించింది. రెండు నెలల క్రితం తిరుగుబాటు ప్రకటించి మాస్కోవైపు శతఘ్నులతో దూసుకెళ్లిన ప్రిగోజిన్ అధ్యక్షుడు పుతిన్ మినహా ఇతర ఉన్నత స్థాయి నాయకగణంపై విమర్శలు గుప్పిస్తూ వచ్చాడు. కానీ ఉన్నట్టుండి జూన్ 23న నేరుగా తన కిరాయి సైనికులతో మాస్కో దిశగా దండయాత్రకు తరలివెళ్లి అందరినీ ఆశ్చర్య పరిచాడు. బహుశా పుతిన్ మినహా మిగిలినవారిపైనే తాను ఆగ్రహిస్తున్నట్టు నమ్మించ గలుగుతున్నానని ప్రిగోజిన్ భ్రమపడి వుండొచ్చు. ఈ అలజడి పుతిన్‌ను భయోత్పాతంలో ముంచిం దనీ, ఆయన అజ్ఞాతానికి పోయారనీ ప్రచారం జరిగింది. ఆ మర్నాడు మీడియాతో మాట్లాడిన పుతిన్, ప్రిగోజిన్‌ను 'నమ్మక ద్రోహి'గా అభివర్ణించారు. ఇలా ప్రకటించటం మరణ శాసనమేనని అప్పట్లో చాలామంది జోస్యం చెప్పారు. రష్యాలో లేదా విదేశాల్లో ఉంటూ విమర్శలు గుప్పించే రాజకీయ ప్రత్యర్థులు కావొచ్చు, దేశ రహస్యాలను వేరే దేశాలకు విక్రయించినవారు కావొచ్చు పుతిన్ దృష్టిలో నమ్మక ద్రోహులే. ఆ హిట్ లిస్ట్‌లోని వారిలో తప్పనిసరై ఒకరిద్దరిని జైల్లో పడేశారు తప్ప ఇంతవరకూ ఎవరినీ ప్రాణాలతో వదల్లేదు. ఇతరేతర అంశాలైతే వేరుగానీ, నమ్మక ద్రోహాన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించబోనని గతంలో పుతిన్ చేసిన ప్రకటనను ప్రిగోజిన్ వ్యవహారంలో కొందరు గుర్తుచేశారు. నిజానికి బెలారస్ మధ్యవర్తిత్వంతో ప్రిగోజిన్ శాంతించారని, అతనికీ, ప్రభుత్వానికీ అంగీకారం కుదిరిందని ప్రకటన వచ్చినప్పుడు ప్రిగోజిన్‌కు రోజులు దగ్గరపడినట్టేనని చాలామంది అనుకున్నారు. అదే సమయంలో పుతిన్ అతన్ని క్షమిస్తారన్న విశ్లేషణలూ వచ్చాయి. ఎందుకంటే ఉక్రెయిన్‌పై ఏడాదిన్నర క్రితం దురాక్రమణ యుద్ధం మొదలెట్టాక రష్యా చేజిక్కించుకున్న పెద్ద నగరం బఖ్‌మూత్. వేరే నగరాలు చిక్కినట్టే చిక్కి చేజారగా, బఖ్‌మూత్ మాత్రం ఇంకా రష్యా నియంత్రణలోనే ఉంది. ఈ విజయం నిస్సందేహంగా ప్రిగోజిన్‌దే. అందుకే అతన్ని మళ్లీ తన దారికి తెచ్చుకుని ఉక్రెయిన్‌ను ముప్పుతిప్పలు పెట్టడానికి పుతిన్ వినియోగించుకుంటారని భావించారు. కానీ ప్రిగోజిన్ తలరాతను పుతిన్ అప్పటికే వేరే రాశారు. తన 23 యేళ్ల ఏలుబడిలో పుతిన్ కఠినాత్ముడన్న పేరు తెచ్చుకోవటానికే మొగ్గుచూపారు. కానీ ప్రిగోజిన్ విషయంలో దాన్నంతటినీ తాత్కాలికంగానైనా దిగమింగి అతను క్షేమంగా వెళ్లిపోవటానికి అంగీకరించి, ఆ ఇమేజ్‌ను పోగొట్టుకున్నారు. చివరకు క్రెమ్లిన్‌లో అతని కిరాయి సైన్యంతో సమావేశమైనప్పుడు అందులో ప్రిగోజిన్ సైతం పాల్గొనటానికి పుతిన్ అనుమతించారు.

ఈ ఆధునిక కాలంలో కూడా రాజ్యాలు తమ మనుగడ కోసం కిరాయి సైన్యాలపై ఆధారపడటం వింతగానే ఉంటుంది. అమెరికాలో పోలీసు విధులు కాంట్రాక్టులకు ఇచ్చే అలవాటున్నా సైన్యం విషయంలో ఆ విధానం పెట్టుకోలేదు. ఆఫ్రికా ఖండంలో ప్రస్తుతం అనేక దేశాలు ప్రిగోజిన్ సేవలను వాడుకుంటున్నాయి. వాస్తవానికి పాశ్చాత్య దేశాల మీడియా చాన్నాళ్లుగా ప్రిగోజిన్ గురించి కథనాలు వెలువరిస్తున్నా ఆ సైన్యం ఉనికిని పుతిన్ ధ్రువీకరించలేదు. ఆఫ్రికా ఖండ దేశాల్లో అతని సైనికుల ఆగడాలపై అనేకానేక కథనాలు వచ్చాయి. ఆఖరికి ఉక్రెయిన్ దురాక్రమణ యుద్ధ సమయంలోనూ కిరాయి సేనల ఉనికిని రష్యా అధికారికంగా అంగీకరించలేదు. తమ చట్టాలు ప్రైవేటు సైనిక కంపెనీలను అంగీకరించబోవన్నదే పుతిన్ చెబుతూవచ్చిన జవాబు. కానీ జూన్ 23 నాటి తిరుగుబాటు ఈ వ్యవహారాన్ని బజారున పడేసింది. మాస్కోలో మాఫియా తరహా రాజ్యం నడుస్తోందన్న పాశ్చాత్య మీడియా ప్రచారానికి బలం చేకూర్చింది. రెండు దశాబ్దాలపైగా పుతిన్ అటువంటి రాజ్యాన్నే నడుపుతున్నారనడానికి ఆయన వ్యతిరేకుల అనుమానాస్పద మరణాలను చాలామంది ఉటంకిస్తుంటారు. పుతిన్ అవినీతిపై కథనాలు రాస్తున్న మహిళా జర్నలిస్టు అనా పొలిటికోవ్‌స్కియాను 2006లో కాల్చిచంపారు. ఫెడరల్ సెక్యూరిటీ అధికారిగా పనిచేస్తూ 2006లో బ్రిటన్ పరారైన అలెగ్జాండర్ లిత్వినెంకో లండన్‌లోని దుకాణంలో రేడియో ధార్మిక పదార్థం కలిసిన టీ తాగి మరణించారు. పుతిన్ అధికారానికి రావటానికి తోడ్పడిన బోరిస్ బెరిజోవ్‌స్కీ ఆయన ఆగ్రహానికి గురై బ్రిటన్ వెళ్లిపోయినా 2013లో అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు పోగొట్టుకున్నాడు. 2015లో బోరిస్ నెమ్త్సోవ్ అనే భౌతిక శాస్త్రవేత్తను క్రెమ్లిన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిచంపారు. ఒకప్పుడు పుతిన్‌కు సన్నిహితంగా మెలిగి తర్వాత అతనికి బద్ధ వ్యతిరేకి అయిన అలెక్సీ నవాల్ని సైతం 2020లో ఒక రేడియో ధార్మిక పదార్థం బారినపడ్డారు. ఆయన చచ్చి బతికాడనుకుంటే ఇప్పుడు నిరవధికంగా జైల్లో మగ్గుతున్నాడు.

చట్టసభలూ, ఇతర వ్యవస్థలూ సజావుగా పనిచేస్తున్నట్టు కనబడే రాజ్యాల్లో నియంతలు బయల్దేరి వాటిని భ్రష్టుపట్టించటం, అధికారంలో శాశ్వతంగా కొనసాగేట్టు చూసుకోవటం కొత్తేమీ కాదు. కానీ పుతిన్ తీరే వేరు. రాజ్య వ్యవస్థలకు సమాంతరంగా చట్టాలతో సంబంధం లేకుండా పటిష్ఠమైన సొంత వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని వాటిద్వారా వ్యతిరేకులను అణచివేసే విధానం ఆయనది. ఇది అత్యంత ప్రమాదకరమైనది. ఒకప్పుడు జర్మనీ నియంత హిట్లర్‌ను మట్టికరిపించే క్రమంలో 87 లక్షల మంది సైనికులతో సహా దాదాపు 2 కోట్ల 70 లక్షలమంది ప్రాణాలు పోగొట్టుకున్న దేశానికి ఈ పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించివుండరు. ఏదేమైనా ప్రిగోజిన్ ఉత్థాన పతనాలు వర్తమాన ప్రపంచ దుఃస్థితికి అద్దం పడతాయి.

నవభారత జయధ్వానం

విశ్లేషణ


శ్యామ్ శరణ్

చంద్రుడి మీద దిగడానికి ప్రయత్నించిన రష్యాకు చెందిన లూనా–25 విఫలమై, కొన్ని రోజుల క్రితం పేలిపోయిన సమయంలోనే చంద్రయాన్–3 విజయవంతమైంది. భారతదేశాన్ని అభివృద్ధి చెందుతున్న శక్తిగా భావిస్తున్న అంతర్జాతీయ అవగాహనను ఇది బలపరుస్తుంది. చంద్రయాన్–3 విజయం భారతదేశ ప్రతిష్ఠతో పాటు, బ్రిక్స్ భాగస్వాముల మధ్య మన దేశ స్థితిని మెరుగుపరుస్తుంది. ఆర్థిక, సాంకేతిక సామర్థ్యాలు లేకుండానే భారతదేశం అగ్రగామి శక్తిగా నటిస్తున్నట్లు చైనా భావిస్తుంటుంది. భారత శాస్త్రీయ, సాంకేతిక నైపుణ్యానికి సంబంధించిన ప్రదర్శనలను– అవి అణు, అంతరిక్ష రంగాలైనా, ఐటీ విజయాలైనా చైనా ఆశ్చర్యంతోనే స్వీకరించింది. ఇతర దేశాల నుండి 'అరువు' తెచ్చుకున్నవిగా వాటిని కొట్టిపారేసింది. చంద్రయాన్–3 సాధించిన అత్యుత్తమ విజయాన్ని కూడా ఇదే పద్ధతిలో కొట్టివేయడం కష్టం.

ఉత్కంఠ వీడిపోయింది. నిర్దేశించిన రోజు, సమయం, ప్రదేశంలో చంద్రుని ఉపరితలంపై ల్యాండ్ అయిన చంద్రయాన్–3 సాధించిన మహాద్భుతమైన విజయం పట్ల భారతదేశం సంబరాలు చేసుకుంటోంది. ప్రపంచ నాయకత్వ చిహ్నాలలో సాంకేతిక పురోగతి ఒకటి. అమెరికా, రష్యా, చైనా తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ నిలిచింది. చంద్రుని దక్షిణ ధ్రువం వద్ద చంద్రయాన్–3 ల్యాండ్ అయింది. అన్వేషణ కోసం ప్రత్యేకంగా సవాలు విసిరేటటువంటి, పెద్దగా అర్థం చేసుకోని స్థలాన్ని ఎంచుకున్న ఏకైక అంతరిక్ష దేశం భారత్. చంద్రుని అసలైన తత్వం ఇప్పటికీ కలిగి ఉన్నది దాని ధ్రువ ప్రాంతాలు మాత్రమే అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దాని ఉపరితలం చాలా వరకు పెద్ద, చిన్న గ్రహ శకలాల శిథిలాలతో కప్పబడి ఉంది. ఈ శకలాలు వెయ్యేళ్లపాటు చంద్రునిపై పెనుదాడి చేసి, దానిపై పొరలు పొరలుగా పేరుకుపోయాయి. చంద్రుడి లోపలి నీటి కోసం వెతకడంతో సహా 'ప్రజ్ఞాన్ రోవర్' చేయబోయే ప్రయోగాలు, మనకు సమీపంలోని ఖగోళ పొరుగు గురించిన కొత్త జ్ఞానాన్ని వెల్లడిస్తాయి. సున్నితంగా ఉన్న మన సొంత భూగ్రహం చరిత్ర, తయారీలపై మన అవగాహనకు కూడా ఇది సాయపడుతుంది.

ఎదుగుతున్న శక్తి

ప్రధాని నరేంద్ర మోదీ బ్రిక్స్ దేశాల (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) శిఖరాగ్ర సదస్సు కోసం దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో ఉన్నప్పుడు, యాదృచ్ఛికంగా అంతరిక్ష పరిశోధనలో ఈ గొప్ప విజయం లభించింది. చంద్రయాన్–3 విజయం భారతదేశ ప్రతిష్ఠతో పాటు, బ్రిక్స్ భాగస్వాముల మధ్య మన దేశ స్థితిని మెరుగుపరుస్తుంది. అంతేకాకుండా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆర్థికంగా, సాంకేతికంగా సామర్థ్యం ఉన్న దేశాల సమూహంగా మొత్తం బ్రిక్స్ ప్రభావాన్ని కూడా ఇది ఇతోధికంగా పెంచుతుంది.

చంద్రుడి మీద దిగడానికి ప్రయత్నించిన రష్యాకు చెందిన లూనా–25 విఫలమై, కొన్ని రోజుల క్రితం పేలిపోయిన సమయంలోనే చంద్రయాన్–3 విజయవంతమైంది. ఇప్పటికే అంతరిక్ష ప్రయోగాల్లో అనుభవజ్ఞ దేశంగా ఉన్న రష్యా తన మూన్ ల్యాండింగ్ ప్రాజెక్టును భారతదేశం ప్రారంభించిన కొన్ని రోజులకే ప్రారంభించడం యాదృచ్ఛికమే కావొచ్చు. అయినా రష్యా వైఫల్యం, భారత్ విజయాలను పక్కపక్కనే అంచనా వేయడం జరుగుతుంది. వనరుల పరంగా, అధునాతన అంతరిక్ష శక్తిగా దాని హోదాను కొనసాగించడంలో రష్యా వైఫల్యాన్ని దాని క్షీణత, అసమర్థతా లక్షణాలుగా చూస్తున్నారు. అంతరిక్ష ప్రయోగం అనేది అత్యంత ప్రమాదకరమైన, ఖరీదైన అన్వేషణ. 2019 సెప్టెంబరులో చంద్రయాన్–2 చంద్రుని ఉపరితలంపై కూలిపోయినప్పుడు భారతదేశం కూడా నిరాశకు గురైంది. ఇప్పుడు రష్యా తన ఎదురుదెబ్బను అధిగమించి అంతరిక్ష రంగంలో మళ్లీ తన శక్తి పుంజుకోదని నమ్మడానికి ఎటువంటి కారణం లేదు. అయినా దృక్కోణాలు ముఖ్యమవుతాయి. భారతదేశాన్ని అభివృద్ధి చెందుతున్న శక్తిగా, రష్యాను క్షీణిస్తున్న శక్తిగా భావిస్తున్న అంతర్జాతీయ అవగాహనను ఇది బలపరుస్తుంది. సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశాల సరసన సమానమైన ర్యాంక్‌లో తాను లేనందున, ఉక్రెయిన్ యుద్ధం ఆ స్థానాన్ని ఏ విధంగానూ దెబ్బతీయలేదనే భావనను ఎదుర్కోవడానికి రష్యా ఈ ప్రాజెక్టును చేపట్టినట్లయితే, అది తన ప్రయత్నంలో విఫలమైంది. రష్యన్ మీడియాలో కూడా, విఫలమైన మూన్ మిషన్ అందుకున్న పరిమితమైన కవరేజీని చూసినట్లయితే, దాని రాజకీయ, మానసిక తిరోగమనం చాలా స్పష్టంగా తెలుస్తోంది.


ప్రజ్ఞాన్ రోవర్ పంపిన చంద్రుడి ఉపరితల ఫొటో

చైనా వైఖరి మారేనా?

ప్రపంచ ఆర్థిక, సాంకేతిక శక్తిగా చైనా ఎప్పుడూ భారతదేశాన్ని చిన్నచూపు చూస్తోంది. ఆర్థిక, సాంకేతిక సామర్థ్యాలు లేకుండానే భారతదేశం అగ్రగామి శక్తిగా నటిస్తున్నట్లు చైనా భావిస్తుంటుంది. భారతదేశ శాస్త్రీయ, సాంకేతిక నైపుణ్యానికి సంబంధించిన ప్రదర్శనలను– అవి అణు, అంతరిక్ష రంగాలైనా, ఐటీ విజయాలైనా చైనా ఆశ్చర్యంతోనే స్వీకరించింది. ఇతర దేశాల నుండి 'అరువు' తెచ్చుకున్నవిగా వాటిని చైనా కొట్టిపారేసింది. అయితే చంద్రయాన్–3 సాధించిన అత్యుత్తమ విజయాన్ని కూడా చైనా ఇదే పద్ధతిలో కొట్టివేయడం కష్టం. బహుశా భారత్ సాధించిన ఈ విజయంతో చైనా తన అహంకారాన్ని తొలగించుకుని, నమ్రతతో కాకపోయినా మర్యాదపూర్వకంగా వ్యవహరించాల్సిన దేశంగా భారత్‌ను పరిగణించవచ్చు. ఒకరినొకరు సమానంగా చూసుకుంటేనే ఇరు దేశాలు తమ సంబంధాలను మరింత మెరుగుపరుచుకోగలవు. చంద్రయాన్–3 విజయానికి చైనా ఎలా స్పందిస్తుందనేది, తూర్పు లదాఖ్‌లోని వాస్తవ నియంత్రణ రేఖ వద్ద హింసాత్మక ఘర్షణల తర్వాత భారతదేశం పట్ల దాని వైఖరిలో ఏమైనా మార్పు ఉందా అనేది సూచిక అవుతుంది.

చంద్రయాన్–3 ప్రాజెక్టులో విజయం రాబోయే జీ20 శిఖరాగ్ర సమావేశానికి ఆతిథ్య దేశంగా భారత్ హోదాను పెంచుతుంది. శిఖరాగ్ర సమావేశానికి ఇప్పటికే లభిస్తున్న విస్తృత ప్రచారం నేపథ్యంలో, చంద్రయాన్–3 భారత్ కీర్తి ప్రతిష్ఠలకు మరో పార్శ్వాన్ని జోడిస్తుందనడంలో సందేహం లేదు. శిఖరాగ్ర సదస్సు చర్చల సమయంలో, భారతదేశ స్వరం ఎక్కువ దృష్టిని ఆకర్షిస్తుంది. దాని వివిధ కార్యక్రమాలు గౌరవప్రదంగా పరిగణించబడతాయి. అయితే ఇవన్నీ తదనంతర చర్యలలో ప్రతిఫలిస్తాయో, లేదో చూడాలి.

దూరదృష్టి ఫలితం

భారతదేశం కోసం, దాని అభివృద్ధి వ్యూహం కోసం తగిన పాఠాలు ఉన్నాయి. ఇప్పుడు చంద్రయాన్–3 సాధించినదంతా కూడా దేశం పేదగా ఉండి, అభివృద్ధి చెందుతున్నదైనప్పటికీ... అత్యాధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించే శ్రేష్ఠమైన సంస్థలను స్థాపించాలనే తొలితరం నాయకుల దూరదృష్టి ఫలితమే. భారతదేశ అణు కార్యక్రమాన్ని అభివృద్ధి చేసిన అటామిక్ ఎనర్జీ కమిషన్‌ను 1948లోనే తొలి ప్రధాన మంత్రి నెహ్రూ ఛైర్మన్‌గా ఏర్పాటైంది. అప్పటి రాజకీయ నాయకత్వం ఈ అధునాతన శాస్త్రీయ సాధనకు ఇచ్చిన అధిక ప్రాముఖ్యతను ఇది ప్రతిబింబిస్తుంది.

వాస్తవానికి, అంతరిక్ష పరిశోధనను సుప్రసిద్ధ శాస్త్రవేత్త విక్రమ్ సారాభాయి నేతృత్వంలో 1961లో ఏర్పాటు చేసిన ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ అని పిలిచే డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆటమిక్ ఎనర్జీకి అప్పగించారు. దీని తర్వాత 1972లో ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) ఏర్పాటైంది.

ఆటమిక్ ఎనర్జీ కమిషన్ నమూనాలో ఇండియన్ స్పేస్ కమిషన్‌ను ప్రధానమంత్రి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ రెండు కమిషన్లు భారతదేశ అధునాతన శాస్త్ర, సాంకేతికతకు మూలస్తంభాలుగా నిలిచి, గణనీయమైన స్వయంప్రతిపత్తిని అనుభవిస్తున్నాయి. అంతేకాకుండా వీటికి బాగా నిధులు సమకూరుస్తున్నారు కూడా. ఈ ముందస్తు, దూరదృష్టితో కూడిన నిర్ణయాలు, భారతీయ శాస్త్రవేత్తలు, సాంకేతిక రంగ కార్మికుల కృషి వల్ల ఇప్పుడు భారతదేశం చేపట్టిన తాజా అంతరిక్ష యాత్ర విజయవంతమైంది.

వ్యాసకర్త విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ప్రకృతి ధర్మం



కుటుంబానికి అశుభం తెచ్చారని భావించే ఇళ్లల్లో ఇవ్వాళ (వరలక్ష్మీ వ్రతం రోజు) పీరియడ్స్ వచ్చిన అమ్మాయిలకు రెండు నిమిషాల ప్రార్థన! నిజంగా మీకూ, మీ వాళ్లకూ వరలక్ష్మీ వ్రతం వరాలు ఇవ్వాలనుకుంటే, రుతుస్రావంలో ఉన్న మహిళలను చీడలా చూడకండి. – చిన్మయి శ్రీపాద, గాయని

అలా అనవచ్చా?



మణిశంకర్ అయ్యర్‌కు కాంగ్రెస్ పార్టీ అన్నీ ఇచ్చింది. అయినప్పటికీ ఎన్నికలు దగ్గరలో ఉన్న ప్రతిసారీ పార్టీని దెబ్బతీసే ప్రకటనలు చేస్తారు. 'పీవీ నరసింహారావు భారతదేశ మొదటి బీజేపీ ప్రధానమంత్రి' అని ఆయన వ్యాఖ్యానించాల్సింది కాదు.
– తెహసీన్ పూనావాలా, వెంచర్ క్యాపిటలిస్ట్

సాహో భారత్



ఇండియా అభివృద్ధి పథంలో ఉందని చెప్పడానికి చంద్రయాన్–3 మిషన్ విజయవంతం కావడం మరో ఉదాహరణ. తరువాతి పదేళ్లకు వివిధ దేశాల వృద్ధి రేట్లను అంచనావేస్తూ నేను గతంలో విడుదల చేసిన ఆర్థికారోగ్య సూచీలో ఇండియా 7 శాతంతో ఫస్ట్‌స్థానంలో ఉంది. 1984 ప్రాంతంలో డెంగ్ జియావోపింగ్ నాయకత్వంలోని చైనాను ఇది గుర్తుచేస్తోంది. ఇండియాకు అభినందనలు. – రే డాలియో, ఇన్వెస్టర్

భారీ నష్టం



హిమాలయాల్లోని భారీ జల విద్యుదుత్పత్తి ప్రాజెక్టులు విపరిణామాలకు దారితీస్తాయి. వాటిని హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్‌లో ఎక్కడ నిర్మించినా ; బీజేపీ, కాంగ్రెస్ హయాంలలో ఎవరు అనుమతించినా!
– రామచంద్ర గుహ, చరిత్రకారుడు


అంతరంగం



చెప్పాలంటే, ఉద్ధవ్ ఠాక్రేకు రథసారథ్యం వహించాలని శరద్ పవార్ నిర్ణయించుకున్నారు. తన సైన్యాన్ని మాత్రం మోదీ కోసం పోరాడటానికి పంపారు.
– టోనీ జోసెఫ్, రచయిత

ఔషధ రంగ అభివృద్ధికి ఆకాశమే హద్దు!

అభిప్రాయం


టి.కె. అరుణ్

సమకాలీన ఆర్థిక విధాన రూపకల్పన విషయంలో 'లైసెన్సింగ్' అనేది ఒక చెత్త పదం. కానీ, స్వయం ప్రకటిత స్వేచ్ఛా – మార్కెట్ ఛాంపియన్ల నుండి విమర్శలను దృష్టిలో ఉంచుకొని అయినా కేంద్ర ప్రభుత్వం ఔషధాల ఎగుమతికి లైసెన్సింగ్‌ను తప్పనిసరిగా ప్రవేశపెట్టాలి. ప్రపంచ ఫార్మసీగా మంచిపేరున్న భారత్ నుంచి స్వేచ్ఛగా ఇతర దేశాలకు ఔషధాల ఎగుమతిని అనుమతించడం అభిలషణీయం కాదు. భారతదేశం ఫార్మారంగంలో సాధించగలిగింది ఎంతో ఉంది. ఇప్పుడు అది తన సామర్థ్యంలో స్వల్ప భాగాన్నే ఉపయోగిస్తోందని చెప్పవచ్చు. నిజానికి జనరిక్ ఫార్మా పరిశ్రమ ఒక్కటే ఇప్పుడున్న పరిమాణానికి పది రెట్లు విస్తరించగలదు.

జూలై 28న, చెన్నైకి చెందిన ఓ కంపెనీ తయారు చేసి, ఇరాక్‌కి ఎగుమతి చేసిన 'కోల్డ్ అవుట్' అనే దగ్గు సిరప్‌లో ఆమోదయోగ్యమైనదిగా భావించే దానికంటే 21 రెట్లు ఎక్కువ స్థాయిలో ఇథైల్ గ్లైకాల్ ఉందని బ్లూమ్‌బెర్గ్ సంస్థ నివేదించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఆమోదయోగ్యమైనదిగా గుర్తించిన అమెరికా ఆధారిత ల్యాబ్‌లో ఈ పరీక్ష జరిగింది.

ఈ సంవత్సరం ఏప్రిల్‌లో మార్షల్ దీవుల్లో, మైక్రోనేషియాలో దగ్గు సిరప్, 'గుయిఫెనెసిన్' టీజీకి చెందిన కలుషిత నమూనాలను డబ్ల్యూహెచ్ఓ కనుగొన్నట్లు బ్లూమ్‌బెర్గ్ నివేదించింది. ఈ సిరప్‌ను భారతీయ ఫార్మాస్యూటికల్ సంస్థ క్యూపీ ఫార్మాకెమికల్స్ తయారు చేసింది. సిరప్‌లో 'ఆమోదించలేని మొత్తంలో డైథైలీన్ గ్లైకాల్, ఇథిలీన్ గ్లైకాల్ కలుషితాలు' ఉన్నాయనీ, వీటిని వినియోగించినప్పుడు మానవులకు అవి విషపూరితమైనవిగా మారతాయనీ ఈ నివేదిక పేర్కొంది. మరో బ్లూమ్‌బెర్గ్ నివేదిక (ఆగస్టు 1) ప్రకారం, ఒక భారతీయ ఔషధ ఉత్పత్తి సంస్థ, తక్కువ నాణ్యత గల అబార్షన్ మాత్రలను ప్రపంచవ్యాప్తంగా పంపిణీ చేసే లాభాపేక్షలేని సంస్థకు విక్రయించింది. గాంబియా, ఇండోనేషియా, ఉజ్బెకిస్తాన్‌లలో మరణాలకు దారి తీసిన ఘటనలను, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో వినియో గదారుల కంటిచూపును దెబ్బతీసేందుకు దారితీసిన భారతీయ ఫార్మా ఎగుమతిదారుల గత లోపాలను ఇటువంటి కథనాలు చాలా వరకు వివరిస్తాయి.

భారతదేశం తన ఫార్మా పరిశ్రమ ప్రతిష్ఠను దిగజార్చుకోలేదు. ఎయిడ్స్ వ్యాధి నివారణకు సంబంధించి తక్కువ ధరకు మందులను తయారు చేసి ఆఫ్రికాలో లక్షలాది మంది ప్రజల ప్రాణాలను కాపాడిన చరిత్ర భారతీయ ఫార్మా రంగానికి ఉంది. అంతర్జాతీయ బహుళజాతి మందుల తయారీ సంస్థలు వసూలు చేసే ధరలతో పోల్చితే భారతీయ మందుల ధర చాలా తక్కువగా ఉంది. దీంతో ప్రజాగ్రహానికి గురైన ఆ యా ఔషధ కంపెనీలు తమ ధరలను భారతదేశం అందించే స్థాయికి తగ్గించాయి.

ప్రపంచ ఔషధ మార్కెట్ విలువ లక్ష కోట్ల (ట్రిలియన్) డాలర్లు. భారతదేశ ఔషధాల తాజా ఎగుమతి విలువ సంవత్సరానికి 25 బిలియన్ డాలర్లు. ఈ రంగంలో భారతదేశం ఎంతో సాధించగలిగిన సామర్థ్యం కలిగి ఉంది. జనరిక్ ఫార్మా పరిశ్రమ ఒక్కటే ప్రస్తుత పరిమాణం కన్నా దేశంలో కనీసం 10 రెట్లు సులభంగా విస్తరించి ఉద్యోగాల కల్పన, పన్నుల ఆదాయం, తిరిగి పెట్టుబడి పెట్టగల లాభాలను పెంచగలదు.



కొందరు చిన్న ఆపరేటర్లకు తాము ఎగుమతి చేసేఞ మందుల నాణ్యతను పరీక్షించగలిగే సామర్థ్యం అంతగా లేకపోయినా ఎగుమతులు చేస్తున్నారు. ఇందువల్ల మార్కెట్‌లకు నాసిరకం మందులు సరఫరా అయ్యి ఈ రంగంలో మనకున్న పేరు ప్రఖ్యా తులు దెబ్బతింటున్నాయి. అటువంటివారిని అడ్డుకొనాలి.

భారతదేశం ఔషధ ఉత్పత్తి ప్రక్రియలపై, తుది ఉత్పత్తిపై కఠినమైన నాణ్యతా నియంత్రణను ఏర్పాటు చేయాలి. ఒక ప్రధాన సమస్య ఏమిటంటే నాణ్యతా నియంత్రణ ప్రమాణాలు రాష్ట్రం రాష్ట్రానికీ మారుతూ ఉంటాయి. ముందు దీన్ని సరి చేయాలి. నాణ్యతా నియంత్రణకు అన్ని రాష్ట్రాలలో, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఏకరీతి ప్రమాణాలను, ప్రామాణిక ప్రోటోకాల్‌లను కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలి.

భారత దేశంలో దాదాపు 3,000 ఫార్మా కంపెనీలు, 10,000 తయారీ యూనిట్లు ఉన్నాయి. ఇవన్నీ కలిసి 2021లో రూ. 3.36 లక్షల కోట్ల విలువైన ఔషధాలను ఉత్పత్తి చేశాయి. ఈ కంపెనీలలో టాప్ 50 సంస్థలు మొత్తం ఆదాయంలో 75 శాతం వాటాను కలిగి ఉన్నాయి. అంటే మిగిలినవి చిన్న కంపెనీలన్నమాట. వాటిలో కొన్ని భవిష్యత్తులో సిప్లా, సన్ ఫార్మా వంటి పెద్ద సంస్థలుగా అభివృద్ధి చెందవచ్చు. కానీ వాటిలోనే కొన్ని నకిలీ డ్రగ్స్‌ను ఉత్పత్తి చేసే రకం సంస్థలు కూడా ఉండవచ్చు. ఇవి చేసే తప్పులకు జరిమానా, జైలు శిక్ష విధించే బదులుగా డబ్బుల జరిమానాతో సరిపెట్టేలా చట్ట సవరణ జరిగిందనే వార్తలు రావడం ఆందోళనకరం.

ఔషధాల ఎగుమతులకు సంబంధించి భారతదేశం తప్పనిసరిగా లైసెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలి. కనీసం రూ. 1,000 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీలను మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అనుమతించాలి. ప్రతీ సరకుల ఎగుమతుల కన్‌సైన్‌మెంటులోని సరుకు నాణ్యతను తప్పక తనిఖీ చేయాలి. భారతదేశ సొంత అక్రిడిటేషన్ బోర్డులోనూ, డబ్ల్యూహెచ్ఓ ద్వారా గుర్తింపు పొందిన ప్రామాణికమైన నాణ్యతా సంస్థలోనూ ఈ నమూనాలను పరీక్షించాలి.

దీని అర్థం, చిన్న కంపెనీలు ఫార్మా రంగంలోకి ప్రవేశించడాన్ని భారతదేశం నిషేధిస్తుందనా? కానే కాదు. వారు చిన్న సంస్థలను ప్రారంభించవచ్చు. దేశీయ విపణిలో విక్రయించవచ్చు, నాణ్యత నియంత్రణను నిర్వహించే పెద్ద ఎగుమతిదారులకు విక్రయించవచ్చు. పైగా విక్రయాల అర్హతను, విక్రయాల పరిమాణ సామర్థ్యాన్ని సాధించి ఆ తర్వాత ఎగుమతి చేయడం ప్రారంభించవచ్చు.

ఫార్మా ఎగుమతులలో కఠినమైన నాణ్యతా నియంత్రణను అనుసరించడం ద్వారా, మనం స్వేచ్ఛా–మార్కెట్ ప్రాథమిక మూలసూత్రంలోని చిన్న భాగాన్ని మాత్రమే కోల్పోతాము. కానీ గెలుచుకోవడానికి మనకు లక్ష కోట్ల డాలర్ల ఫార్మా మార్కెట్ ఉందని గ్రహించడం చాలా ముఖ్యం.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

మార్పునకు తలొగ్గాల్సిందే!

సందర్భం


బలభద్రపాత్రుని రమణి

ఇరవై మూడేళ్ల క్రితం రచయితగా సినిమా ఇండస్ట్రీకి వచ్చినప్పటి నుంచీ ఇండస్ట్రీలో వస్తున్న మార్పులనూ, నిశ్శబ్దంగా నిష్క్రమిస్తున్న కొన్ని విలువలనూ, క్రమశిక్షణనూ చూశాను. కథా, స్క్రీన్ ప్లే, మాటలూ వేరే వారి చేత రాయించిన డైరెక్టర్లు సంవత్సరానికి 9 సినిమాలు చేస్తూ, 100కు పైగా చిత్రాలు తీయడం చూశాను. డైరెక్షన్‌తో పాటూ పైన పేర్కొన్న పనులనూ చేసినట్లు తన ఒక్కరి పేరు వేసుకుంటూ తక్కువ సంఖ్యలో సినిమాలు తీసిన కొత్త తరం దర్శకులనూ చూశాను. ప్రతి 10 ఏళ్లకీ ఒక ట్రెండ్ సెట్టింగ్ డైరెక్టర్ వస్తూనే ఉంటారు. వారి ప్రతిభకి ఆశ్చర్యపోతూనే ఉంటాం. బాపు 'ముత్యాల ముగ్గు', విశ్వనాథ్ 'శంకరా భరణం', జంధ్యాల 'శ్రీవారికి ప్రేమలేఖ', రాంగోపాల్ వర్మ 'శివ', సుకుమార్ 'ఆర్య', శేఖర్ కమ్ముల 'హ్యాపీ డేస్', తరుణ్ భాస్కర్ 'పెళ్లి చూపులు' ఆ యా దశాబ్దాల్లో సినిమాలకి కొత్త బాటలు వేశాయి. ఎంతో మంది కొత్త తరహా కథలతో సినిమా వ్యాకరణం కొద్ది కొద్దిగా మారుస్తూ వచ్చారు.

ఇప్పుడు హీరో అక్కర లేకుండా చిన్న బడ్జెట్‌లో కొన్ని మంచి సినిమాలు వస్తున్నాయి. కథాబలం ఉన్న సినిమాలు కూడా అక్కడక్కడా వస్తున్నాయి. కానీ పెద్ద పెద్ద బడ్జెట్ సినిమాలు కొన్నింటిలో కొత్త కథలు ఉండటం లేదు. పాన్ ఇండియా మూవీస్ తెర మీదకొచ్చాక ఆ యా భాషలలో సినిమాలు విడుదల చెయ్యడానికి అన్య భాషా నటులు కూడా ఉండేలా జాగ్రత్తపడుతున్నారు. ఆకాశంలో హెలీకాప్టర్స్, నీటిలో సబ్ మెరైన్స్, 1000 మంది వచ్చినా హీరో ఒక్కడే వాళ్లని ఖండ ఖండాలుగా చీల్చి చెండాడుతూ మొహం అంతా నెత్తురోడుతూ, హై రేంజ్ ఆర్ఆర్‌తో కాల రుద్రుడిలా నిప్పులు చిమ్ముతూ ఎగురుతూ ఫైట్స్ చేయడం... క్లైమాక్స్ అయిపోయాక మళ్లీ ఫ్రెష్‌గా హీరోయిన్ మెడలో తాళి కడ్తూ ఖరీదైన కాస్ట్యూమ్స్‌లో!

ఇవే కథలు కొంచెం చిన్న బడ్జెట్స్‌లో అప్పటి అగ్ర హీరోలతో చిన్నప్పుడు చూశాం. ఇద్దరు హీరోయిన్స్‌తో ఫ్యామిలీ స్టోరీస్ కూడా చాలా చూశాం. ఏం చూసినా కథ ఉండేది. ఇప్పటి న్యూ ఏజ్ ట్రెండ్ మాత్రం కథ అవసరం లేదు. జీవితం గురించి ఏ ఆలోచనా లేకుండా తాగుతూ, జోకులేస్తూ, అల్లరిచిల్లరగా గడిపేసే ముగ్గురో, నలుగురో యువకుల ఇతివృత్తం ఆధారంగా సినిమాలు వస్తున్నాయి. తల్లి తండ్రులని లక్ష్య పెట్టకపోవడం, తాగడం, బూతులు మాట్లాడడం, చివరికి తమ పనుల వల్ల చిక్కుల్లో ఇరుక్కొని బయటపడడం... మొత్తం మీద ఇప్పటి ట్రెండ్ ఇది.

2019లో నేను నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ జ్యూరీ మెంబర్‌గా ఉన్నప్పుడు 66వ నేషనల్ అవార్డ్స్‌లో 'మహానటి' సినిమాలో నటనకు గాను కీర్తి సురేశ్‌కు బెస్ట్ ఏక్ట్రెస్ అవార్డు రావడం, 2021 సంవత్సరంలో 69వ నేషనల్ అవార్డ్స్ జ్యూరీ మెంబర్‌గా ఉన్నప్పుడే అల్లు అర్జున్‌కి 'పుష్ప' సినిమాకి గాను 'బెస్ట్ ఏక్టర్' అవార్డు రావడం నాకు ఆనందదాయకం. నేను జ్యూరీలో ఉండగా మొదటిసారి మన తెలుగు సినిమా హీరో ఒకరికి బెస్ట్ ఏక్టర్ అవార్డు రావడం నా భాగ్యం. నేను జ్యూరీలో ఉన్న ఏడే ఓ లిరిక్ రైటర్‌గా చంద్రబోస్‌కు నేషనల్ అవార్డు రావడం ఇంకా ఆనందం. జ్యూరీ డ్యూటీ అనేది థ్యాంక్ లెస్ జాబ్. తాము అనుకున్న వారికి రాకపోతే తిట్టడానికి చాలా మంది సిద్ధంగా ఉంటారు.



నా చిన్నతనం నుండీ వస్తున్న నేషనల్ అవార్డ్స్‌ని గమనిస్తే అప్పుడు సహజత్వానికీ, బడుగు జీవితాల కష్టాలకీ, ప్రాంతీయ కట్టుబాట్లూ అలవాట్లూ, సమస్యలూ ఉన్న చిత్రాలకి ఎక్కువగా పెద్ద పీట వేసే వారు. ఇప్పుడు కాలంతో బాటు మారుతూ పాపులర్, కమర్షియల్ సినిమాలకి కూడా వారి పెర్ఫార్మెన్స్, వివిధ రంగాలలో నైపుణ్యం బట్టి అవార్డ్స్ వస్తున్నాయి. మార్పుని ఆహ్వానించాలి. విలువలను కోల్పోకూడదు. భారతదేశం అంటేనే సంస్కృతీ సంప్రదాయాలకి ఆలవాలం కదా!

వ్యాసకర్త రచయిత్రి,
69వ జాతీయ సినిమా అవార్డుల జ్యూరీ మెంబర్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, తిథి: శు.దశమి రా.7.03 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: మూల రా.3.46 వరకు, తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: ప.12.20 నుండి 1.52 వరకు, తదుపరి రా.2.15 నుండి 3.46 వరకు, దుర్ముహూర్తం: ఉ.5.46 నుండి 7.27 వరకు, అమృతఘడియలు: రా.9.34 నుండి 11.07 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 5.48, సూర్యాస్తమయం: 6.17.

మంచిప్ప.. మస్తు బిజినెస్

చిన్న ఊరే.. అయినా రోజువారీ టర్నోవర్ రూ. పది లక్షలు

అంగడి జరిగే బుధవారం రూ. 20 లక్షలపైనే

మంచిప్పకు 'రిజర్వాయర్ ముంపు' భయం

జలాశయానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న జనం

'మంచిప్ప' గ్రామంలో బిజినెస్ మస్తుగా జరుగుతోంది. రోజువారీ టర్నోవర్ రూ. పది లక్షలు కాగా, అంగడి జరిగేరోజు రూ. 20 లక్షలపైనే.. చాలా చిన్న గ్రామమే అయినా ఇంత పెద్ద మొత్తంలో వ్యాపారం ఎలా జరుగుతుందో తెలుసుకుందాం.



మంచిప్ప గ్రామంలో అంగడి ▲

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: చుట్టూరా అటవీప్రాంతం... అక్కడక్కడా కొన్ని గిరిజన తండాలు. మధ్యలో ఉన్న గ్రామమే మంచిప్ప. ఇది నిజామాబాద్ జిల్లా మోపాల్ మండల పరిధిలో ఉంది. అటవీ విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో చుట్టుపక్కల తండాలు, గ్రామాలకు మంచిప్పనే వ్యాపార కూడలి. రోజువారీగా ఈ గ్రామానికి ఆరు నుంచి ఏడు వేలమంది రాకపోకలు సాగిస్తారు. చుట్టు పక్కల ఉన్న 9 తండాలతో పాటు అమ్రాబాద్, ఎల్లమ్మకుంట, బైరాపూర్, కాల్పోల్ గ్రామాల ప్రజలకు ఇక్కడి మార్కెట్‌కు నిత్యం వస్తారు. ప్రతిరోజూ రూ.10 లక్షల వరకు వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. అంగడి జరిగే బుధవారం మాత్రం వ్యాపారం రెండింతలు ఉంటుంది. మంచిప్ప గ్రామ జనాభా 5 వేలు కాగా, చుట్టుపక్కల తండాల్లో మరో 12 వేల జనాభా ఉంది.

బిర్యానీకి భలే డిమాండ్

ఇక్కడ ప్రతిరోజూ హోటళ్లు కళకళలాడుతుంటాయి. దాదాపు 12 హోటళ్లు ఉన్నాయి. బిర్యానీకి భలే డిమాండ్ ఉంటోంది. ప్రతిరోజూ సగటున 2 క్వింటాళ్ల చికెన్, అంగడిరోజు 5 క్వింటాళ్లు అమ్ముడవుతుంది. బుధవారం రోజు మటన్ అమ్మకాలు రెండు క్వింటాళ్ల వరకు ఉంటుండగా, ఆదివారం ఒక క్వింటా అమ్మకాలు ఉంటాయి.

మంచిప్పకు 'ముంపు' భయం

మంచిప్ప చెరువు, కొండెం చెరువులను కలిపి రిజర్వాయర్ నిర్మించే ప్రతిపాదనలు ఉన్నాయి. మొదట్లో ప్రాణహిత–చేవెళ్ల కింద 0.8 టీఎంసీల నీటి సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించాలని అనుకున్నారు. ప్రస్తుతం దానిస్థానంలో కాళేశ్వరం 21వ ప్యాకేజీ ద్వారా ఈ రిజర్వాయర్ సామర్థ్యాన్ని 3.5 టీఎంసీలకు పెంచారు. దీంతో 1,200 ఎకరాల సాగుభూమి, 800 ఎకరాల అటవీభూమి, అమ్రాబాద్ పంచాయతీ పరిధిలో గుండ్యానాయక్‌తండా, చంద్రునాయక్ తండా, కొక్యానాయక్ తండా, వెంకట్రాంనాయక్ తండా, బైరాపూర్‌పరిధిలో బైరాపూర్ తండా, మోతిరామ్‌నాయక్ తండా, కొక్యానాయక్ తండా, పోచమ్మ తండా, మంచిప్ప పరిధిలోని తండాలు కూడా ముంపునకు గురవుతున్నాయి. దీంతో మంచిప్పతోపాటు సమీప గ్రామస్తుల్లో ఆందోళన నెలకొంది. బిజినెస్ కూడా బాగా పడిపోతుందని జలాశయానికి వ్యతిరేకంగా గ్రామస్తులు పోరాటం చేస్తున్నారు. గ్రామ అభివృద్ధి కమిటీ నిధుల్లో సగభాగం ఉద్యమానికే ఖర్చు చేస్తున్నారు.



ఉపాధి గల్లంతే

చుట్టుపక్కల గ్రామాల రైతులకు వ్యవసాయమే ప్రధాన ఆధారం. మంచిప్పలో మాత్రం వ్యాపారంతో ఎక్కువ మందికి ఉపాధి లభిస్తోంది. ముంపు కారణంగా ఇక్కడి వ్యాపారం పూర్తిగా పడిపోతుంది. దీంతో పని వెతుక్కుంటూ చెట్టుకొకరు, పుట్టకొకరు వెళ్లాల్సిన పరిస్థితి.

– దర్పస్తు కామేశ్వర్‌రావు, వస్త్ర వ్యాపారి

ఈ ఊరికి పిల్లనివ్వడం లేదు



మంచిప్ప చుట్టుపక్కల భూములు, గ్రామాలు ముంపునకు గురయ్యే నేపథ్యంలో మా ఊరి యువకులకు పిల్లను కూడా ఇవ్వడం లేదు. దీంతో భవిష్యత్ విషయమై ప్రజల్లో ఆందోళన నెలకొంది. జలాశయ సామర్థ్యం తగ్గించి ముంపు లేకుండా చేయాలి.

– బాణాపురం జగదీష్, మంచిప్ప ఉప సర్పంచ్



మంచిప్పకు రోజుకు మూడుసార్లు వస్తా

మాది బైరాపూర్. వ్యవసాయం చేస్తూనే ట్రాక్టర్ కిరాయికి ఇస్తాను. ప్రస్తుతం వివిధ పనుల నిమిత్తం ప్రతిరోజూ మూడుసార్లు మంచిప్పకు రాకపోకలు సాగిస్తున్నాను. నా మాదిరిగా చుట్టుపక్కల ఊర్లకు చెందిన చాలామంది ప్రతిరోజూ మంచిప్పకు వచ్చి వెళుతుంటారు.

– బాదావత్ వెంకట్రామ్, రైతు, బైరాపూర్

బీఆర్‌ఎస్‌కు ఇవే చివరి ఎన్నికలు: ఆర్.కృష్ణయ్య

- బీసీల ప్రాతినిధ్యం విషయంలో ఏపీని చూసి నేర్చుకోవాలి



కాచిగూడ (హైదరాబాద్): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలను విస్మరించిన బీఆర్‌ఎస్ పార్టీకి ఇవే చివరి ఎన్నికలు అవుతాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఇప్పటికైనా పునరాలోచన చేసుకుని బీసీలకు జనాభా ప్రాతిపదికన సీట్లివ్వాలని, లేదంటే వారంతా బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల ఓటమికి కృషి చేస్తారని హెచ్చరించారు. కాచిగూడలో శుక్రవారం వీరశైవ లింగాయత్ అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 35 లక్షల జనాభా గల వీరశైవ లింగాయత్‌లకు ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. గత ఎన్నికలతో పోల్చిచూస్తే బీసీలకు 4 సీట్లు తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రమైన ఏపీలో వైఎస్సార్‌సీపీ అధినేత, అక్కడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడగకుండానే బీసీలకు అన్నీ ఇస్తున్నారని, ఆయనను చూసి మనం చాలా నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో ముగ్గురు మాత్రమే బీసీ మంత్రులు ఉన్నారని, ఏపీలో 11 మంది బీసీ మంత్రులున్నారని గుర్తు చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలను గుర్తించి సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ గౌరవ అధ్యక్షుడు సంఘమేశ్వర్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, శివకుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరులో స్వల్ప భూకంపం

- వారంలో ఇది రెండోసారి

మణుగూరు రూరల్, వరంగల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో శుక్రవారం తెల్లవారుజామున 4.43 గంటలకు భూకంపం సంభవించింది. ఒక్కసారిగా భూమి కంపించడంతో నిద్రలో ఉన్న ప్రజలు ఆందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈనెల 19న కూడా ఇక్కడ భూమి కంపించగా, వారం వ్యవధిలోనే మళ్లీ జరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాగా, శుక్రవారం భూప్రకంపనలు రిక్టర్ స్కేల్‌పై 3.6గా నమోదు కాగా, భూఅంతర్భాగంలో సుమారు 30కిలోమీటర్ల మేర కదలికలు ఏర్పడినట్లు అధికారిక వర్గాల సమాచారం. కాగా మణుగూరు ప్రాంత సింగరేణి గనుల్లో చేపడుతున్న బాంబు పేలుళ్లతోనే భూప్రకంపనలు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.

వరంగల్‌లో భూకంపం అంటూ వైరల్

వరంగల్‌లో శుక్రవారం తెల్లవారుజామున స్వల్ప భూకంపం సంభవించిందని సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. తెల్లవారుజామున 4 :43 గంటలకు భూమి కంపించిందని, దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 3.6గా నమోదు అ య్యిందని, భూ అంతర్భాగంలో 30కిలోమీటర్ల లోపల ఈ కదలికలు సంభవించి నట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ పేర్కొన్నట్లుగా ఓ వార్త చక్కెర్లు కొట్టింది. కాగా, భూకంపంపై ఎలాంటి సమాచారం లేదని అధికారులు పేర్కొన్నారు.

మాపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయండి

- హైకోర్టులో ఎన్నికల అధికారుల పిటిషన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికల అఫిడవిట్ వ్యవహారంలో తమపై నమోదైన కేసును కొట్టేయాలని 2018 నాటి అసెంబ్లీ ఎన్నికల అధికారులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల సమయంలో దాఖలు చేసిన అఫిడవిట్‌ను శ్రీనివాస్‌గౌడ్ ట్యాంపర్ చేశారని, అయినా అధికారులు పట్టించుకోలేదని పేర్కొంటూ మహబూబ్‌నగర్‌కు చెందిన చలువగాలి రాఘవేంద్రరాజు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ప్రైవేట్ పిటిషన్ వేశారు. నామినేషన్‌తోపాటే అఫిడవిట్ వేశారని, ఆ తర్వాత అఫిడవిట్‌ను సవరించారని, దీనికి సహకరించిన ఎన్నికల అధికారులపై కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఎన్నికల అధికారులు, మంత్రి, రెవెన్యూ అధికారులపై కేసు నమోదు చేయాలని పోలీసులను జూలై 31న కోర్టు ఆదేశించింది. అయితే పోలీసులు కేసు నమోదు చేయడంలేదని పిటిషనర్ మరోసారి జడ్జి దృష్టికి తేవడంతో ఆగస్టు 11న విచారణ చేపట్టి.. సాయంత్రం 4 గంటల్లోగా కేసు నమోదు చేసి వివరాలు వెల్లడించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో పోలీసులు మంత్రి, ఎన్నికల అధికారులపై కేసు నమోదు చేశారు. అయితే తమపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని నాటి కలెక్టర్లు(ఎన్నికల అధికారులు) రొనాల్డ్ రాస్, వెంకటరావు, ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, పద్మశ్రీ గురువారం హైకోర్టులో లంచ్ మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. రోస్టర్ ప్రకారం వీటిపై తాను విచారణ చేపట్టలేనని, చీఫ్ జస్టిస్ ముందు పిటిషన్లు ఉంచాలని జస్టిస్ కె.లక్ష్మణ్ రిజిస్ట్రీని ఆదేశించారు. ఇప్పటికే ఎన్నికల అధికారులపై కేసు నమోదు చేయాలని చెప్పిన జడ్జిని హైకోర్టు సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఇదే కేసులో నిందితుడైన నోటరీ అడ్వొకేట్ రాజేంద్రప్రసాద్ కేసు కొట్టివేయాలంటూ గతవారం పిటిషన్ దాఖలు చేయగా ప్రభుత్వానికి, రాఘవేంద్రరాజుకు నోటీసులు జారీ చేసింది.

రాష్ట్రంలో మార్స్ గ్రూప్ పెట్టుబడి మరో రూ.800 కోట్లు



మార్స్ గ్రూప్ ప్రతినిధులతో మంత్రి కేటీఆర్. చిత్రంలో ఐటీ కార్యదర్శి జయేశ్‌రంజన్

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయంగా పెంపుడు జంతువులు (పెట్స్) తినే ఆహార ఉత్పత్తుల్లో పేరొందిన 'మార్స్ గ్రూప్'తెలంగాణలో మరో రూ.800 కోట్లు పెట్టుబడిగా పెడుతున్నట్లు ప్రకటించింది. అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావుతో శుక్రవారం మార్స్ చీఫ్ డేటా, అనలిటిక్స్ ఆఫీసర్ శేఖర్ కృష్ణమూర్తి నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ అయింది. సిద్దిపేటలో ఇప్పటికే తమ పెంపుడు జంతువుల (పెట్స్) ఫుడ్ తయారీ ప్లాంట్ ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఆ బృందం వెల్లడించింది. మొదట కేవలం రూ.200 కోట్ల పెట్టుబడితో కార్యకలాపాలు ప్రారంభించి, ఆ తర్వాత మరో రూ.500 కోట్లతో విస్తరించామని పేర్కొంది. తాజాగా మరో రూ.800 కోట్లతో విస్తరణ ప్రణాళికను చేపడతామని మార్స్ గ్రూప్ ప్రతినిధి బృందం వెల్లడించింది. పెట్ కేర్, పెట్ ఆహార ఉత్పత్తులకు పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో కేవలం తయారీకే కాకుండా పరిశోధన, అభివృద్ధి తదితర రంగాల్లో ఉన్న అవకాశాలను ఈ బృందం వివరించింది.

కొత్త పెట్టుబడులు, విస్తరణలకు ప్రాధాన్యత

కొత్త పెట్టుబడులు, ఇప్పటికే ఉన్న సంస్థల విస్తరణ కార్యకలాపాలకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని ఈ సందర్భంగా కేటీఆర్ వ్యాఖ్యానించారు. రూ.200 కోట్ల పెట్టుబడితో కార్యకలాపాలు ప్రారంభించిన మార్స్ గ్రూప్ పెట్టుబడులు విడతల వారీగా రూ.1500 కోట్లకు చేరడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ భేటీలో ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, ప్రత్యేక కార్యదర్శి ఇ.విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో 'ఆమ్నికామ్' గ్లోబల్ కేపబిలిటీ సెంటర్

- 25 వేలకు పైగా ఉద్యోగాలు.. కేటీఆర్ హర్షం

సాక్షి, హైదరాబాద్: గ్లోబల్ మీడియా, మార్కెటింగ్, కమ్యూనికేషన్ రంగాల్లో పేరొందిన 'ఆమ్నికామ్'హైదరాబాద్‌లో కొత్తగా భారీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. తద్వారా కొత్తగా సుమారు 25 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపింది. అమెరికా పర్యటనలో ఉన్న ఐటీ మంత్రి కేటీ రామారావు గురువారం రాత్రి న్యూయార్క్‌లో ఆమ్నికామ్ ప్రతినిధి బృందంతో భేటీ అయ్యారు. మీడియా రంగంలో హైదరాబాద్‌కు పెరుగుతున్న ప్రాధాన్యతకు ఈ ప్రకటన అద్దం పడుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ ఏడాది మే నెలలో ఆమ్నికామ్ బృందంతో జరిగిన సంప్రదింపులు ఆగస్టు నాటికి ఫలవంతం కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేశారు. అభివృద్ధి కోసం తాము సాగిస్తున్న కృషికి అనుగుణంగా అనేక సంస్థలు ముందుకు వస్తున్నాయన్నారు. ఆమ్నికామ్ గ్రూప్ డిజిటల్ ఆపరేషన్ గ్లోబల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ జైద్ అల్ రషీద్ ఆమ్నికామ్ ప్రతినిధి బృందానికి నేతృత్వం వహించారు.

కాంగ్రెస్‌కు అభ్యర్థులే లేరు

- మంత్రులు పట్నం మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్



ర్యాలీలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో మంత్రి మహేందర్‌రెడ్డి

కొడంగల్ రూరల్ (రంగారెడ్డి జిల్లా): యాభై స్థానాల్లో నిలబెట్టేందుకు సరైన అభ్యర్థులే దొరకని కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి పదవి నాదంటే..నాదేనని వాదులాడుకోవడం విడ్డూరంగా ఉందని గనుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మంత్రి పదవి చేపట్టిన అనంతరం శుక్రవారం మహేందర్‌రెడ్డి తొలిసారి కొడంగల్ వచ్చారు. మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, స్థానిక ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ ఆలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం మంత్రులు మాట్లాడుతూ.. ఆర్నెల్లకొకసారైనా కొడంగల్‌కు రాని రేవంత్‌రెడ్డి ఎన్నికల వేళ ప్రగల్భాలు పలకడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. నరేందర్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సీఎం కేసీఆర్ కృతనిశ్చయంతో ఉన్నారని, ఎత్తిపోతల ద్వారా ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారే రోజు దగ్గరలోనే ఉందన్నారు.

పేపర్ లీడర్ కావాలా.. పీపుల్ లీడర్ కావాలా?

- ప్రజలే ఆలోచించాలని మంత్రి హరీశ్‌రావు పిలుపు
- బీఆర్‌ఎస్‌లో చేరిన ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు



బీఎస్ రావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న హరీశ్‌రావు. చిత్రంలో వినోద్, గంగుల

సాక్షి, హైదరాబాద్: ప్రజలకు చేసే మంచి పనులకంటే ఎక్కువగా ఎదుటివారిని తిట్టిన వార్తలకే మీడియాలో ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. పేపర్ లీడర్ కావాలో, సరైన పీపుల్ లీడర్ కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని ఆలోచించాలని చెప్పారు. స్ట్రాంగ్ లీడర్ కావాలో లేదా రాంగ్ లీడర్ కావాలో నిర్ణయించుకోవాలన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ రావు, వివిధ జిల్లాల అధ్యక్షులు, వైద్యులు శుక్రవారం తెలంగాణ భవన్‌లో మంత్రులు హరీశ్ రావు, గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ, వైద్యులు తెలంగాణ భవన్‌లోకి వచ్చి పార్టీలో చేరడం గొప్ప విషయమన్నారు. ఒకప్పుడు బెంగాల్ ఏది ఆచరిస్తే, దేశం అది అనుసరిస్తుందనే వారని, ఇప్పుడు ఆ మాటను తెలంగాణ తిరగరాసిందని చెప్పారు. '24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చే రాష్ట్రం తెలంగాణ తప్ప దేశంలో మరోటి లేదు. అందుకే స్ట్రాంగ్ లీడర్ చేతిలో రాష్ట్రం ఉండాలి, రాంగ్ లీడర్ చేతిలో పెట్టొద్దు. మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేసేందుకు అందరం కలిసి కృషి చేద్దాం'అని హరీశ్‌రావు చెప్పారు.

న్యాయం నా వైపే.. సుప్రీంకోర్టుకు వెళ్తా

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



గద్వాల రూరల్: కోర్టును తప్పుదోవ పట్టించి ఎక్స్‌పార్టీ ఆర్డర్ తీసుకొచ్చి ఎమ్మెల్యే అయిపోయామనుకోవడం అవివేకమని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బీజేపీ నేత డీకే అరుణనుద్దేశించి వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆయన జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన తీర్పును జీర్ణించుకోలేక తనపై అబద్ధపు అభియోగాలు మోపి కోర్టును సైతం మభ్యపెట్టి తనకు వ్యతిరేకంగా ఆర్డర్ తీసుకోవడం మొగుడిని కొట్టి మొగుసాలకెక్కడం లాంటిదని విమర్శించారు. కోర్టు నుంచి తనకు ఎలాంటి నోటీసులు రాలేదని.. తనపై మోపిన అన్ని అభియోగాలకూ సమాధానం ఉందని.. వీటన్నింటిని కూడా న్యాయస్థానంలో వినిపించి వాళ్లు చేసిన అభియోగాలన్నీ అబద్ధమని నిరూపిస్తానని స్పష్టం చేశారు. పూడూరులోని భూములను 2018 సెప్టెంబర్‌లో, రెండు కార్లను 2016లో ఇతరులకు విక్రయించానని చెప్పారు. బ్యాంకు ఖాతాలకు సంబంధించి రెండు ఖాతాల్లో లావాదేవీలు జరగనందున వాటిని ఎన్నికల అఫిడవిట్‌లో చూపెట్టలేదన్నారు. వీటన్నింటిని కోర్టులో నిరూపించుకుని తనపై తప్పుడు ఆరోపణలు చేసిన డీకే అరుణపై పరువు నష్టం దావా వేస్తానని కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా...

భారత్‌లో జరిగే జీ20 భేటీకి పుతిన్ దూరం



మాస్కో: వచ్చే నెలలో భారత్‌లో జరిగే జీ20 శిఖరాగ్ర సమావేశంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పాల్గొనడం లేదు. ఉక్రెయిన్‌లో ఏడాదికి పైగా కొనసాగుతున్న స్పెషల్ మిలటరీ ఆపరేషన్‌పైనే ఆయన దృష్టంతా ఉందని శుక్రవారం రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ తెలిపింది. దీంతోపాటు బిజీ షెడ్యూల్ ఉన్నందున అధ్యక్షుడు పుతిన్ ఢిల్లీకి వెళ్లడం లేదని పేర్కొంది. అధ్యక్షుడు పుతిన్ జీ20 సమావేశంలో వర్చువల్‌గా పాల్గొనే విషయం తర్వాత ఖరారవుతుందని క్రెమ్లిన్ ప్రతినిధి పెష్కోవ్ చెప్పారు. సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో జీ20 దేశాల నేతల సమావేశాలు ఢిల్లీలో జరగనున్నాయి. తాజాగా జోహన్నెస్‌బర్గ్‌లో జరిగిన బ్రిక్స్ భేటీకి కూడా పుతిన్ వెళ్లలేదు.

బెయిల్ ఇస్తే బ్యాడ్మింటన్ ఆడుతున్నారు

లాలూ బెయిల్ రద్దు చేయాలని సుప్రీంకెక్కిన సీబీఐ

న్యూఢిల్లీ: దాణా కుంభకోణం కేసులో అయిదేళ్ల శిక్ష అనుభవిస్తూ అనారోగ్య కారణాలతో బెయిల్‌పై బయట ఉన్న ఆర్‌జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు సీబీఐ ఝలక్ ఇచ్చింది. వైద్య చికిత్స కోసం బెయిల్‌పై బయటకు వచ్చిన లాలూ హాయిగా బ్యాడ్మింటన్ ఆడుకుంటున్నారని, వెంటనే ఆయన బెయిల్ రద్దు చేయాలని శుక్రవారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. జార్ఖండ్ హైకోర్టు అనారోగ్య కారణాలతో ఆయనకు బెయిల్ ఇచ్చిన తీర్పు కాపీని, లాలూ బ్యాడ్మింటన్ ఆడుతున్న వీడియోని అదనపు సొలిసిట్ జనరల్ ఎస్.వి. రాజు సుప్రీంకు సమర్పించారు. తదుపరి విచారణని అక్టోబర్ 17కి న్యాయస్థానం వాయిదా వేసింది.

కేరళలో ఘోర ప్రమాదం

వయనాడ్: కేరళలోని వయనాడ్ జిల్లాలో ఘోర ప్రమాదం సంభవించింది. జీపు లోయలో పడిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న 9 మంది మహిళలు ప్రాణాలు కోల్పోయారు. వారంతా టీ తోటల్లో పనిచేసే కార్మికులే. వలాద్–మక్కిమల రహదారిలో శుక్రవారం సాయంత్రం 3.30 గంటలకు ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో జీపులో డ్రైవర్‌తో సహా మొత్తం 14 మంది ఉన్నారు. ప్రైవేట్ టీ ఎస్టేట్‌లో పని ముగించుకొని ఇళ్లకు తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు చెప్పారు. జీపు లోయలో పడిపోయి 9 మంది మహిళలు మరణించడం పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంతాపం ప్రకటించారు.

జపాన్‌లో 12 ఏళ్ల క్రితం భూకంపం, సునామీ ధాటికి దెబ్బతిన్న ఫుకుషిమా దైచీ అణు విద్యుత్ కేంద్రం నుంచి వ్యర్థ జలాలను పసిఫిక్ మహా సముద్రంలోకి విడుదల చేయడం ఆందోళన రేపుతోంది. చైనా, దక్షిణ కొరియాతో పాటు స్వదేశంలో కొన్ని సంస్థల అభ్యంతరాలను బేఖాతర్ చేస్తూ జపాన్ ప్రభుత్వం రేడియో ధార్మిక జలాలను విడుదల చేస్తోంది. ఈ నీటి విడుదల ఎంత వరకు సురక్షితం ? జపాన్ వాదనలేంటి ? నిపుణులు ఏమంటున్నారు ?

అణుజలం.. ఆందోళన స్వరం



ఫుకుషిమా ప్లాంట్ నుంచి పసిఫిక్ సముద్రంలోకి వ్యర్థ జలాల విడుదల వివాదాస్పదం

2011, మార్చి 11. జపాన్‌ను తీవ్ర భూకంపం కుదిపేసింది. రిక్టర్ స్కేలుపై 9.0గా నమోదైన ఈ తీవ్ర భూకంపంతో సునామీ ముంచెత్తింది. చెర్నోబిల్ అణు ప్రమాదం తర్వాత అంతటి విధ్వంసం జరిగింది. ఫుకుషిమా అణు విద్యుత్ ప్లాంట్‌లోని మూడు అణు రియాక్టర్లలోని కూలింగ్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. దీంతో అణు రియాక్టర్లను చల్లార్చడం తప్పనిసరి అయింది. అప్పట్నుంచి భారీగా అణు వ్యర్థ జలాలు పేరుకుపోయాయి. ప్రమాదం జరిగిన పన్నెండేళ్లకు ఐక్యరాజ్య సమితికి చెందిన ఇంటర్నేషనల్ ఆటమిక్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఏఈఏ) అనుమతితో జపాన్‌లోని టోక్యో ఎలక్ట్రిక్ పవర్ కంపెనీ (టెప్కో) అణు జలాలను శుద్ధి చేసి పసిఫిక్ మహా సముద్రంలోకి విడుదల చేసే వివాదాస్పద కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. అణుజలాలతో సముద్రంలో జీవజాలం ప్రమాదంలో పడుతుందని, పర్యావరణానికి, మానవాళి ఆరోగ్యానికి ముప్పు ఉంటుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నా జపాన్ ఆగడం లేదు. జపాన్ నుంచి దిగుమతయ్యే సముద్ర ఉత్పత్తులపై చైనా నిషేధం విధించింది. జపాన్, దక్షిణ కొరియాలో ఈ జలాల విడుదల ఆపాలంటూ నిరసనలు పెరుగుతున్నాయి.

ప్లాంట్‌లో పేరుకుపోయిన వ్యర్థ జలాలు	13.4 కోట్ల టన్నులు

రేడియో ధార్మిక జలాలను శుద్ధి చేసినా మిగిలిపోతున్న ట్రిటియం మూలకం

నీటిలో ట్రిటియం గాఢతను తగ్గించి వదలడం వల్ల ముప్పు లేదంటున్న జపాన్

ప్రమాదకరమైన స్ట్రాంటియం–90, కార్బన్–14 మూలకాలు ఉన్నాయంటున్న నిపుణులు

వ్యర్థ జలాలు ఎంత ఉన్నాయి ?

- ఫుకుషిమా–దైచీ అణు విద్యుత్ కేంద్రం ధ్వంసమైనప్పట్నుంచి అణు రియాక్టర్లను నిరంతరం చల్లగా ఉంచడానికి రోజుకి 170 టన్నుల నీటిని వాడాల్సి వస్తోంది.
- 13.4 కోట్ల టన్నుల వ్యర్థ జలాలు ఇప్పటికే పేరుకుపోయాయి.
- 1,046 ట్యాంకుల్లో వ్యర్థజలాలను భద్రపరిచారు.
- ఈ అణు జలాలను శుద్ధి చేసి వాటిలో రేడియో ధార్మికత తగ్గించి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.
- విద్యుత్ ప్లాంట్ నుంచి సముద్రంలోకి ఒక కిలోమీటర్ సొరంగం తవ్వి ఆ మార్గం ద్వారా వదులుతున్నారు.
- ఈ మొత్తం ప్రక్రియ పూర్తి కావడానికి ఏకంగా 30 ఏళ్లు పడుతుందని ఒక అంచనా
- 2024 మార్చి నాటికి 31వేల టన్నులకు పైగా జలాలను సముద్రంలోకి పంపాలని నిర్వాహక సంస్థ టెప్కో ప్రణాళికలు వేసింది.

అణు జలాల శుద్ధి ఇలా..!

- రేడియో ధార్మికత కలిగిన వ్యర్థ జలాలను దశల వారీగా శుద్ధి చేస్తారు. అడ్వాన్స్‌డ్ లిక్విడ్ ప్రాసెసింగ్ సిస్టమ్ (ఎల్‌పీఎస్) ద్వారా తొలి దశలో శుద్ధి చేస్తారు.
- జలాల్లో ఉన్న 62 రకాల రేడియో ధార్మిక మూలకాలను ఎల్‌పీఎస్ శుద్ధి చేస్తుంది. కానీ ట్రిటియం మూలకాన్ని మాత్రం అది ఫిల్టర్ చేయలేదు.
- అందుకే నీటిలో ఈ ట్రిటియం మూలకాల సాంద్రతను తగ్గించడానికి నీళ్లను మరింతగా డైల్యూట్ చేసే ప్రక్రియ చేపట్టింది టెప్కో. ట్రిటియం సాంద్రతను జాతీయ భద్రతా ప్రమాణాలు నిర్దేశించిన ప్రమాణాల కంటే 40% తక్కువగా నీటిని డైల్యూట్ చేస్తోంది.

జపాన్ ఏమంటోంది ?

ప్రపంచంలో ఏ అణు ప్లాంట్ అయినా వ్యర్థ జలాలను సముద్రంలోకి వదిలి పెట్టడం సాధారణంగా జరిగేదేనని ఇప్పుడే ఎందుకు వివాదాస్పదం చేస్తున్నారని జపాన్ ప్రశ్నిస్తోంది. సెసియం–137, స్ట్రాంటియం–90 కంటే ట్రిటియం వల్ల ముప్పు తక్కువేనని జపాన్‌లో నిపుణుల అభిప్రాయంగా ఉంది. ''ట్రిటియం మూలకాలున్న నీళ్లని డైల్యూట్ చేసి సముద్రంలోకి విడిచిపెట్టడం వల్ల ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి ముప్పేమీ లేదు. అణుబాంబుల్ని పరీక్షించిన తర్వాత విడుదలయ్యే రేడియో ధార్మికత కన్నా శుద్ధి చేసిన అణు జలాల ద్వారా సముద్రంలో కలిసే రేడియో ధార్మికత అతి తక్కువ. ఇది కూడా కాలక్రమంలో క్షీణించిపోతుంది. దీని కోసం ఆందోళనలు అవసరం లేదు''అని వియన్నా యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీకి చెందిన రేడియాలజిస్టు జార్జ్ స్టెయిన్‌హాజర్ అభిప్రాయపడ్డారు. పొల్యూషన్‌కి సొల్యూషన్ అంటే డైల్యూషన్ అని ఇంగ్లిషులో అంటారని నీటిని శుద్ధి చేస్తూ పోతే హానికరం కాదని స్పష్టం చేశారు.

ఆ జలాలు విషతుల్యమేనా ?

ప్రపంచంలో ఇతర దేశాలు సముద్రంలోకి అణు జలాలు విడుదల చేసినా వారు తీసుకున్న జాగ్రత్తలు జపాన్ తీసుకోవడం లేదని పర్యావరణ పరిరక్షణ వ్యవస్థ గ్రీన్‌పీస్ ఆరోపిస్తోంది. ఈ వ్యర్థ జలాల్లో అత్యంత ప్రమాదకరమైన స్ట్రాంటియం–90 సహా మూలకాలున్నాయంటోంది.

మరో మార్గం లేదా ?

జపాన్ ప్రభుత్వం, టెప్కో అత్యంత వేగంగా, తక్కువ ధరకి అయిపోతుందని సముద్రంలోకి అణుజలాలను పంప్ చేస్తున్నారని పర్యావరణ వేత్తలు ఆరోపిస్తున్నారు. ఈ జలాల నిల్వకి మరిన్ని ట్యాంకుల్ని ఏర్పాటు చేయాలని, లేదంటే మరిగించి ఆవిరి రూపంలో వదుల్చుకోవాలని సూచిస్తున్నారు. ట్యాంకుల్లో నిల్వ ఉంచడాన్ని జపాన్ వ్యతిరేకించింది. భూకంపాలు అధికంగా వచ్చే ఆ ప్రాంతంలో ట్యాంకుల్లో భద్రపరిస్తే లీకయి భూగర్భంలో కలిస్తే మరింత ప్రమాదకరమని అంటోంది. ఇక నీళ్లను ఆవిరిగా మార్చడం, సముద్రంలోకి విడుదల చేయడం మధ్య పెద్దగా తేడాలేదని వాదిస్తోంది. మొత్తమ్మీద ఈ నీటి విడుదల కార్యక్రమం ముున్ముందు ఎలాంటి ఉద్రిక్తతల్ని పెంచుతుందో వేచి చూడాలి.

– సాక్షి, నేషనల్ డెస్క్

ల్యాండర్ నుంచి చంద్రుడిపైకి ప్రజ్ఞాన్

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా)/బెంగళూరు: చంద్రయాన్–3 మిషన్‌లో భాగంగా చందమామ దక్షిణ ధ్రువం ఉపరితలంపై విజయవంతంగా అడుగుపెట్టిన ల్యాండర్ విక్రమ్ నుంచి ఆరు చక్రాలతో కూడిన రోవర్ ప్రజ్ఞాన్ బయటకు వస్తున్న వీడియోను, ఫొటోలను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) శుక్రవారం అధికారికంగా విడుదల చేసింది. వీటిని 'ఎక్స్'లో షేర్ చేసింది. ఈ వీడియో, ఫొటోలను విక్రమ్‌లోని ల్యాండర్ ఇమేజర్ కెమెరా వీటిని చిత్రీకరించింది. ఈ నెల 23న సాయంత్రం 6.04 గంటలకు ల్యాండర్ మాడ్యూల్ చంద్రుడి ఉపరితలంపై పాదం మోపిన సంగతి తెలిసిందే. ల్యాండింగ్ పూర్తయ్యాక 4 గంటలకు.. అంటే ఈ నెల 23న రాత్రి 10.04 గంటలకు ల్యాండర్ తలుపులు తెరుచుకున్నాయి. రోవర్ నెమ్మదిగా బయటకు వచ్చింది. ప్రజ్ఞాన్ ప్రస్తుతం చందమామ ఉపరితలంపై తన ప్రయాణం నిరాటంకంగా సాగిస్తోంది. రోవర్ ప్రజ్ఞాన్ ల్యాండింగ్ సైట్ నుంచి ఇప్పటిదాకా 8 మీటర్లు ప్రయాణించినట్లు ఇస్రో ప్రకటించింది. అందులోని పేలోడ్స్ సైతం పని చేయడం మొదలైందని వెల్లడించింది. ప్రొపల్షన్ మాడ్యూల్, ల్యాండర్ మాడ్యూల్, రోవర్‌లోని అన్ని పేలోడ్స్ చక్కగా పని చేస్తున్నాయని హర్షం వ్యక్తం చేసింది.



చంద్రుడి ఉపరితలంపై దిగిన ల్యాండర్ నుంచి బయటకు వస్తున్న రోవర్ ప్రజ్ఞాన్

మన భూభాగాన్ని చైనా కాజేసింది

కార్గిల్/న్యూఢిల్లీ: మన భూభాగాన్ని చైనా కాజేసిన విషయం లద్దాఖ్‌లోని ప్రతి ఒక్కరికీ తెలుసునని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అంగుళం భూమి కూడా ఆక్రమణకు గురికాలేదంటూ ప్రధాని మోదీ చెబుతున్న మాటలు అబద్ధమని ఆయన విమర్శించారు. ఈ నెల 17 నుంచి లద్దాఖ్‌లో పర్యటిస్తున్న కాంగ్రెస్ నేత శుక్రవారం ఇక్కడ జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. 'వారం రోజులుగా లద్దాఖ్‌లో బైక్‌పై పర్యటిస్తున్నా. లద్దాఖ్ వ్యూహాత్మక ప్రదేశం. భారత్‌కు చెందిన వందలాది కిలోమీటర్ల ప్రాంతాన్ని చైనా లాక్కున్న విషయం పాంగోంగ్ సరస్సు వద్దకు వెళ్లినప్పుడు అర్థమయ్యింది. ఇక్కడి భూమిని అంగుళం కూడా చైనా ఆర్మీ ఆక్రమించుకోలేదంటూ ప్రధాని మోదీ చెప్పిందంతా పూర్తిగా అసత్యం. ప్రధాని నిజం చెప్పలేదు, చైనా మన భూభాగాన్ని కబ్జా చేసిందనే విషయం లద్దాఖ్‌లోని ప్రతి ఒక్కరికీ తెలుసు'అని రాహుల్ అన్నారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించాలన్న డిమాండ్‌కు ఆయన మద్దతు ప్రకటించారు. చైనా ఆక్రమణలతోపాటు లద్దాఖ్ ప్రజల సమస్యలపై పార్లమెంట్‌లో మాట్లాడతానన్నారు. రాహుల్ అంతకుముందు ద్రాస్‌లోని కార్గిల్ యుద్ధ స్మారకాన్ని సందర్శించారు. 1999 ఇండో–పాక్ యుద్ధంలో అమరులైన జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. లద్దాఖ్‌లో పర్యటన ముగించుకున్న రాహుల్ బైక్‌ను వదిలి, కారులో శ్రీనగర్ చేరుకున్నారని, శనివారం తిరిగి ఢిల్లీకి చేరుకుంటారని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి.



కార్గిల్‌లో స్థానికులతో రాహుల్ గాంధీ సెల్ఫీ

ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం

ప్రధాని మోదీ, గ్రీసు ప్రధానమంత్రి కిరియాకోస్ తీర్మానం
- రెండు దేశాల వాణిజ్యం 2030 నాటికి రెండింతలు కావాలని ఆకాంక్ష
- మోదీకి గ్రీసు ప్రతిష్టాత్మక గౌరవం ప్రదానం

ఏథెన్స్: తమ ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి, వివిధ కీలక రంగాల్లో పరస్పరం సహకరించుకోవడానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ, గ్రీసు ప్రధానమంత్రి కిరియాకోస్ మిత్సొటాకిస్ ఒక అవగాహనకు వచ్చారు. గ్రీసు రాజధాని ఏథెన్స్‌లో శుక్రవారం ఇరువురు నేతలు ఉన్నత స్థాయి చర్చలు జరిపారు. ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకోవాలని, రెండు దేశాల మధ్య పరస్పర వాణిజ్యాన్ని 2030 నాటికి రెండింతలు చేసుకోవాలని తీర్మానించుకున్నారు. రాజకీయ, రక్షణ, ఆర్థిక అంశాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించారు. రక్షణ, షిప్పింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ, సైబర్ స్పేస్, విద్య, సాంస్కృతికం, పర్యాటకం, వ్యవసాయం తదితర ముఖ్యమైన రంగాల్లో భారత్–గ్రీసు నడుమ మరింత సహకారం అవసరమని మోదీ, కిరియాకోస్ అభిప్రాయపడ్డారు. ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్(ఐఎస్‌ఏ)లోకి గ్రీసుకు ప్రధాని మోదీ స్వాగతం పలికారు. ఈ మేరకు భారత్–గ్రీసు ఉమ్మడిగా ఒక ప్రకటన విడుదల చేశాయి.

మోదీకి 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ హానర్'

గ్రీసుకు చెందిన ప్రతిష్టాత్మక 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ హానర్' ప్రధాని నరేంద్ర మోదీకి లభించింది. గ్రీసు అధ్యక్షురాలు కటెరీనా ఆయనను ఈ గౌరవంతో సత్కరించారు. ఈ ఆర్డర్ ఆఫ్ హానర్‌ను గ్రీసు ప్రభుత్వం 1975లో నెలకొల్పింది. తొమ్మిదేళ్లలో వివిధ దేశాలు మోదీని అత్యున్నత పురస్కారాలతో సత్కరించాయి. ఇందులో గ్రీసు ఆర్డర్ ఆఫ్ హానర్ కూడా చేరింది.



గ్రీస్ అధ్యక్షురాలు కటెరినా నుంచి పురస్కారం అందుకుంటున్న ప్రధాని మోదీ

చంద్రయాన్–3.. మానవాళి విజయం

చంద్రయాన్–3 విజయం కేవలం భారత్‌కే పరిమితం కాదని, ఇది ప్రపంచంలోని ప్రజలందరికీ చెందుతుందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. ఆయన శుక్రవారం ఏథెన్స్‌లో గ్రీసు అధ్యక్షురాలు కాటెరీనా ఎన్ సాకెల్లారోపౌలౌతో సమావేశమయ్యారు. రెండు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయానికొచ్చారు. చంద్రయాన్–3 మిషన్‌పై అధ్యక్షురాలు కటెరీనా ప్రశంసల వర్షం కురిపించారు. మోదీ ప్రతిస్పందిస్తూ.. చంద్రయాన్ ఘనత మొత్తం మానవాళికి చెందుతుందని చెప్పారు.

ఏథెన్స్‌లో మోదీకి ఘన స్వాగతం

ఒక రోజు పర్యటన నిమిత్తం ప్రధాని మోదీ దక్షిణాఫ్రికా నుంచి శుక్రవారం గ్రీసు రాజధాని ఏథెన్స్‌కు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో మోదీకి గ్రీసు విదేశాంగ మంత్రి జార్జి గెరాపెట్రిటిస్ ఘనంగా స్వాగతం పలికారు. గ్రీసులో నివసిస్తున్న భారతీయులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మోదీకి సాదర స్వాగతం పలికారు. భారత ప్రధానమంత్రి గ్రీసులో పర్యటించడం గత 40 సంవత్సరాల్లో ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

మోదీ, జిన్‌పింగ్ భేటీపై చైనా, భారత్ మాటల యుద్ధం

న్యూఢిల్లీ: బ్రిక్స్ సదస్సులో పాల్గొనడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్ వెళ్లారు. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ఆయన కాసేపు విడిగా మాట్లాడారు. భారత్–చైనా సంబంధాలు, సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, తాజా పరిణామాల గురించి ఇరువురు నేతలు పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. అయితే, ఇండియా విజ్ఞప్తి చేయడం వల్లే మోదీతో జిన్‌పింగ్ మాట్లాడారని చైనా ప్రభుత్వం శుక్రవారం వెల్లడించింది. ఈ మేరకు చైనా విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. చైనా–భారత్ సంబంధాలు మెరుగుపడితే ఇరు దేశాలకూ ప్రయోజనం చేకూరుతుందని మోదీతో జిన్‌పింగ్ చెప్పారని తెలియజేసింది. రెండు దేశాల మైత్రి ప్రాంతీయంగానే కాదు, ప్రపంచ శాంతికీ దోహదపడుతుందని జిన్‌పింగ్ స్పష్టం చేశారని వివరించింది. దీనిపై భారత ప్రభుత్వ వర్గాలు వెంటనే స్పందించాయి. మోదీ–జిన్‌పింగ్ మాటామంతీపై చైనా చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టాయి. ''భారత్‌తో ద్వైపాక్షిక సమావేశం కోసం చైనా విజ్ఞప్తి చేసింది. ఆ అభ్యర్థన ఇంకా పెండింగ్‌లోనే ఉంది. బ్రిక్స్ సదస్సు సందర్భంగా జొహన్నెస్‌బర్గ్‌లో మోదీ, జిన్‌పింగ్ అనధికారికంగా మాట్లాడుకున్నారు'' అని తేల్చిచెప్పాయి.

ప్రపంచ దేశాల నాయకులకు మోదీ అపురూప బహుమానాలు

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాలో బ్రిక్స్ సదస్సుకు హాజరైన ప్రపంచ దేశాల అధినేతలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన కానుకలు వారి మనసుల్ని దోచుకున్నాయి. భారతీయ సాంస్కృతిక వైవిధ్యం, ఘనమైన వారసత్వం ఉట్టిపడే కళారూపాలు, సంప్రదాయ వస్తువుల్ని కానుకగా ఇచ్చారు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసాకు మన తెలంగాణలో తయారైన కళాకృతులైన కూజా ఆకారంలో ఉండే రెండు పింగాణి పాత్రలను (సురాహి) కానుకగా ఇచ్చారు. కర్ణాటకకు చెందిన బిద్రీ అనే లోహకళతో రూపొందించే ఈ పాత్రలపై వెండితో నగిషీలు చెక్కారు. సిరిల్ సతీమణికి నాగాలాండ్‌లో ఆదివాసీలు తయారు చేసిన శాలువాను బహుమానంగా ఇచ్చారు. ఇక బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాషియో లూలా డా సిల్వాకు మధ్యప్రదేశ్‌కు చెందిన గోండ్ పెయింటింగ్స్‌ను కానుకగా ఇచ్చారు. గ్రీసు ప్రధాని కరియాకోస్‌కు ఛత్తీస్‌గఢ్ కళాకృతులైన ఇత్తడితో తయారు చేసిన డోక్రాను, ఆయన సతీమణికి మేఘాలయలో తయారైన శాలువాను కానుకగా ఇచ్చారు.

తోషఖానా కేసులో దిగువ కోర్టు తీర్పు తప్పు

ఇమ్రాన్ ఖాన్‌కు జైలు శిక్షపై ఇస్లామాబాద్ హైకోర్టు వ్యాఖ్య

ఇస్లామాబాద్: తోషఖానా అవినీతి కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్‌పై దిగువ కోర్టు ఇచ్చిన తీర్పులో తప్పులున్నట్లు ఇస్లామాబాద్ హైకోర్టు పేర్కొంది. ప్రభుత్వ ఖజానా 'తోషఖానా'కు అందిన ఖరీదైన బహుమతుల విక్రయంలో ప్రధానిగా ఉన్న ఇమ్రాన్ అవినీతికి పాల్పడ్డారంటూ పాకిస్తాన్ ఎన్నికల సంఘం(ఈసీపీ) వేసిన కేసుపై విచారణ జరిపిన ఇస్లామాబాద్ కోర్టు ఆయన్ను దోషిగా నిర్ధారించింది. ఇమ్రాన్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఈ నెల 5న తీర్పు వెలువరించింది. దీంతో, మరో అయిదేళ్ల వరకు ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆయన అర్హత కోల్పోయారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఇమ్రాన్ వేసిన పిటిషన్‌ను శుక్రవారం ఇస్లామాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆమెర్ ఫరూఖ్ సారథ్యంలోని ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే, విచారణకు ఈసీపీ తరఫు లాయర్ అనారోగ్య కారణాలతో హాజరుకాలేదు. విచారణను వాయిదా వేయాలని ఆయన సహాయక లాయర్లు ధర్మాసనాన్ని కోరారు. ధర్మాసనం వినతిని తోసిపుచ్చింది. 'ట్రయల్ కోర్టు తప్పు చేసింది. ఆ తప్పుల్ని మేం చేయదలుచుకోలేదు. పిటిషన్‌పై విచారణ కీలక దశలో ఉంది. అందుకే విచారణను సోమవారానికి మాత్రమే వాయిదాగలం. సోమవారం ఎవరూ రాకున్నా మా నిర్ణయాన్ని ప్రకటిస్తాం'అని స్పష్టం చేసింది. పాక్ సుప్రీంకోర్టు కూడా ఇమ్రాన్‌కు జైలు శిక్ష విధిస్తూ జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పులో తప్పులున్నట్లు బుధవారం వ్యాఖ్యానించింది. ఇమ్రాన్ వేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరుపుతున్నందున వేచి చూస్తామని తెలిపింది. ఇమ్రాన్ ఖాన్ ఇరవై రోజులుగా అటోక్ జైలులో ఉన్నారు.

ట్రంప్ అరెస్ట్.. విడుదల

2020 అధ్యక్ష ఎన్నికల్లో ఫలితాల తారుమారుకు యత్నించారని ఆరోపణలు
- ఫుల్టన్ కౌంటీ జైలులో 22 నిమిషాలున్న అమెరికా మాజీ అధ్యక్షుడు
- మగ్ షాట్ విడుదల చేసిన అధికారులు
- అనంతరం 2 లక్షల డాలర్ల బెయిల్‌తో బయటికి..

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చరిత్ర సృష్టించారు. ఫొటో సహా పోలీసుల రికార్డుల్లోకి ఎక్కిన తొలి మాజీ అధ్యక్షుడయ్యారు. 2020 అధ్యక్ష ఎన్నికల సమయంలో జార్జియాలో ఫలితాల తారుమారుకు యత్నించారన్న ఆరోపణల కేసులో ట్రంప్(77) గురువారం జార్జియాలోని ఫుల్టన్ కౌంటీ జైలులో అధికారుల ఎదుట లొంగిపోయారు. ఈ సమయంలో అధికారులు మగ్ షాట్ తీశారు. అమెరికా చరిత్రలో మాజీ అధ్యక్షుడి మగ్ షాట్ తీయడం ఇదే మొదటిసారి. ఆరడుగుల 3 అంగుళాల ఎత్తు, 97 కిలోల బరువు, స్ట్రాబెర్రీ రంగు జుట్టు, నీలం కళ్లు..అంటూ ట్రంప్ వివరాలను జైలు అధికారులు నమోదు చేశారు. ఆయనకు ఖైదీ నంబర్ పి01135809 కేటాయించారు. 22 నిమిషాల సేపు జైలులో గడిపిన ట్రంప్ రెండు లక్షల డాలర్ల బెయిల్ బాండ్‌పై విడుదలయ్యారు. అంతకుముందు, విమానంలో అట్లాంటా ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ట్రంప్‌ను భారీ బందోబస్తు మధ్య ఫుల్టన్ కౌంటీ కోర్టుకు తీసుకొచ్చారు. ఫెడరల్, రాష్ట్ర అధికారులు నమోదు చేసిన వివిధ నేరారోపణలకు గాను ట్రంప్ ఈ ఏడాదిలో ఇప్పటి వరకు నాలుగుసార్లు లొంగిపోయారు. మగ్ షాట్ తీయడం మాత్రం ఇదే తొలిసారి. మగ్ షాట్ ఫొటోను ట్రంప్ తన సొంత 'ట్రూత్ సోషల్'తోపాటు 'ఎక్స్'ఖాతాలో పోస్ట్ చేశారు. ఎన్నికల్లో జోక్యం..ఎన్నటికీ లొంగను అంటూ వ్యాఖ్యానించారు. ఫుల్టన్ కౌంటీ జైలు అధికారులు విడుదల చేసిన ట్రంప్ మగ్ షాట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. విడుదలైన అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడారు. తానెలాంటి తప్పు చేయలేదని చెప్పుకున్నారు. అమెరికాకు ఇది చెడు దినమని వ్యాఖ్యానించారు.



పోలీసులు తీసిన ట్రంప్ మగ్‌షాట్

ఎన్సీపీలో చీలికే లేదు: పవార్

పుణె: ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ తన నాలిక కు రెండు వైపులా పదునేనని నిరూపించారు. పార్టీలో అసలు చీలికే లేదని శుక్రవారం ఉదయం తన స్వస్థలం బారామతిలో అన్నారు. తిరుగుబాటు నేత, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌ను తమ పార్టీ నేతగా అభివర్ణించారు. అలా అన్న కొద్ది గంటల్లోనే, తానలా అనలేదంటూ మాట మార్చారు. ఎన్సీపీలో కొందరు నాయకులు భిన్న రాజకీయ వైఖరి కారణంగా ఎన్సీపీని వీడారని ఉదయం పవార్ మీడియాతో అన్నారు. దాన్ని చీలిక అనలేమన్నారు. అజిత్, మరో 8 మంది ఎన్సీపీ ఎమ్మెల్యేలు జూలైలో ఎన్సీపీని వీడి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన –బీజేపీ సంకీర్ణ సర్కారులో చేరడం తెలిసిందే. ఎన్సీపీలో చీలిక లేదని, అజిత్ తమ నాయకుడేనని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, పవార్ కూతురు సుప్రియ సులే గురువారం పేర్కొన్నారు. ఈ విషయాన్ని పవార్‌తో ప్రస్తావించగా,అది నిజమేనని స్పష్టం చేశారు. వాటిపై పార్టీలో, బయట సంచలనం రేగడంతో అలాంటిదేమీ లేదనెలా స్పష్టత ఇచ్చారు. భిన్న రాజకీయ వైఖరి తీసుకున్న వారు తమ నాయకులు కాలేరు అంటూ మాట మార్చారు. 'అజిత్ మా నాయకుడు కాదని అనడం లేదు. ఆయనకు సుప్రియ చెల్లెలు. కనుక అలా అనడం తప్పు కాదు. రాజకీయ అర్థాలు తీయాల్సిన అవసరం లేదు'అని చెప్పుకొచ్చారు. 'చీలిక అంటే ఏమిటి? మెజారిటీ గ్రూప్ పార్టీ నుంచి జాతీయ స్థాయిలో వేరుపడటం. కానీ ఎన్సీపీలో అలా ఏమీ జరగలేదు' అన్నారు.

మణిపూర్ కేసులు అస్సాంకు

న్యూఢిల్లీ: సీబీఐ దర్యాప్తు చేస్తున్న మణిపూర్ హింసాకాండ కేసులను అస్సాంకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు శుక్రవారం కీలక నిర్ణయం తీసుకుంది. వాటి దర్యాప్తును ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు ఒకరిద్దరు న్యాయాధికారులను నియమించాల్సిదిగా గౌహతి హైకోర్టు ను నిర్దేశించింది. ఈ మేరకు ఇంకా పలు ఇతర ఆదేశాలు కూడా జారీ చేసింది. ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి, దారుణంగా లైంగిక హింసకు పాల్పడిన కేసులతో పాటు మొత్తం 17 కేసులు ఇందులో ఉన్నాయి. ఈ దశలో అన్ని పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నేర విచారణ, న్యాయ ప్రక్రియ సజావుగా సాగేలా చూసేందుకు ఈ దిశగా పలు నిర్ణయాలు తీసుకున్నట్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం పేర్కొంది. న్యాయమూర్తులు జస్టిస్ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా కూడా అందులో సభ్యులుగా ఉన్నారు. సీబీఐ ఈ కేసులని అస్సాంకు బదిలీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ పలువురు లాయర్లు చేసిన వాదనను తోసిపుచ్చింది. కేంద్రం, మణిపూర్ ప్రభుత్వాల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన అభ్యర్థనను ఆమోదించింది. ' ప్రధానంగా ఇంటర్నెట్ కనెక్టివిటీ కోసం ఈ నిర్ణయం తీసుకున్నాం. అస్సాంలో అది చాలా ఎక్కువగా ఉంది' అని పేర్కొంది. ' కుకీలు, మైతీలు రెండు తెగల వారూ ఎంతో నష్టపోయారు. కొండల్లో, లోయల్లో, అంతటా బాధితులు ఉన్నారు. అందుకే ఇరు వర్గాలకూ న్యాయంగా ఉండేలా తర్వాత ఆదేశాలిస్తాం' అని వివరించింది.

మణిపూర్ కేసులో సుప్రీంకోర్టు జారీ చేసిన పలు ఆదేశాలు...

- బాధితులు, సాక్షులను కోర్టుకు పిలవకుండా వీడియో కాన్ఫరెన్స్ తదితర మార్గాల్లో వర్చువల్‌గా విచారించాలి.
- ఫస్ట్ క్లాస్ లేదా గౌహతి, అస్సాం సెషన్స్ కోర్టుల్లో పని చేస్తున్న ఒకరు, లేదా ఇద్దరు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్లను గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నామినేట్ చేయాలి.
- వారు మణిపూర్‌లో మాట్లాడే ఒకటి రెండు భాషలు తెలిసిన వారైతే మంచిది.
- నిందితుల హాజరు, రిమాండ్, కస్టడీ, దాని పొడిగింపు వంటి విచారణ ప్రక్రియలన్నీ ఆన్‌లైన్‌లో జరిపేందుకు అనుమతి.
- దూరం, భద్రత తదితర కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం.
- ప్రయాణ సమస్య కారణంగా నిందితులకు మణిపూర్ లోనే జ్యుడీషియల్ కస్టడీకి అనుమతి
- స్టేట్‌మెంట్ నమోదు తదితరాల కోసం మణిపూర్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ఒకరు, లేదా ఇద్దరు మేజిస్ట్రేట్‌లను నియమించాలి.
- దోషుల గుర్తింపు పరేడ్‌లు కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిపేందుకు అనుమతి.
- సోదాలు, అరెస్ట్ వారెంట్‌లను కూడా ఆన్‌లైన్‌లో జారీ చేయొచ్చు.
- జస్టిస్ గీత మిట్టల్, సారథ్యంలోని ముగ్గురు మహిళా న్యాయమూర్తుల ప్యానల్ సజావుగా పని చేసేందుకు అనువైన ఆదేశాలను సెప్టెంబర్ 1న ఇస్తారు.

అసైన్డ్ భూములపై సర్వహక్కులు!

- ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో ప్రకటించనున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు పంపిణీ చేసిన అన్నిరకాల భూములపై యాజమాన్య హక్కులు
- దళితబంధుతోపాటు గిరిజనబంధు.. ఒక్కొక్కరికి రూ.12 లక్షల సాయం
- ఇళ్ల నిర్మాణం కోసం రూ.6 లక్షలు.. బ్యాక్‌లాగ్ పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ
- నేడు చేవెళ్లలో 'ప్రజా గర్జన'


చేవెళ్లలో కాంగ్రెస్ బహిరంగసభ నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్/ చేవెళ్ల: రాష్ట్రంలోని దళిత, గిరిజన ఓటర్లను తమ వైపు తిప్పుకొనేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రణాళికలను సిద్ధం చేసింది. ఈసారి తమకు అధికారమిస్తే.. గతంలో వారికి అసైన్ చేసిన భూములపై సర్వహక్కులు కల్పిస్తామని, ఆ భూములను అమ్ముకోవడం సహా అన్నిరకాల యాజమాన్య హక్కులను అనుభవించవచ్చని హామీ ఇవ్వనుంది. ఈ మేరకు శనివారం చేవెళ్ల వేదికగా జరగనున్న 'ప్రజాగర్జన'సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటించనున్నారు.

భూముల అంశమే ప్రధానంగా..

కాంగ్రెస్ తమ డిక్లరేషన్‌లో ఎస్సీ, ఎస్టీలకు భూపంపిణీ అంశాన్నే ప్రధానంగా ప్రస్తావించనున్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. గతంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు వివిధ రూపాల్లో పేదలకు అసైన్ చేసిన భూముల్లో.. ఎస్సీ, ఎస్టీలకు చెందిన 24 లక్షల ఎకరాలపై వారికి పూర్తిస్థాయిలో యాజమాన్య హక్కులు కల్పిస్తామని ప్రకటించనున్నట్టు వివరిస్తున్నాయి. అదే విధంగా రాష్ట్రంలోని గిరిజన, ఆదివాసీలు సాగుచేసుకుంటున్న 12 లక్షల ఎకరాల భూములకు అటవీ హక్కుల చట్టం అమలు ద్వారా పట్టాలు అందజేస్తామని.. వాటిపై కూడా గిరిజనులకు సర్వహక్కులు కల్పిస్తామని హామీ ఇవ్వనున్నట్టు వెల్లడిస్తున్నాయి.

అదనపు ఆర్థిక సాయంతో..

బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన దళిత బంధు పథకం కింద రూ.10 లక్షలు ఇస్తుండగా.. తాము రూ.12 లక్షలు ఇస్తామని, గిరిజనబంధు కూడా అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించనున్నట్టు తెలిసింది. దళితులు, గిరిజనులకు ఇళ్లు కట్టుకునేందుకు రూ.6 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇవ్వనున్నట్టు సమాచారం. ఇప్పటికే రాష్ట్రంలోని పేదలందరికీ ఇళ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షల చొప్పున ఇస్తామన్న కాంగ్రెస్.. ఎస్సీ, ఎస్టీలకు మరో రూ.లక్ష అదనంగా ఇవ్వనుంది. ఇక ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులన్నీ భర్తీ చేస్తామని.. విద్య, వైద్య రంగాల్లో దళిత, గిరిజనులకు ప్రాధాన్యత కల్పించి సంక్షేమ పథకాలను అమలు చేస్తామనే హామీలు కూడా ప్రకటించనున్నట్టు సమాచారం.

నేడు 4 గంటలకు 'ప్రజాగర్జన' సభ

చేవెళ్లలో ప్రజాగర్జన సభ శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానుంది. మల్లికార్జున ఖర్గే ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, సీడబ్ల్యూసీ ఆహ్వానితుడు దామోదర రాజనర్సింహ తదితరులు హాజరుకానున్నారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ఖర్గే ప్రకటిస్తారని గాంధీభవన్ వర్గాలు చెప్పాయి. బెంగళూరు నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి రానున్న ఖర్గే.. అక్కడి నుంచి నేరుగా చేవెళ్ల వెళ్లి సభలో పాల్గొంటారని, రాత్రికి హైదరాబాద్ చేరుకుని బస చేస్తారని తెలిపాయి.

బీఆర్ఎస్ నుంచి తెలంగాణకు విముక్తి కల్పిస్తాం

ప్రత్యేక రాష్ట్రం వస్తే ప్రజల జీవన స్థితిగతులు బాగుపడతాయని భావించామని.. కానీ బీఆర్ఎస్ సర్కారు పాలనలో ప్రజలు ఆత్మగౌరవం కోల్పోయి బతుకుతున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. శుక్రవారం రాత్రి ఆయన చేవెళ్లలోని కేవీఆర్ గ్రౌండ్‌లో కాంగ్రెస్ 'ప్రజాగర్జన సభ'ఏర్పాట్లను పార్టీ నేతలు శ్రీధర్‌బాబు, అంజన్‌కుమార్‌యాదవ్, ప్రీతమ్, వేం నరేందర్‌రెడ్డి, గడ్డం ప్రసాద్ కుమార్, బలరాంనాయక్, కేఎల్ఆర్, చల్లా నర్సింహారెడ్డి, తదితరులతో కలసి పరిశీలించారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్‌ను నమ్మి పదేళ్లుగా మోసపోతున్న ప్రజలకు కాంగ్రెస్ రూపంలో విముక్తి లభించనుందన్నారు. దళిత, గిరిజనుల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ఏం చేయబోతోందో చెప్పేందుకు సభ ఏర్పాటు చేశామన్నారు. చేవెళ్ల ప్రాంతానికి కాంగ్రెస్‌తో ప్రత్యేక అనుబంధం ఉందని, వైఎస్ హయాంలోనే ఇది నిరూపితమైందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో దళితులకు ఇచ్చిన భూములను బీఆర్ఎస్ సర్కార్ లాక్కుంటోందని ఆరోపించారు. శనివారం సాయంత్రం జరగనున్న ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదలకు భరోసా అని శ్రీధర్‌బాబు, బలరాంనాయక్ పేర్కొన్నారు.

హామీల అమలుకు 7న చలో హైదరాబాద్: బీజేపీ

జిల్లా కలెక్టరేట్ల నిరసనల సందర్భంగా పలువురు నేతల అరెస్ట్


హైదరాబాద్‌లో శుక్రవారం బీజేపీ నేతలతో కలిసి ఆందోళనలో పాల్గొన్న లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన అర్హులందరికీ డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, రైతు రుణమాఫీ, నిరుద్యోగభృతి, బీసీబంధు, దళితబంధు, వంటి ఇతర హామీలను అమలు చేయాలని రాష్ట్ర బీజేపీ డిమాండ్ చేసింది. ఈ హామీలు అమలు చేయనిపక్షంలో సెప్టెంబరు 7న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించింది. కాగా, బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతలకు దారితీసింది. హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన నిర్వహించిన సందర్భంగా బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపీ కె.లక్ష్మణ్, పార్టీ జిల్లా అధ్యక్షులను పోలీసులు అరెస్ట్ చేశారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ఆందోళనలో పాల్గొనేందుకు వెళుతున్న బీజేపీనేత, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరితోపాటు మహబూబ్‌నగర్ జిల్లాలో పార్టీ జాతీయకార్యవర్గసభ్యుడు, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో మాజీ మంత్రి బాబూ మోహన్, ఇతర జిల్లాల్లో ముఖ్యనేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రజల పక్షాన బీజేపీ పోరాడుతుంటే పార్టీ నాయకులు, కార్యకర్తలపై ప్రభుత్వం అక్రమంగా అరెస్టులకు పాల్పడుతోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మండిపడ్డారు. అక్రమంగా అరెస్టు చేసిన పార్టీనాయకులను విడుదల చేయాలన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్సీకి ఎస్టీ మహిళపై థర్డ్ డిగ్రీ వ్యవహారం

ఫిర్యాదు చేసిన గిరిజన సంఘాలు

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో గిరిజన మహిళను పోలీసులు చితకబాదిన వ్యవహారం జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు చేరింది. ఈ వ్యవహారంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ ఆధ్వర్యంలో గిరిజన సంఘాల నేతలు శుక్రవారం ఢిల్లీలో ఎన్‌హెచ్ఆర్సీ చైర్మన్ అరుణ్‌కుమార్ మిశ్రాకు ఫిర్యాదు చేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో మహిళలకు స్వాతంత్ర్యం లేకుండా పోయిందని గిరిజన సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో ఈ ఘటనపై పోలీసుల నుంచి పూర్తిస్థాయి సమాచారం కోరతామని...తప్పు చేసిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేస్తామని చైర్మన్ హామీ ఇచ్చారని గిరిజన సంఘాల నాయకులు తెలిపారు. సీఎం కేసీఆర్‌కు గిరిజనులంటే చిన్న చూపని...కేవలం ఇద్దరు పోలీసులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారని మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ మండిపడ్డారు.

డిసెంబర్‌లో అధికారంలోకి కాంగ్రెస్

ఉమ్మడి నల్లగొండలో 12 సీట్లు కాంగ్రెస్‌కే: ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: తన అంచనా ప్రకారం ఈ ఏడాది నవంబర్ 30న రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఉంటుందని, డిసెంబర్ మొదటి వారంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి దోపిడీ, అక్రమార్జనలపైనే దృష్టి పెట్టిందని, అందుకే ఈసారి తెలంగాణ ప్రజలు ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్తారని వ్యాఖ్యానించారు. హుజూర్‌నగర్ అసెంబ్లీ టికెట్‌కోసం శుక్రవారం గాంధీభవన్‌లో దరఖాస్తు ఇచ్చిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈసారి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ క్లీన్‌స్వీప్ చేయడం ఖాయమన్నారు. తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్ అని బీఆర్ఎస్ నేతలు చెపుతున్నారని, వారు చెపుతున్నట్టుగానే తలసరి అప్పు, మద్యం వినియోగం, అవినీతిలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని 119 ముక్కలుగా విభజించి ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలు వాటిని తమ సామ్రాజ్యాలుగా భావించి అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. దళితబంధు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయకముందే లంచాలు తీసుకుంటున్నారని, హుజూర్‌నగర్ నియోజకవర్గంలో దళితబంధుకు అర్హత పొందిన వారి వద్ద నుంచి 50 శాతం కమీషన్ తీసుకున్నారని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఉత్తమ్ చెప్పారు.

కేసీఆర్‌కు ఏటీఎంగా ధరణి

- ఈ పోర్టల్‌పై గ్రామాల్లో చర్చకు సిద్ధమా?
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కచ్చితంగా రద్దు చేస్తాం
- టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: గతంలో కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు కేసీఆర్‌కు ఏటీఎంగా ఉండేవని, ఇప్పుడు ధరణి పోర్టల్‌ను ఆయన ఏటీఎంగా మార్చుకున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ధరణి పోర్టల్‌ను కచ్చితంగా రద్దు చేస్తామని ఆయన పునరుద్ఘాటించారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.పి. వెంకటేశ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్, బీజేపీ నేతలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో రేవంత్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.త్ అనంతరం మాట్లాడుతూ ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని దళిత, గిరిజనులకు చెందిన 35 లక్షల ఎకరాల భూములను కొల్లగొట్టారని, జిల్లా కలెక్టర్లను అడ్డుపెట్టుకుని భూములను అక్రమార్కులు దోచుకుంటున్నారని ఆరోపించారు. ధరణి పోర్టల్‌పై రాష్ట్రంలోని 12 వేల గ్రామాల్లో సభలు పెట్టేందుకు బీఆర్ఎస్ సిద్ధమా అని ప్రశ్నించారు. 'ధరణిని రద్దు చేస్తే రైతుబీమా, రైతుబంధు ఎలా వస్తుందని కేసీఆర్ ప్రశ్నిస్తున్నారు. ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చింది 2020లో అయితే, రైతుబంధు, బీమాలు 2018లోనే ప్రారంభమయ్యాయి. మరి అవి ఎలా వచ్చాయి'అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణి కంటే మెరుగైన విధానాన్ని తీసుకువచ్చి రైతుల భూములకు రక్షణ కల్పిస్తామని, టైటిల్ గ్యారంటీ చట్టాన్ని అమలు చేస్తామని రేవంత్ హామీ ఇచ్చారు.

ఉప్పు, నిప్పు అన్నారు

ప్రగతిభవన్, రాజ్‌భవన్ మధ్య అగాధం ఉందన్నట్టుగా ఇన్నాళ్లూ కేసీఆర్ ప్రజలను నమ్మించారని, ఉప్పు, నిప్పు తరహాలో వ్యవహరించారని, ఎన్నికలు సమీపిస్తుండడంతో సీఎం, గవర్నర్‌లు రహస్యంగా మాట్లాడుకున్నారని రేవంత్ ఆరోపించారు. ప్రజాసమస్యలపై ఆ ఇద్దరూ మాట్లాడుకుని ఉంటే అందరి ముందే మాట్లాడుకోవచ్చు కదా అని ప్రశ్నించారు. మోదీ, కేసీఆర్, అసదుద్దీన్‌లు.. ముగ్గురూ తోడు దొంగలని, వారి రూపం వేరు కానీ మనసులు మాత్రం ఒక్కటేనని అన్నారు. బీఆర్ఎస్, ఎంఐఎంలకు ఓటేస్తే మోదీకి వేసినట్టేనని చెప్పారు.

వెయ్యి దాటిన కాంగ్రెస్ దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయాలనుకుంటున్న ఆశావహుల సంఖ్య వెయ్యి దాటింది. ఈనెల 18వ తేదీన దరఖాస్తుల స్వీకరణ ప్రారంభంకాగా, శుక్రవారంతో ముగిసింది. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ సెగ్మెంట్లకు వెయ్యిమందికి పైగా దరఖాస్తు చేశారని, ఒక్కో నియోజకవర్గం నుంచి సగటున 8–9 దరఖాస్తులు వచ్చాయని గాంధీభవన్‌వర్గాలు వెల్లడించాయి. ముఖ్యనేతలు గీతారెడ్డి, జానారెడ్డి, నాగం జనార్దనరెడ్డి, వి.హనుమంతరావు, రేణుకాచౌదరి, కొండామురళి తదితరులు ఎక్కడా దరఖాస్తు చేసుకోకపోవడం గమనార్హం. కాగా, వచ్చిన దరఖాస్తులను జిల్లాలు, నియోజకవర్గాల వారీగా విభజించేందుకు రెండు రోజులు పడుతుందని, ఈ దరఖాస్తులన్నింటినీ కంప్యూటరైజ్ చేస్తామని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. నియోజకవర్గాలవారీగా పేర్లు సిద్ధం చేసిన తర్వాత ఈనెల 28 లేదా 29న ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ) సమావేశం జరిగే అవకాశాలున్నాయి. పీఈసీ సభ్యులు ఈ పేర్లను పరిశీలించి నాలుగు పేర్లు సిఫారసు చేస్తారు..ఆ తర్వాత రాష్ట్ర స్క్రీనింగ్ కమిటీ ముగ్గురిని షార్ట్‌లిస్ట్ చేస్తుంది. అనంతరం కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) పరిశీలించి అభ్యర్థిని ఖరారు చేస్తుంది. సెప్టెంబర్ 15లోపు కాంగ్రెస్ పార్టీ తొలి జాబితా విడుదల కావొచ్చని సమాచారం.

నేడు ఫారెస్ట్ ట్రెక్ పార్క్ ప్రారంభం

కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్, మణికొండ: స్వతంత్ర భారత వజ్రోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న హరితహారంలో భాగంగా ఒకే రోజు కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ శనివారం ప్రారంభిస్తారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా చిల్కూరు బ్లాక్‌లో మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్కును ప్రారంభించి, మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. సీఎం కార్యక్రమ ఏర్పాట్లను మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, ముఖ్యమంత్రి కార్యదర్శి భూపాల్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం పరిధిలో ఏర్పాటు చేసిన ఈ ఫారెస్ట్ ట్రెక్ పార్కు ప్రాంతం ఒకప్పుడు డంపింగ్ గ్రౌండ్‌ను తలపించడంతో పాటు భవన నిర్మాణ వ్యర్థాలతో నిండి ఉండేది. దీనిని రూ.7.38 కోట్లతో అభివృద్ధి చేసి అటవీ సంరక్షణ, పార్కు పునరుజ్జీవన పనులు చేపట్టారు. పచ్చదనం కోసం పార్క్‌లో మొక్కలు నాటి ట్రెక్కర్స్ కోసం సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

ట్రెక్ పార్క్ ప్రత్యేకతలివే..: వివిధ రకాలకు చెందిన 50 వేల మొక్కలు నాటారు. నిర్మాణ శిథిలాలను తొలగించాక ఆ ఖాళీ ప్రదేశాలలో 'పొద'జాతికి చెందిన 25 వేల మొక్కలు నాటారు. రాక్‌ఫిల్ డ్యామ్‌లు, 3 చోట్ల నీటి కుంటలు నిర్మించారు. ఈ ప్రాంతంలో భూసారం, నీటి సంరక్షణ చర్యలతో అటవీ పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. మొత్తం 5.6 కి.మీ మేర విస్తరించి ఉన్న పార్కుకు 4.5 కి.మీల ప్రహరీ గోడను నిర్మించారు. సందర్శకుల కోసం తాగునీటి ప్లాంట్, 4 ట్రెక్కింగ్ మార్గాలు (2 కి.మీ), నడక మార్గాలు (4 కి.మీ), టాయిలెట్ బ్లాక్,గెజిబో(2), వాచ్‌టవర్, గ్రామ దేవత గుడి, ఓపెన్ వ్యాయామశాల, యాంఫీ థియేటర్, జలపాతం, బ్యాలెన్సింగ్ రాళ్లు, పిల్ల ఏనుగు, డేగ ముఖం, రచ్చ బండలు, సీటింగ్ బెంచీలు, 3 నీటి వనరులు తదితర సౌకర్యాలు కల్పించారు.


ముఖ్యమంత్రి కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సబితారెడ్డి

క్లుప్తంగా...

మళ్లీ కేసీఆర్ వస్తే చంద్ర మండలం కూడా ఖతమే!

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి



కరీంనగర్‌టౌన్: సీఎం కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తే ఈసారి చంద్రమండలాన్ని కూడా ఖతం చేస్తారని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. అక్కడ కూడా దళితులకు మూడెకరాల భూమి ఇచ్చేస్తానని హామీ ఇస్తారని చమత్కరించారు. కరీంనగర్‌లో బండి సంజయ్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికల కోసం కేసీఆర్ ఇటీవల ప్రకటించిన తొలిజాబితాలో సగం మందికి టికెట్లు రావని జోస్యం చెప్పా రు. సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో చాలామంది బీజేపీలో చేరేందుకు సిద్ధమయ్యారని తెలుసుకున్న కేసీఆర్ అందరికీ టికెట్లు ఇస్తున్నట్లు ప్రకటించారని చెప్పారు.

కేసీఆర్‌కు పతనం తప్పదు

తోకలు, ఈకెల పార్టీ అంటే నాలుకలు చీరేస్తాం: కూనంనేని



గోదావరిఖని (రామగుండం): రాబోయే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ పతనం తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. శుక్రవారం రాత్రి పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ప్రధాన చౌరస్తాలో జరిగిన ఏఐటీయూసీ బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. కేసీఆర్ నిజస్వరూపం బయటపడటంతో జాగ్రత్త పడ్డామని వ్యాఖ్యానించారు. కేసీఆర్ బీజేపీకి పూర్తిగా లొంగిపోయి.. ఆపార్టీ అడుగులకు మడుగులొత్తుతున్నారని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్‌తో బంధం పూర్తిగా తెగిపోయిందని, తోకలు, ఈకెల పార్టీ అంటే నాలుకలు చీరేస్తామని హెచ్చరించారు. కలిసివచ్చే శక్తులతో రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి అమరజిత్‌కౌర్ మాట్లాడుతూ, సమరశీల ఐక్య పోరాటాలతో ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూసఫ్, బాలరాజు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

చైనా ముందు మోకరిల్లిన మోదీ సర్కారు: అసదుద్దీన్



సాక్షి, హైదరాబాద్: చైనా ముందు మోదీ సర్కార్ మోకరిల్లుతోందని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. లద్దాఖ్ సరిహద్దులో ఏం జరుగుతుందో దేశప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఒవైసీ మాట్లాడుతూ భారత వీర సైనికులు 40 నెలలుగా సరిహద్దులో చైనీయులకు భయపడకుండా నిలబడ్డారన్నారు. మరి మోదీ ఎందుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ఎదురొడ్డి నిలబడలేకపోతున్నారని ప్రశ్నించారు. ది కశ్మీర్ ఫైల్స్ చిత్రం అవార్డుకు ఎంపిక చేయడం పట్ల అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర అభ్యంతరం తెలిపారు.

బీఆర్‌ఎస్‌ను ఓడించడమే లక్ష్యం: చాడ

బలమున్న స్థానాల్లో పోటీ చేస్తాం



హుస్నాబాద్: పొత్తుల విషయంలో బీఆర్‌ఎస్ మిత్రద్రోహం చేసిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించడమే తమ లక్ష్యమన్నారు. మునుగోడు ఉపఎన్నికల్లో వామపక్షాల మద్దతుతోనే బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలిచారని గుర్తు చేశారు. సీపీఐ, సీపీఎం కలిసే ప్రయాణం చేస్తాయని, బలం ఉన్న స్థానాల్లో పోటీ చేస్తాయని పేర్కొన్నారు. వచ్చే నెల 11 నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విలీన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ములుగు బరిలో అజ్మీర ప్రహ్లాద్ పోటీ!



ములుగు: బీఆర్‌ఎస్ పార్టీ టికెట్ కేటాయించకపోయినా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు దివంగత మాజీమంత్రి అజ్మీర చందూలాల్ తనయుడు డాక్టర్ ప్రహ్లాద్ సిద్ధమయ్యారు. అధికారపార్టీ అభ్యర్థిగా బడే నాగజ్యోతిని ప్రకటించినప్పటినుంచి తన అనుచరవర్గంతో మండలాల వారీగా సమావేశం ఏర్పాటు చేసుకుంటూ అభిప్రాయాలను సేకరించే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా శుక్రవారం ములుగు మండలంలోని తన స్వగ్రామం సారంగపల్లి, ఎస్ఎస్ తాడ్వాయి మండల ముఖ్య అనుచరులతో సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఏది ఏమైనా పోటీలో ఉండాలని కార్యకర్తలు సూచించారని సమాచారం. దీంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.





శుక్రవారం సచివాలయం ప్రాంగణంలో ప్రార్థనా మందిరాలను ప్రారంభించి నల్లపోచమ్మ అమ్మవారి గుడిలో పూజలు నిర్వహిస్తున్న గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్ • చర్చిలో కేక్‌ను కట్ చేస్తున్న గవర్నర్ తమిళిసై. చిత్రంలో సీఎం కేసీఆర్, సీఎస్ శాంతి కుమారి, మంత్రులు జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, బాల్క సుమన్ తదితరులు • సీఎం కేసీఆర్‌తో కలసి మసీదును ప్రారంభిస్తున్న తమిళిసై. చిత్రంలో హోంమంత్రి మహమూద్ అలీ తదితరులు

స్వయంగా తీసుకెళ్లి.. సచివాలయమంతా చూపించి..

నల్ల పోచమ్మ గుడిలో తొలిపూజ.. చర్చి, మసీదులలో తొలి ప్రార్థనలు

- కార్యక్రమాల్లో కలసి పాల్గొన్న గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్
- సచివాలయంలో ప్రార్థనా మందిరాలు ప్రారంభం
- అంతకుముందు తమిళిసైని సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్
- తన చాంబర్‌లో శాలువాతో సత్కారం

సాక్షి, హైదరాబాద్: నూతన సచివాలయంలో ఇటీవలే నిర్మాణం పూర్తి చేసుకున్న నల్ల పోచమ్మ ఆలయం, మసీదు, చర్చిలను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌తో కలసి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శుక్రవారం ప్రారంభించారు. ఆలయంలో జరిగిన తొలి పూజలు, మసీదు, చర్చిలలో నిర్వహించిన తొలి ప్రార్థనల్లో ఇరువురు కలసి పాల్గొన్నారు. గవర్నర్ సచివాలయానికి తొలిసారి వచ్చిన నేపథ్యంలో సీఎం కేసీఆర్ స్వయంగా దగ్గరుండి ప్రత్యేకతలను చూపించారు. కొత్త సచివాలయం నిర్మాణంలో భాగంగా నల్ల పోచమ్మ ఆలయం, మసీదులను తొలగించిన విషయం తెలిసిందే. ఇటీవల ఆ రెండింటితోపాటు చర్చిని కూడా కొత్తగా, విశాలంగా నిర్మించారు. శుక్రవారమే వాటిని ప్రారంభించి అందరినీ అనుమతిస్తున్నారు.

గవర్నర్‌ను ఘనంగా స్వాగతించి..

శుక్రవారం మధ్యాహ్నం 12.10 గంటల సమయంలో సచివాలయానికి చేరుకున్న సీఎం కేసీఆర్.. ఆలయం, మసీదు, చర్చిల ప్రారంభోత్సవ ఏర్పాట్లు, సచివాలయ అంశాలపై ఉద్యోగ సంఘం నేతలతో కాసేపు మాట్లాడారు. కాసేపటికి అక్కడికి చేరుకున్న గవర్నర్ తమిళిసైకు మేళతాళాల మధ్య సీఎం, సీఎస్ శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం నుంచి జరుగుతున్న చండీయాగం పూర్ణాహుతిలో గవర్నర్, సీఎం పాల్గొన్నారు. తర్వాత ఆలయంలో నల్ల పోచమ్మ అమ్మవారికి తొలి పూజ నిర్వహించారు. దీనికి అనుబంధంగా నిర్మించిన శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాలనూ దర్శించుకున్నారు. తర్వాత ఎలక్ట్రిక్ వాహనంలో వారు చర్చి వద్దకు చేరుకున్నారు. గవర్నర్ తమిళిసై రిబ్బన్ కట్ చేసి చర్చిని ప్రారంభించారు. కేక్ కట్ చేసి బిషప్ డానియేల్‌కు, సీఎంకు అందించారు. తర్వాత బిషప్ ఆధ్వర్యంలో తొలి ప్రార్థనలు నిర్వహించారు. తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ కాంతి వెస్లీ ముఖ్యమంత్రికి జ్ఞాపికను బహూకరించారు. తర్వాత వారంతా పక్కనే ఉన్న మసీదుకు చేరుకున్నారు. అక్కడ ఇమాం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లిం మతపెద్దలు, మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ, ఆ పార్టీ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్‌లతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగించాలని అసదుద్దీన్ కోరగా.. ''రాష్ట్రంలో సోదరభావం ఇలాగే పరిఢవిల్లాలి. ఇందుకు ప్రభుత్వపరంగా మావంతు చొరవ చూపుతాం. కొత్త మసీదు అద్భుతంగా, నిజాం హయాంలో కట్టిన తరహాలో గొప్పగా రూపొందింది. ఇలా అన్ని మతాల ప్రార్థన మందిరాలు ఒక్కచోట ఏర్పాటైన తెలంగాణ సచివాలయం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతుంది..''అని కేసీఆర్ పేర్కొన్నారు.

సచివాలయాన్ని గవర్నర్‌కు చూపిన కేసీఆర్

రాష్ట్ర ప్రభుత్వం భారీ స్థాయిలో కొత్త సచివాలయాన్ని నిర్మించినా.. ఇప్పటివరకు గవర్నర్ అందులో అడుగుపెట్టలేదు. శుక్రవారమే తొలిసారిగా అక్కడికి వచ్చారు. ఈ నేపథ్యంలో ప్రార్థన మందిరాల్లో కార్యక్రమాలు ముగిశాక సీఎం కేసీఆర్.. సచివాలయాన్ని తిలకించాలంటూ గవర్నర్ తమిళిసైని ఆహ్వానించారు. స్వయంగా దగ్గరుండి మరీ కొత్త భవనం ప్రత్యేకతలు, నిర్మాణంలో తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ, ఇతర అంశాలను వివరించారు. తన చాంబర్‌కు తోడ్కొని వెళ్లి అక్కడ శాలువాతో సత్కరించారు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం కూడా కావటంతో.. గవర్నర్‌కు ప్రభుత్వ సీఎస్ శాంతి కుమారి కుంకుమ దిద్ది సంప్రదాయ పద్ధతిలో సత్కరించారు. అనంతరం వారంతా తేనీటి విందులో పాల్గొన్నారు.

అమిత్ షా ఎన్నికల శంఖారావం!

- రేపు ఖమ్మం సభలో చేసే ప్రసంగంపై అందరి దృష్టి
- బీఆర్‌ఎస్‌పై అనుసరించే కఠిన వైఖరిని స్పష్టం చేస్తారని అంచనా
- కేడర్‌లో జోష్ నింపేలా ప్రసంగం ఉంటుందన్న పార్టీ ముఖ్యనేతలు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదివారం ఖమ్మం జిల్లాలో పాల్గొనే బహిరంగ సభకు రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. అధికార బీఆర్‌ఎస్ విషయంలో బీజేపీ అనుసరించబోయే కఠిన వైఖరి గురించి, వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌పై సాగించబోయే పోరాటం గురించి స్పష్టతనిస్తారని తెలుస్తోంది. బీజేపీ, ప్రధాని మోదీపై సీఎం కేసీఆర్ చేస్తున్న విమర్శలకు దీటుగా సమాధానం ఇవ్వడంతోపాటు ఇప్పటిదాకా లేనంత తీవ్రస్థాయిలో విమర్శలు సంధించడం ద్వారా అమిత్ షా ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తారనే విశ్వాసాన్ని పార్టీనేతలు వ్యక్తంచేస్తున్నారు. కొంతకాలంగా పార్టీలో ఏర్పడిన స్తబ్దతను బద్దలుకొట్టడంతోపాటు రాష్ట్ర నాయకత్వాన్ని, కేడర్‌ను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసి పార్టీని ఎన్నికల కదనరంగంలోకి దూకేలా చేస్తారని పార్టీవర్గాలు భావిస్తున్నాయి. కేసీఆర్ సర్కార్ అప్రజాస్వామిక పోకడలు, నియంతృత్వ విధానాలను తీవ్రస్థాయిలో ఎండగట్టడంతోపాటు అవినీతి, అక్రమాలపై చర్యలు తప్పవని అమిత్ షా స్పష్టం చేస్తారని అంచనావేస్తున్నారు. వారసత్వ రాజకీయాలు, మైనారిటీ సంతుష్టీకరణ విధానాలు, అవినీతి, కుంభకోణాలకు ఊతమిచ్చేలా సాగుతున్న పరిణామాలపై గట్టిగా నిలదీస్తారని భావిస్తున్నారు. బీజేపీని అధికారంలోకి తీసుకురావడం ద్వారానే రాష్ట్రంలో నిజమైన అభివృద్ధి జరుగుతుందనే సందేశాన్ని ప్రజలకు ఇస్తారని అంటున్నారు.

బీఆర్‌ఎస్ వైఖరిపై స్పష్టత

ప్రస్తుతం జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా అమిత్‌షా ప్రసంగం ఎలా ఉండబోతున్నదన్న దానిపై రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. మరీ ముఖ్యంగా బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేనని, ఈ రెండింటి మధ్య లోపాయికారీ ఒప్పందం కుదిరిందంటూ సాగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టేలా కేసీఆర్ ప్రభుత్వంపై పదునైన విమర్శలు సంధిస్తారని చెబుతున్నారు. గత నెల 8న వరంగల్‌లో ప్రధాని మోదీ బహిరంగ సభ తర్వాత దాదాపు 50 రోజుల తర్వాత జరుగుతున్న ఈ సభ ద్వారా అమిత్ షా ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తారని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు.

ఇదీ అమిత్ షా షెడ్యూల్

ఈనెల 27న ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 1.30 గంటలకు గన్నవరంలో దిగి అక్కడి నుంచి హెలికాప్టర్‌లో భద్రాచలం చేరుకుంటారు. భద్రాద్రి ఆలయంలో సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ తర్వాత హెలికాప్టర్‌లో భద్రాచలం నుంచి ఖమ్మంకు చేరుకుని బహిరంగసభలో పాల్గొంటారు. అనంతరం బీజేపీ రాష్ట్రకోర్ కమిటీ, ముఖ్య నేతలతో సమావేశమవుతారు. సాయంత్రం 5.45 గంటల ప్రాంతంలో ఖమ్మం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి అహ్మదాబాద్‌కు వెళతారు.

నేను ఎవరికీ భయపడను

మైనంపల్లి పేరుతో సామాజిక మాధ్యమాల్లో ఆడియో



సాక్షి, హైదరాబాద్: 'నేను ఎవరికీ భయపడను, సీఎం, కేటీఆర్, పీఎం ఎవరైనా సరే భయపడేది లేదు'అంటూ పరుష పదజాలంతో మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మాట్లాడినట్లుగా ఓ ఆడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతుంది. 'కావాలని నేను ఎవరి తెరువుకు పోను. నా తెరువుకూ ఎవరూ రారు. ఇటీవల ప్రకటించిన సీట్లలో 90 శాతం రెడ్లలకే ఇచ్చారు'అని ఆ ఆడియోలో వినిపిస్తోంది. ఈ ఆడియో విషయంపై స్పష్టత కోసం మైనంపల్లితో మాట్లాడేందుకు ప్రయత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు. కాగా, తన కుమారుడికి మెదక్ సీటు ఇవ్వాలని, లేని పక్షంలో తాను పోటీ చేయనని, హరీశ్‌రావు మెదక్ జిల్లాను తన గుప్పిట్లో పెట్టుకున్నారని మైనంపల్లి వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఆడియో చక్కర్లు కొట్టడం గమనార్హం.

గద్దర్ మృతి దళిత, గిరిజనులకు తీరనిలోటు

కేంద్ర మంత్రి అథవాలే



పంజగుట్ట (హైదరాబాద్): ప్రజా యుద్ధనౌక గద్దర్ మృతి తెలంగాణకే కాదు.. యావద్దేశంలో దళిత, గిరిజన, పేద సమాజం మొత్తానికి తీరని లోటని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం రాత్రి ఆర్‌పీఐ ఆధ్వర్యంలో గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అథవాలే మాట్లాడుతూ.. గద్దర్ ముంబయి, మహారాష్ట్రల్లో కూడా అనేక సమావేశాలకు వచ్చారని గుర్తు చేసుకున్నారు. గద్దర్ నక్సలైట్ ఉద్యమంలో పనిచేసినా.. ప్రజలకు న్యాయం జరగాలి, వారి హక్కులను కాపాడాలని పోరాడేవారని పేర్కొన్నారు. గద్దర్ లాంటి మహనీయుని సంస్మరణ సభ 50 మందితో నిర్వహించడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకుడు జె.బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులతో కలిసుంటే బాగుండేది

- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- ఎన్‌డీఏ, 'ఇండియా కూటమి'కి సమదూరం వల్లే సాధ్యపడలేదు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి కమ్యూనిస్టులు మిత్ర పక్షంగా ఉంటే బాగుండేదని, ఎన్నికలకు ముందు వామపక్షాలు దూరం కావడం బాధాకరమని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ 'ఇండియా', 'ఎన్‌డీఏ'కూటములకు సమదూరం పాటిస్తున్నందునే కమ్యూనిస్టులతో మైత్రి సాధ్యం కాలేదని తాను భావిస్తున్నానన్నారు. మండలిలోని తన చాంబర్‌లో శుక్రవారం మీడియా ప్రతినిధులతో గుత్తా మాట్లాడారు. వామపక్షాలతో సీట్ల సర్దుబాటుపై బి. వినోద్ కుమార్, పల్లా రాజేశ్వర్ రెడ్డి సంప్రదింపులు జరిపారని, వారికి నామినేటెడ్ పోస్టులు కూడా ఇస్తామన్నారని గుత్తా తెలిపారు. కాగా, తాను ఉన్న పదవిని దృష్టిలో పెట్టుకుని కమ్యూనిస్టు పార్టీ నేతల వ్యాఖ్యలపై మాట్లాడబోనన్నారు.

అవకాశమిస్తేనే గుత్తా అమిత్ పోటీ

నల్లగొండ ఎంపీగా 2019లో తాను పోటీ చేస్తే విజయం సాధించేవాడినని, అయితే రాజకీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రత్యక్ష రాజకీయాల నుంచి నామినేటెడ్ పదవులవైపు వచ్చానని గుత్తా వెల్లడించారు. తాను రాజకీయాల్లో కొనసాగినంత కాలం కేసీఆర్ వెంటే ఉంటానని, భవిష్యత్తులో ఆయనకు నచ్చకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని గుత్తా ప్రకటించారు. తనకు శాసన మండలి చైర్మన్‌గా పదవీ కాలం చాలా ఉందని, సీఎం, తాను అనుకున్నంత కాలం ఆ పదవిలో కొనసాగుతానని పేర్కొన్నారు. తన కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డి పార్టీ టికెట్ ఆశించిన మాట వాస్తవమేనని, కానీ అవకాశం లేకుంటే పార్టీ మాత్రం ఏం చేస్తుందని అన్నారు.

బట్టకాల్చి మీదేయడమే రేవంత్ పని

బట్టకాల్చి ఎదుటి వారిపై వేయడమే పనిగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని గుత్తా అన్నారు. రెడ్లకు భయపడి బీఆర్‌ఎస్ మంత్రి పదవులు ఇచ్చిందనేది అవాస్తవమని, ప్రస్తుత రాజకీయాల్లో క్వాలిటీ ఆఫ్ లీడర్ షిప్ పడిపోతోందని పేర్కొన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో సీనియర్లు కాకుండా జూనియర్ల రాజ్యం నడుస్తోందని గుత్తా సుఖేందర్ రెడ్డి వ్యాఖ్యానించారు.

ఈ ఎన్నికల్లో పోటీ చేస్తా

- మీ అండ.. బలగం ఉన్నంత కాలం దేనికీ తలవంచను
- నా రాజకీయ భవిష్యత్.. మీ చేతుల్లోనే: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



తుమ్మల ఫొటోతో ఉన్న జెండాతో పాటు కాంగ్రెస్ జెండా

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: 'ప్రజల ఆత్మగౌరవం.. అవసరం కోసం ఈ ఎన్నికల్లో పోటీ చేస్తా.. మీ అండ, బలగం ఉన్నంత కాలం దేనికీ తలవంచను.. నా రాజకీయ జీవితం మీ చేతుల్లోనే ఉంది.'అని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బీఆర్‌ఎస్ ఇటీవల అసెంబ్లీ టికెట్ల జాబితా ప్రకటించగా, తుమ్మలకు స్థానం దక్కలేదు. అప్పటి నుంచి మనస్తాపంతో ఉన్న ఆయన శుక్రవారం తొలిసారి జిల్లాకు వచ్చారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాల అనుచరులు వెయ్యికి పైగా కార్లు, ఇతర వాహనాల్లో వచ్చినాయకన్‌గూడెం వద్ద తుమ్మలకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ర్యాలీగా ఖమ్మంలోని గొల్లగూడెంలో ఉన్న ఆయన ఇంటికి చేరుకున్నారు. అక్కడ ఆయన అభిమానులను ఉద్దేశించి మాట్లాడారు. తనకు పదవి అలంకారం, అహంకారం, ఆధిపత్యం కోసం కాదని ప్రజల కళ్లలో చిరునవ్వు చూడటం కోసమేనని చెప్పారు. గత ఎన్నికల సందర్భంగా గోదావరి జలాలతో జిల్లా ప్రజల కాళ్లు కడిగి రాజకీయాల నుంచి విరమిస్తానని సీఎం కేసీఆర్‌కు చెప్పానని, అది నెరవేరాకే రాజకీయాల నుంచి నిష్క్రమిస్తానని తెలిపారు. ప్రస్తు తం రాజకీయాల నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నా.. ప్రజల ఆరాటం, అభిమానం చూశాక తనకు అవసరం లేకపోయినా.. జిల్లా కోసం, ప్రజల కోసం రాజకీయాల్లో కొనసాగుతానని చెప్పారు. పాలేరు, వైరా, లంకాసాగర్, ఉభయ జిల్లాల్లోని రిజర్వాయర్లను నింపి రాజకీ యాల నుంచి విరమిస్తానని తుమ్మల వెల్లడించారు.

తుమ్మల ఫొటోతో ప్రత్యేక జెండాలు

ర్యాలీలో ప్రతీ వాహనానికి ప్రత్యేకంగా తుమ్మల ఫొటో ఉన్న తెల్లరంగు జెండాలు కట్టారు. ఎక్కడ కూడా కేసీఆర్, కేటీఆర్ ఫొటోలు కానీ బీఆర్‌ఎస్ జెండాలు కానీ కనిపించలేదు. కొందరు తుమ్మల ఫొటో ఉన్న జెండాలతో పాటు కాంగ్రెస్ జెండాలు కూడా పట్టుకోవడం కనిపించింది.

ఆరు నూరైనా ప్రజాక్షేత్రంలో ఉంటా!

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్య



సాక్షిప్రతినిధి, వరంగల్: జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కడియం శ్రీహరి ఖరారు కావడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య రోజు రోజుకూ స్వరం పెంచుతున్నారు. రాజయ్యను బుజ్జగించేందుకు పార్టీ దూతలుగా వెళ్లిన ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డిలకు అందుబాటులో లేకుండా పోయిన రాజయ్య.. తన అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. శుక్రవారం ధర్మసాగర్ మండలంలో బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజయ్య.. 'ఆరు నూరైనా ప్రజాక్షేత్రంలో ఉంటా.. భూమి కొని మొట్లుకొట్టి.. ముండ్లు ఏరి, దుక్కి దున్ని నారు పోసి, కలుపు తీసి, పంట పండించి కుప్ప పోశాక.. ఆ కుప్ప మీద ఎవరో వచ్చి కూర్చుంటానంటే ఊర్కుంటామా?'అంటూ ఆశ్చర్యకరంగా హవ్వా.. అంటూ నోరుకొట్టుకున్నారు. 'దేవుడు లాంటి కేసీఆర్ ఉన్నాడు. మనం అనుకున్నది జరుగుతుంది.. ప్రజల కోసమే నేనున్నా, ప్రజల మధ్యలోనే చచ్చిపోతా'అని అన్నారు.

టీచర్‌కు రూ.లక్ష, హెల్పర్‌కు రూ.50వేలు..

అంగన్‌వాడీల్లో పదవీ విరమణ ప్యాకేజీ

- పదవీ విరమణ చేసిన మరుసటి నెల నుంచి ఆసరా పింఛన్
- రాష్ట్రంలోని 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాల అప్‌గ్రేడేషన్
- ఇక రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు 35,700
- సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి సత్యవతి రాథోడ్



సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న మంత్రి సత్యవతి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కీలకంగా వ్యవహరించే అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పదవీ విరమణకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త పాలసీని తీసుకొచ్చింది. ఇప్పటివరకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు నామమాత్రపు ఆర్థిక సాయంతో రిటైర్మెంట్ ఇస్తుండగా... ఇప్పుడు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సరికొత్తగా పాలసీ రూపంలో ప్రణాళికను తయారు చేసింది. ఈ పదవీ విరమణ ప్యాకేజీకి సీఎం కేసీఆర్ శుక్రవారం ఆమోదముద్ర వేశారు. తాజా ప్యాకేజీ ప్రకారం 65 ఏళ్లు దాటిన అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ అనివార్యంగా పదవీ విరమణ పొందుతారు. ఈ క్రమంలో ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్‌కు రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తుంది. అదేవిధంగా హెల్పర్‌కు రూ.50వేల చొప్పున ప్యాకేజీ ఇస్తారు. మినీ అంగన్‌వాడీ కేంద్రంలోని టీచర్‌కు కూడా రూ.50వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తారు. అదేవిధంగా పదవీ విరమణ పొందిన టీచర్, హెల్పర్‌కు మరుసటి నెల నుంచి ఆసరా పింఛన్ అందిస్తారు. ఈమేరకు కొత్తగా రూపొందించిన విధానానికి సీఎం ఆమోదముద్ర వేశారు. త్వరలో దీనికి సంబంధించి మార్గదర్శకాలు, ఉత్తర్వులు రానున్నట్లు మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పదవీ విరమణ పాలసీని తీసుకొచ్చేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ప్రగతిభవన్‌లో సీఎంను కలిసి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

మినీ అంగన్‌వాడీ కేంద్రాలు అప్‌గ్రేడేషన్...

రాష్ట్రంలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 31,711 కేంద్రాలు ప్రధాన అంగన్‌వాడీ సెంటర్లు కాగా, 3,989 కేంద్రాలు మినీ అంగన్‌వాడీ కేంద్రాలుగా కొనసాగుతున్నాయి. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్, హెల్పర్ విధులు నిర్వహిస్తుండగా... మినీ కేంద్రాల్లో మాత్రం కేవలం టీచర్ మాత్రమే ఉంటారు. ఈ క్రమంలో అన్నింటినీ సమాన కేటగిరీకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ దిశగా చర్యలు చేపట్టిన రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆ మేరకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించింది. తాజాగా సీఎం కేసీఆర్ ఈ ప్రతిపాదనలు ఆమోదించారు. దీంతో రాష్ట్రంలో మొత్తం ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య 35,700కి చేరింది. ఇక ప్రతి కేంద్రంలో టీచర్‌తో పాటు హెల్పర్ ఉంటారు. అవసరమైన చోట హెల్పర్లను నియమించేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

అప్‌గ్రేడ్ చేయడంపై హర్షం

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు పదవీ విరమణ ప్యాకేజీకి లైన్ క్లియర్ కావడం, మినీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయడం పట్ల అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈమేరకు అసోసియేషన్ తరఫున రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరని అసమ్మతి జ్వాల

▶ మొదటి పేజీ తరువాయి

బీఆర్‌ఎస్ జెండా కనిపించలేదు. తాను ప్రస్తుత ఎన్నికల్లో పోటీచేయకూడదనుకున్నా.. ప్రజల స్పందన చూసి మనసు మార్చుకుంటున్నట్టు తుమ్మల ప్రకటించారు. అయితే ఏ పార్టీలో చేరేదీ వెల్లడించలేదు.

నేడు అనుచరులతో మైనంపల్లి భేటీ

మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు శనివారం హైదరాబాద్ శివార్లలోని దూలపల్లిలో ఉన్న తన నివాసంలో అనుచరులతో భేటీ అవుతున్నట్టు ప్రకటించారు. తన కుమారుడు రోహిత్‌కు మెదక్ అసెంబ్లీ టికెట్ దక్కకపోవడంపై ఆగ్రహించిన మైనంపల్లి.. మంత్రి హరీశ్‌రావుపై తీవ్ర విమర్శలు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయనపై కఠినచర్యలు ఉంటాయని బీఆర్‌ఎస్ వర్గాలు ప్రకటించాయి. కేసీఆర్ ఏ తరహా నిర్ణయం తీసుకుంటారనేది ఇంకా తేలలేదు. మరోవైపు మైనంపల్లి పార్టీని వీడే పక్షంలో ప్రత్యామ్నాయంగా మాజీ ఎమ్మెల్యే కనకారెడ్డి కోడలు విజయశాంతి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఆకుల రాజేందర్ తదితరుల పేర్లు బీఆర్‌ఎస్ పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది.

ప్రగతి భవన్‌కు నేతల క్యూ

బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితాలో చోటు దక్కని పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఆశావహులు ప్రగతిభవన్‌కు క్యూకట్టారు. జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ శుక్రవారం మధ్యాహ్నం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. వేములవాడ టికెట్‌ను వేరే వారికి ప్రకటించిన నేపథ్యంలో చెన్నమనేని రమేశ్‌కు మరో రూపంలో అవకాశమిస్తామని సీఎం భరోసా ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి రమేశ్‌ను రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ రంగ వ్యవహారాల సలహాదారుగా కేబినెట్ హోదాలో నియమిస్తున్నట్టుగా ప్రకటన వెలువడింది. అనంతరం రమేశ్ నివాసానికి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ వెళ్లి మాట్లాడారు.

- ఇక టికెట్ల కేటాయింపులో జనగామ, నర్సాపూర్‌లలో ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి శుక్రవారం మరోమారు ప్రగతిభవన్‌కు వెళ్లి సీఎం కేసీఆర్‌ను కలిశారు.
- మరోవైపు బెల్లంపల్లి టికెట్‌ను తిరిగి దక్కించుకున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య శుక్రవారం అకస్మాత్తుగా తన కార్యకలాపాలను రద్దు చేసుకుని ప్రగతిభవన్‌కు రావడం చర్చనీయాంశమైంది.
- టికెట్ దక్కని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, పెద్దపల్లి నేత నల్ల మనోహర్‌రెడ్డి ఇప్పటికే బీఆర్‌ఎస్‌ను వీడుతున్నట్టు ప్రకటించారు. కోదాడ అసమ్మతి నేతలు శుక్రవారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు.
- రామగుండం, ఎల్‌బీనగర్, నాగార్జునసాగర్, పటాన్‌చెరు, మధిర, దేవరకొండ తదితర నియోజకవర్గాల్లోనూ అసమ్మతి ప్రకంపనలు కొనసాగుతూనే ఉన్నాయి. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఇంకా పార్టీ నేతలకు అందుబాటులోకి రావడం లేదని సమాచారం.

సాక్షి
హైదరాబాద్

శనివారం ׀ 26 ׀ ఆగస్టు ׀ 2023



రెండు కంపెనీలు.. 150 బ్యాంక్ ఖాతాలు

హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసిన భరత్‌కుమార్ రూ.1900 కోట్ల ఆర్థిక లావాదేవీలు నిర్వహించినట్లు తేలింది. -10లో



ముట్టడి.. కట్టడి

పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేయాలని బీజేపీ చేపట్టిన ఆందోళనలు ఉద్రిక్తతకు దారి తీశాయి. దీంతో బీజేపీ నేతలు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. -10లో

ఓటరు జాబితాలో పొరపాట్లుండొద్దు

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఉండాలని, ఇందుకోసం జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, మార్పు చేర్పులకు సంబంధించి నిబంధనలు, చట్టాలకనుగుణంగా వ్యవహరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ సూచించారు. శుక్రవారం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఎన్నికల అధికారులతో మాట్లాడారు.





సచివాలయానికి ఆధ్యాత్మిక కళ

డాక్టర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన దేవాలయం, మసీదు, చర్చికి శుక్రవారం సీఎం కేసీఆర్ ప్రారంభోత్సవం చేశారు. ప్రార్థనా మందిరాల ప్రారంభానికి గవర్నర్ తమిళిసై ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలిసారిగా ఇక్కడికి విచ్చేసిన గవర్నర్‌కు నూతన సచివాలయ విశిష్టతలను గురించి సీఎం వివరించారు.





న్యూస్‌రీల్

పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టండి : కమిషనర్



కేబీఆర్ పార్కు జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో గ్రీన్ వేస్ట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రోనాల్డ్ రాస్

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కును ఆనుకొని ఉన్న జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో శుక్రవారం ఉదయం జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ పర్యటించారు. స్థానిక సమస్యలను తెలుసుకోవడంతోపాటు వాక్‌వే అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంటనే ప్రణాళికలు రూపొందించేందుకు ఉపక్రమించాలన్నారు. ముఖ్యంగా వాకింగ్ ట్రాక్ మరమ్మతులు, వర్షం నీరు బయటికి వెళ్లకుండా ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. పార్కులో అవసరమైన చోట్ల విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాక్‌వేలో ఎక్కడ పడితే అక్కడ గుట్టలుగా చెట్ల కొమ్మలు, వ్యర్థాలు కనిపిస్తున్నాయని, వీటిని ఒకే చోట భారీ గుంతలో వేసి కంపోస్టు తయారు చేసేలా చర్యలు తీసుకోవాలని యూబీడీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దొత్రే, యూబీడీ అదనపు కమిషనర్ కృష్ణ, డీడీ శ్రీనివాస్, డీఎంసీ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సంపత్ పాల్గొన్నారు.

పటిష్ట ఓటరు జాబితాకు ప్రత్యేక క్యాంపెయిన్లు

సాక్షి, సిటీబ్యూరో: పటిష్టమైన ఓటరు జాబితా తయారీలో భాగంగా ఈ నెల 26, 27 తేదీల్లో, సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక క్యాంపెయిన్ సందర్భంగా ముసాయిదా ఓటరు జాబితా పోలింగ్ బూత్‌లలో బీఎల్‌ఓల వద్ద ఉంటుందని, జాబితాలో పేరుందో, లేదో చూసుకోవాల్సిందిగా ఓటర్లను కోరారు. పేర్లున్నా ఏవైనా పొరపాట్లుంటే సవరించుకునేందుకు అవకాశం ఉందన్నారు. సంబంధిత ఫారం ద్వారా పేరు లేని వారు నమోదు చేసుకోవచ్చని, పొరపాట్లుంటే సరి చేసుకోవచ్చని తెలిపారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని, దగ్గరలోని బీఎల్‌ఓలను సంప్రదించి జాబితాలో పేరు చూసుకోవచ్చన్నారు. బీఎల్‌ఓలు హాజరుకాని పక్షంలో వారిపై తీవ్రమైన క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత ఈఆర్‌ఓలను ఆదేశించారు. ఇప్పటికే 18 సంవత్సరాలు నిండి ఓటరుగా నమోదుకాని వారితోపాటు, 1 అక్టోబర్ 2023 నాటికి 18 సంవత్సరాలు నిండబోయే వారు కూడా ఓటరు నమోదుకు అర్హులని తెలిపారు.

చేజిక్కేనా?

స్వీటు 'హస్తం' ఎవరికో!

- జూబ్లీహిల్స్‌కు అజహర్.. ఎల్బీనగర్‌కు మధు యాష్కీ దరఖాస్తులు
- ప్రధాన అసెంబ్లీ సెగ్మెంట్లపై ముఖ్య నేతల దృష్టి
- ముషీరాబాద్ స్థానం కోసం అంజన్ కుమార్, అనిల్‌కుమార్..
- గోషామహల్ సీటు కావాలన్న గాయకుడు రాహుల్ సిప్లిగంజ్
- కాంగ్రెస్ పార్టీలో టికెట్ల కోసం తీవ్రమైన పోటీ



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని అసెంబ్లీ స్థానాల కాంగ్రెస్ టికెట్లపై హేమా హేమీలు ఆశలు పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అధిష్టానం పావులు కదుపుతుండటంతో టికెట్ ఆశించే ఆశావహుల సంఖ్య పెరిగింది. ఏకంగా మాజీ ఎంపీలు, రాష్ట్ర స్థాయి ముఖ్య నేతలు సైతం అసెంబ్లీ స్థానాల నుంచి బరిలో దిగేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. టీ కాంగ్రెస్ కమిటీ దరఖాస్తులు ఆహ్వానించడంతో నగరంలోని 24 అసెంబ్లీ సెగ్మెంట్లకు భారీగానే అర్జీలు వచ్చి చేరాయి. ఒక్కో అసెంబ్లీ స్థానానికి ముగ్గురు నలుగురు చొప్పున దరఖాస్తు చేసుకున్నారు. పాత బస్తీ అసెంబ్లీ స్థానాలు మినహా మిగతా వాటికి దరఖాస్తుల సంఖ్య బాగానే పెరిగింది. నిజామాబాద్‌కు చెందిన మాజీ ఎంపీ మధుయాష్కీ ఎల్బీనగర్ టికెట్ ఆశిస్తూ దరఖాస్తు చేసుకోవడం రాజకీయ వేడిని రగిల్చింది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి మాజీ క్రికెటర్ అజహరుద్దీన్ దరఖాస్తు చేసుకోవడం చర్చనీయాంశమైంది. ఇప్పటికే అక్కడి నుంచి మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల ఆ నియోజకవర్గంలో సమావేశం పెట్టిన అజరుద్దీన్‌కు విష్ణువర్గం నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. మరోవైపు ముషీరాబాద్ స్థానానికి మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్‌తో పాటు ఆయన కుమారుడు, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు అనిల్ కుమార్ పోటీ పడుతున్నారు. గోషామహల్ స్థానానికి సినీ గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ దరఖాస్తు చేసుకున్నారు. ఇక్కడి నుంచి పీసీసీ నేత మెట్టు సాయికుమార్, మధుసూదన్ గుప్తా, వినయ్‌కుమార్ ముదిరాజ్‌లు కూడా రేసులో ఉన్నారు.

టికెట్లపై ఆశతో..

నగరంలోని పలు నియోజకవర్గాల్లో ఆశావహులు టికెట్‌పై ఆశతో ప్రజా మద్దతు కూడగట్టుకునేందుకు స్థానికంగా సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఖైరతాబాద్ స్థానంపై రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు, డీసీసీ అధ్యక్షుడు రోహిణ్ రెడ్డి, పీసీసీనేత వినోద్ రెడ్డి, కార్పొరేటర్ విజయా రెడ్డిలు ఆశలు పెట్టుకున్నారు. సనత్‌నగర్ నుంచి పీసీసీ కార్యదర్శి కోటా నీలిమ, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి తనయుడు మర్రి ఆదిత్య రెడ్డి, సరోజినీదేవి కంటి ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ రవీందర్ గౌడ్ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఎవరికి వారే రంగంలో దిగి ప్రజా మద్దతు పొందేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. సికింద్రాబాద్ కోసం వ్యాపార వేత్త నోముల ప్రకాశ్‌రావు, సాయిబాబా, ఆదం సంతోష్‌కుమార్‌లు టికెట్ ఆశిస్తుండగా, కంటోన్మెంట్, మల్కాజిగిరి, శివారు ప్రాంతాల్లోని ఎల్బీనగర్, ఉప్పల్, మహేశ్వరం తదితర అసెంబ్లీ స్థానాల టికెట్లకు తీవ్ర పోటీ నెలకొంది.

ఆల్విన్ సే ఆదిత్య

చంద్రయాన్- 3 సక్సెస్‌లో మన పాత్ర

- కూకట్‌పల్లిలో తయారైన పరికరాలు
- 25 సంవత్సరాలుగా 50 ప్రయోగాలు
- ప్రధాన భాగస్వామిగా నాగభూషణ్ రెడ్డి
- ఆయనపై అంతటా ప్రశంసల జల్లు




నాగభూషణ్‌రెడ్డి

కూకట్‌పల్లి: చంద్రయాన్- 3లో కీలకమైన ల్యాండర్, రోవర్, ప్రొపెల్లషన్ మాడ్యూల్, బ్యాటరీ స్లీవ్స్ పరికరాలను అందించి ఇస్రో చరిత్రలో కూకట్‌పల్లి స్థానాన్ని నిలబెట్టిన బి.నాగభూషణ్‌రెడ్డి (బీఎస్ రెడ్డి)పై నగర వాసులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. గత 25 సంవత్సరాలుగా 50 ప్రయోగాల్లో తన భాగస్వామ్యాన్ని నిలబెట్టుకొని అన్నింటిలో సమర్థతను నిరూపించుకొని ఇస్రో వంటి సంస్థల్లో శభాష్ అనిపించుకున్న నాగభూషణ్‌రెడ్డికి అడుగడుగునా ప్రశంసలు అందుతున్నాయి. ఆయన ప్రస్థానం ఇలా సాగింది..

మొదట చిన్నతరహా పరిశ్రమలో ఉద్యోగం..

విజయవాడలో ఇంజినీరింగ్ 1982లో ఇంజినీరింగ్ పూర్తి చేసిన బీఎస్ రెడ్డి చిన్న తరహా పరిశ్రమలో ఉద్యోగం చేసి అనంతరం 1984లో బాలానగర్ సీఐటీడీలో ఎంటెక్ మెకానికల్ పూర్తి చేశారు. హైదరాబాద్ ఆల్విన్ కంపెనీలో ఉద్యోగంలో చేరిన బీఎస్ రెడ్డి తాను కూడా కొందమందికి ఉపాధి కల్పించాలనే ఆలోచనతో 1994లో నాగసాయి పెసిషియన్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని స్థాపించారు. హెచ్‌ఏఎల్, బీఈఎల్‌తో పాటు యూఏఐ ఎయిర్‌క్రాఫ్ట్ వంటి సంస్థలకు విమాన విడి భాగాలను అందజేసిన నాగసాయి కంపెనీ ఇస్రోకు బీఎస్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఆయనతో పలు దఫాల ఇంటర్వ్యూలతో పాటు ఆయన తయారు చేసిన పరికరాలపై ప్రమాణాల పరీక్షలు నిర్వహించిన అనంతరం అవకాశం కల్పించారు. మొట్టమొదటగా ఇన్సాట్ 2ఈలో ఆయనకు భాగస్వామ్యం కల్పించారు. దీంతో ఆయన తయారు చేసిన వస్తువుల నాణ్యతతో కన్పించటంతో అప్పటి నుంచి 25 సంవత్సరాలుగా ఇస్రోకు పరికరాలు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా చంద్రయాన్- 3 సక్సెస్‌తో బీఎస్ రెడ్డి ప్రతిభ సమున్నత శిఖరాలకు చేరింది.



చంద్రయాన్‌కు ఏయే పరికరాలు అందించారంటే..

చంద్రయాన్- 3లో బ్యాటరీలు, ల్యాండర్, రోవర్, ప్రొఫెల్లషన్ మాడ్యూల్ వంటి పరికరాలు అందజేశారు. ప్రస్తుతం ల్యాండర్ చంద్రమండలంలో ఉంది. రోవర్ నుంచి ల్యాండర్ విడిపోయింది. అంతకు ముందు ప్రొఫెల్లషన్ మాడ్యూల్ చంద్రునికి 153 కిలోమీటర్ల దూరంలో ప్రయాణించింది. ఇంత సాహసోపేతమైన కార్యాచరణలో తాను భాగస్వామి కావడం ఎంతో అదృష్టమని బీఎస్ రెడ్డి హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఇప్పటి వరకు ఎన్నో ప్రయోగాలు..

1998 నుంచి ఇన్సాట్ 2ఈ మొదలుకొని ఆదిత్య ఎల్1తో పాటు గగన్‌యాన్‌లో కూడా బీఎస్ రెడ్డి భాగస్వామ్యం అవుతున్నారు. ఇప్పటి వరకు జరిగిన ప్రయోగాల్లో అన్నింటిల్లో ఆయనకు ఇస్రో నుంచి సంపూర్ణ మద్దతు లభించటమే కాకుండా ప్రశంసలు కూడా అందాయి.

ఇస్రోకు పరికరాలు ఎందుకు అందించాలనుకున్నారంటే..

బీఎస్ రెడ్డి 1992లో ఆల్విన్ కంపెనీలో ఉద్యోగం చేసిన తర్వాత 1994లో నాగసాయి పెసిషియన్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి హెచ్‌ఏఎల్, బీఈఎల్‌తో పాటు యూఏఐ ఎయిర్‌క్రాఫ్ట్ వంటి సంస్థలకు పరికరాలు అందజేశారు. 1998లో ఇస్రోకు కూడా దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం ఇస్రో వారు పలు దఫాలుగా తన పరికరాల నాణ్యతా పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయనను 1998లో ఇన్సాట్- 2ఈ ద్వారా ఈ ప్రయోగాలకు పరిచయం చేశారు. అప్పటి నుంచి తన కార్యాచరణ కొనసాగుతూనే ఉంది.

ఎన్ని ప్రయోగాలు విజయవంతమయ్యాయి?

1998 నుంచి బీఎస్ రెడ్డి తయారు చేసే ప్రతి పరికరం ఉపయోగపడింది. 50 ప్రయోగాల్లో ఒక్క ప్రయోగం మినహా మిగిలిన ప్రయోగాలన్నీ విజయవంతమయ్యాయి. ఇన్సాట్ సిరీస్, జీ శాట్ సిరీస్, చంద్రయాన్- 1, 2, 3, గగన్‌యాన్, కార్టో శాట్, ఐఆర్‌ఎన్‌ఎస్ శాటిలైట్ వంటి అనేక ప్రయోగాల్లో పరికరాలను అందజేశారు.

విశ్వవ్యాప్తంగా ప్రశంసలు..

'మారుమూల గ్రామం నుంచి నేను హైదరాబాద్‌కు వచ్చి ఇస్రోకు అవసరమైన పరికరాలు తయారు చేయడం ఎంతో గర్వకారణం. జీవితంలో ఇంకేం సాధించాలి? రాష్ట్రాలు దాటితేనే ఒక గొప్ప. అలాంటిది దేశాలే కాకుండా అంతరిక్షంలోకి నేనే వెళ్లినట్లుగా సంతోషపడుతున్నాను. ఇప్పటికే నాకు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయి. బంధువులతో పాటు శాస్త్రవేత్తలు ప్రతి రోజూ ఫోన్ చేయటం నా అదృష్టం'గా భావిస్తున్నా అన్నారు బీఎస్ రెడ్డి.

గోషామహల్ సస్పెన్స్

సాక్షి, సిటీబ్యూరో: బీఆర్‌ఎస్ సీట్ల కేటాయింపులో నగరంలోని రెండు నియోజకవర్గాలను.. అందులోనూ గోషామహల్‌ను ఎందుకు పెండింగ్‌లో ఉంచారన్నది నగరంలో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను నాలుగింటినే పెండింగ్‌లో ఉంచారు. ఇందులో రెండు సీట్లు నగరంలోని నాంపల్లి, గోషామహల్‌వే కావడం తెలిసిందే. ఈసారి గోషామహల్‌ను ఎలాగైనా దక్కించుకోవాలనే తలంపుతోనే బీఆర్‌ఎస్ ఆచితూచి వ్యవహరిస్తోందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

- గోషామహల్ ఏర్పాటుకు ముందు అది మహరాజ్‌గంజ్ నియోజకవర్గంగా ఉండేది. గోషామహల్‌గా ఏర్పాటయ్యాక వరుసగా రెండు పర్యాయాలు బీజేపీ అభ్యర్థిగా రాజాసింగ్ గెలుపొందారు. 2018 ఎన్నికల్లో బీజేపీ గెలిచిన ఒకే ఒక్క నియోజకవర్గం అదే. బీజేపీకి కంచుకోటగా మారిన ఆ నియోజకవర్గంలో ఎలాగైనా బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయాలనే తలంపుతోనే ఆ నియోజకవర్గాన్ని పెండింగ్‌లో ఉంచినట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.
- దాదాపు ఏడాది క్రితం రాజాసింగ్‌ను సస్పెండ్ చేసిన బీజేపీ.. ఇంతవరకు సస్పెన్షన్ ఎత్తివేయలేదు. ఈసారి బీజేపీ మరో అభ్యర్థిని రంగంలోకి దింపుతుందా.. లేక రాజాసింగే వస్తారా అన్నది వెల్లడి కావాల్సి ఉంది. బీఆర్‌ఎస్ తొలి జాబితా వెల్లడి కాగానే రాజాసింగ్ స్పందిస్తూ.. గోషామహల్ పెండింగ్‌లో ఉంచడానికి కారణం ఎంఐఎం అని, ఆ పార్టీ సూచించిన వారికే టికెట్ ఇస్తారని ఆరోపించడంతో పాటు రానున్న ఎన్నికల్లోనూ బీజేపీ నుంచి పోటీ చేసేది తానేనని, ఈసారి కూడా గెలిచి హ్యాట్రిక్ సాధిస్తానని బహిరంగంగా ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ కన్ను

- కాంగ్రెస్ పార్టీ సైతం ఈసారి గోషామహల్ నియోజకవర్గాన్ని తన ఖాతాలో వేసుకోవాలనే యోచనలో ఉంది. మహరాజ్‌గంజ్ నియోజకవర్గంగా ఉన్నప్పుడు 1989, 2004లలో రెండు పర్యాయాలు, గోషామహల్‌గా రూపాంతరం చెందాక 2009లో కాంగ్రెస్ నుంచి ముఖేశ్‌గౌడ్ గెలుపొందారు. కాంగ్రెస్ ఓట్లు గణనీయంగా ఉన్న ఆ నియోజకవర్గాన్ని తిరిగి తమ ఖాతాలో వేసుకునేందుకు ఆ పార్టీ దృష్టి సారించింది. ఈ నియోజకవర్గం నుంచి టికెట్ కోసం రాహుల్ సిప్లిగంజ్ దరఖాస్తు చేసుకోవడంతో ఆయనకు టికెట్ ఇస్తే యూత్ ఓట్లు గణనీయంగా పడటమే కాకుండా ప్రచారం తిరుగులేని విధంగా ఉండి గెలుపు ఈజీ కానుందని పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.
- యూత్‌లో ఎంతో క్రేజ్ ఉన్న రాహుల్ సిప్లిగంజ్ ఒక సీజన్‌లో బిగ్‌బాస్ విన్నర్‌గా గెలుపొందడంతో పాటు 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా పాటతో ఆస్కార్ దాకా వెళ్లడం తెలిసిందే. పార్టీయే ఆయనను ఆహ్వానించి ఉంటుందనే అభిప్రాయాలున్నాయి. మంగళ్‌హాట్‌కు చెందిన రాహుల్ తన నివాసాన్ని అక్కడి నుంచి మార్చినప్పటికీ అక్కడి బస్తీల్లో అభిమానించేవారు భారీగా ఉన్నారు. అటు మాస్.. ఇటు క్లాస్ రెండు వర్గాల్లో ఎంతో గుర్తింపు ఉన్న సిప్లిగంజ్‌కు టిక్కెట్ ఇస్తే గత వైభవం తిరిగి పొందవచ్చునని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

వైరి పార్టీల అభ్యర్థుల కన్నా దీటైన వారిని దింపేందుకేనా?

- కాంగ్రెస్ నుంచి రాహుల్ సిప్లిగంజ్ దరఖాస్తుతో మరింత ఉత్కంఠ
- గెలుపు గుర్రం కోసం బీఆర్‌ఎస్ అన్వేషణ
- బీజేపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కే చాన్స్?



వేచి చూసే ధోరణిలో బీఆర్‌ఎస్

బీఆర్‌ఎస్ తొలుత గోషామహల్ టిక్కెట్‌ను నందు బిలాల్‌కు కేటాయిస్తుందని భావించినప్పటికీ, అంతకంటే బలమైన అభ్యర్థి కోసమే వేచి చూస్తున్నట్లు సమాచారం. ఈసారి ఎలాగైనా గోషామహల్‌లో గులాబీ జెండా ఎగురవేసేందుకు చివరి దాకా వేచి చూసి.. మిగతా పార్టీలకంటే బలమైన అభ్యర్థిని బరిలో దింపాలనేది బీఆర్‌ఎస్ యోచనగా తెలుస్తోంది. అందుకు తగిన అభ్యర్థిని అన్వేషిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్, బీజేపీల అభ్యర్థులు ఖరారయ్యాకే బీఆర్‌ఎస్ అభ్యర్థిని ప్రకటిస్తారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.





కూకట్‌పల్లిలో..

వరాల తల్లీ.. కరుణించు..

శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాలతో నగరంలోని లోగిళ్లన్నీ పండుగ కళను సంతరించుకున్నాయి. మహిళలు బొమ్మల కొలువు, ప్రత్యేక పూజలు చేసి వరలక్ష్మీదేవిని భక్తిప్రపత్తులతో కొలిచారు. సిరి సంపదలతో తులతూగాలని అమ్మవారిని వేడుకున్నారు. చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.

బోడుప్పల్‌లో దొంగల హల్‌చల్

- 30 తులాల బంగారం, ల్యాప్‌టాప్, 2 సెల్‌ఫోన్లు అపహరణ

మేడిపల్లి: బోడుప్పల్‌లో దొంగలు హల్‌చల్ సృష్టించారు. ఇంటి తాళాలు పగులగొట్టి 30 తులాల బంగారం, ఓ ల్యాప్‌టాప్, రెండు సెల్‌ఫోన్లను అపహరించారు. ఈ ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి బోడుప్పల్ కాకతీయనగర్‌లో చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్ హసీమ్, అజీజ్ ఫాతిమా దంపతులు. హసీమ్ దుబాయ్‌లో ఉంటుండగా.. ఆయన భార్య తన ముగ్గురు పిల్లలతో కలిసి మేడిపల్లి మండలం బోడుప్పల్ కాకతీయ కాలనీలో సంవత్సర కాలంగా నివాసముంటోంది. గురువారం కూతురు వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లిన ఫాతిమా సమీపంలోని బంధువుల ఇంటి వద్దనే ఉన్నారు. గురువారం రాత్రి ఫాతిమా ఇంటి తాళాలను పగులగొట్టిన దొంగలు.. బీరువాలో ఉన్న సుమారు 30 తులాల బంగారం, ల్యాప్‌టాప్, రెండు సెల్‌ఫోన్లను అపహరించారు. ఉదయం ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించిన పనిమనిషి ఫోన్‌లో ఈ విషయాన్ని యజమానురాలికి తెలిపింది. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

ముట్టడి..కట్టడి


హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

- బీజేపీ ఆధ్వర్యంలో జిల్లెలగూడలోని మంత్రి క్యాంప్ కార్యాలయం ముట్టడి
- పోలీసులకు, ఆందోళనకారుల మధ్య తోపులాట.. నేతల అరెస్టు
- కార్పొరేటర్ వంగ ఇంటిని ముట్టడించిన బీఆర్ఎస్ శ్రేణులు
- హైదరాబాద్ కలెక్టరేట్ ముట్టడి.. ముఖ్య నేతల ధర్నా

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతకు దారి తీశాయి. జిల్లెలగూడలోని మంత్రి సబిత క్యాంప్ ఆఫీసు ముట్టడికి మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ నేతలు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. పోలీసులు, ఆందోళన కారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. తోపులాటలో ఆందోళనకారులతో పాటు పోలీసులు సైతం కింద పడిపోయారు. రంగారెడ్డి జిల్లా రూరల్ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ సహా పలువురు కార్పొరేటర్లు సీఎం కేసీఆర్, మంత్రి సబితకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అప్పటికే అక్కడికి భారీగా చేరుకున్న బీఆర్ఎస్ శ్రేణులు సైతం పోటాపోటీగా నినాదాలు చేశాయి. అరెస్ట్ చేసిన ఆందోళన కారులను పోలీసులు అబ్దుల్లా పూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా:
అర్హులందరికీ, డబుల్ బెడ్‌రూములు, బీసీ బంధు, దళిత బంధు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిటీ బీజేపీ ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ ఎన్.లక్ష్మణ్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతం రావు, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్, మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి, కేశబోయిన శ్రీధర్, సురేందర్‌రెడ్డి సహా పార్టీ ముఖ్య నేతలు ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కార్యాలయం ఎదుట బైఠాయించారు. పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన కారులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ..సెప్టెంబర్ 7 లోగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేయాలని, లేని పక్షంలో మిలియన్ మార్చి తరహాలో హైదరాబాద్‌ను దిగ్బంధించడానికి సైతం వెనుకాడబోమని హెచ్చరించారు.

బీజేపీ కార్పొరేటర్ ఇంటిని ముట్టడించిన బీఆర్ఎస్ నేతలు:
ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఆ పార్టీ శ్రేణులు బీజేపీ కార్పొరేటర్ వంగమధుసూదన్ ఇంటిని ముట్టడించారు. ఈ విషయం తెలిసి బీజేపీ నేతలు అక్కడికి పెద్ద సంఖ్యలో చేరు కుని, ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇరు వర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఈ తోపులాటలో ఇరు వర్గాలకు చెందిన మహిళలు కిందపడిపోయారు. దీంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఆందోళన కారులను అదుపులోకి తీసుకున్నారు. తనను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక ఇంటి మీదికి మహిళలను పంపుతున్నారని విమర్శించారు. ఇంటిపై దాడికి వచ్చిన నేతలను అడ్డుకోవాల్సిన పోలీసులు ఎమ్మెల్యేకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు తగిన బుద్ధి చెప్పి తీరుతామని హెచ్చరించారు.

తండ్రి కొడుకులపై కత్తితో దాడి


ముంతాజ్


అబ్రార్..

సుభాష్‌నగర్: పాత గొడవల కారణంగా ఇద్దరు వ్యక్తులు తండ్రి కొడుకులపై కత్తితో దాడికి పాల్పడిన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణానగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముంతాజ్ తన కుమారుడు అబ్రార్‌తో సహా కృష్ణానగర్, వేమారెడ్డినగర్‌లో నివాసం ఉంటూ స్క్రాప్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. వారి ఎదురింట్లోనే నివాసం ఉంటున్న వారి సమీప బంధువులు హబీబ్, లల్లు గతంలో ముంతాజ్ స్క్రాప్ దుకాణంలో పని చేసేవారు. ఈ క్రమంలో వారిరువురూ రూ.10 లక్షల విలువైన స్క్రాప్ చోరీకి పాల్పడటంతో వారిని పనిలో నుంచి తొలగించారు. అప్పటి నుంచి వారి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. తమపై దొంగతనం ఆరోపణలు మోపారని కక్ష పెంచుకున్న హబీబ్, లల్లు శుక్రవారం మధ్యాహ్నం నమాజ్ ముగించుకుని వస్తున్న ముంతాజ్, అబ్రార్‌లపై కత్తితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ముంతాజ్, అబ్రార్‌లను స్థానికులు మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రికి తరలించారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న సూరారం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ నారాయణ సింగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూడో రోజు మోకిలలో అదే మురిపెం

- ప్లాట్ల కోసం పోటా పోటీగా వేలం
- శుక్రవారం రెండు సెషన్లలో 60 ప్లాట్ల అమ్మకం
- గరిష్టంగా గజం రేటు రూ.76 వేలు
- కనిష్టంగా రూ.55వేలు
- సరాసరి రేటు రూ.64,159
- మూడో రోజు రెవెన్యూ రూ.131.97కోట్లు
- మూడు రోజుల్లో 180 ప్లాట్ల అమ్మకాల ద్వారా రూ.387.11 కోట్ల ఆదాయం
- మళ్లీ సోమ, మంగళవారాల్లో ఈ వేలం

సాక్షి, సిటీబ్యూరో: రంగారెడ్డి జిల్లా, శంకర్ పల్లి మండలం, మోకిలలో హెచ్ఎండీఏ లేఅవుట్ ప్లాట్ల రేట్లకు విపరీతమైన డిమాండ్ వస్తోంది. గత మూడు రోజులుగా మోకిల లేఅవుట్ లో ప్లాట్ల కొనుగోలు కోసం పోటాపోటీగా వేలంపాటలో పాల్గొని అధిక రేట్లకు ప్లాట్లను సొంతం చేసుకుంటున్నారు. మూడో రోజు (శుక్రవారం) కూడా అదే ట్రెండ్ కొనసాగింది. మోకిల ప్రాంతంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్ మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) దాదాపు 165 ఎకరాల విస్తీర్ణంలో 300 గజాల చొప్పున 1,321 ప్లాట్లతో మోకిలలో రెసిడెన్షియల్ లేఅవుట్ ను రూపొందించింది. హెచ్ఎండీఏకు ప్రజల్లో ఉన్న నమ్మకం, విశ్వాసం, ఆదరణ వల్లే ప్రైవేటు రియల్ ఎస్టేట్ సంస్థల కంటే హెచ్ఎండీఏ వెంచర్లలో సాధారణ ప్రజానీకం, ఉద్యోగులు, వ్యాపారస్తులు స్థిరాస్తి పెట్టుబడులు పెట్టేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మోకిల హెచ్ఎండీఏ వెంచర్ లో ప్లాట్ల కొనుగోలు కోసం గత మూడు రోజులుగా ఈ వేలంలో పాల్గొని పోటీపడి మరి ప్లాట్లను సొంతం చేసుకుంటున్నారు. మూడోరోజు (శుక్రవారం) ఉదయం 30 ప్లాట్లకు వేలం నిర్వహించగా, అన్ని ప్లాట్లు అమ్ముడు పోయాయి.

ఉదయం జరిగిన వేలంలో గజం ధర అత్యధికంగా రూ.76,000 పలుకగా, కనిష్టంగా గజం ధర రూ.55,000 వరకు వచ్చింది. మధ్యాహ్నం 30 ప్లాట్లకు వేలం జరగగా అన్ని ప్లాట్లు అమ్ముడుపోయాయి. మధ్యాహ్నం నుంచి జరిగిన వేలంలో గజం ధర అత్యధికంగా రూ.74,000 పలుకగా, కనిష్టంగా గజం ధర రూ.56,000 వరకు వచ్చింది.

శుక్రవారం మూడో రోజు మోకిలలో 60 ప్లాట్ల అమ్మకం ద్వారా రూ.132.97కోట్ల రెవెన్యూ వచ్చింది. వరుసగా ఈనెల 23, 24, 25వ తేదీల్లో రోజుకు 60 ప్లాట్ల చొప్పున 180 ప్లాట్లను ఆన్ లైన్ వేలం(ఈ ఆక్షన్) ద్వారా అందుబాటులో పెట్టగా వాటిల్లో రెండు(2) ప్లాట్లు ఆబ్ నార్మల్ బిడ్స్ మినహా 178 ప్లాట్లు అమ్ముడు పోయాయి. వరుసగా మూడు రోజుల పాటు 178 ప్లాట్ల అమ్మకాల ద్వారా హెచ్ఎండీఏకు రూ.387.11కోట్ల ఆదాయం వచ్చింది. మళ్లీ సోమవారం(28వ తేదీ), మంగళవారం(29వ తేదీ)ల్లో రోజుకు 60 ప్లాట్ల చొప్పున మోకిల ప్లాట్లను ఈ వేలం ప్రక్రియ ద్వారా అమ్మకాలు చేపట్టనున్నారు.

ప్రేమ పేరుతో మోసం

జబర్దస్త్ నటుడి అరెస్ట్

వెంగళరావునగర్ : ప్రేమ పేరుతో ఓ యువతిని నమ్మించి మోసం చేసి తప్పించుకుని తిరుగుతున్న జబర్దస్త్ నటుడిని మధురానగర్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జబర్దస్త్ షోలో కమెడియన్‌గా ఉన్న నవ సందీప్‌కు 2018లో ఓ యువతితో పరిచయం ఏర్పడింది. వారిరువురూ వాట్సప్‌లో చాటింగ్ చేసుకునేవారు. ఈ విషయం సదరు యువతి ఇంట్లో తెలియడంతో ఆమెను కట్టడి చేశారు. నవసందీప్ సూచనమేరకు నగరానికి వచ్చిన ఆమె నాలుగేళ్లుగా షేక్‌పేట్ ఆల్ హమారా కాలనీలో నివాసం ఉంటోంది. తరచూ వారిరువురు కలిసేవారు. కొన్నాళ్లుగా ఆమె పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తుండటంతో నవసందీప్ తప్పించుకుని తిరుగుతున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గోల్కొండ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును మధురానగర్ పీఎస్‌కు బదిలీ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నగరంలో పరుగు సంస్కృతి పెంచాలి

హైటెక్స్‌లో స్పోర్ట్స్ ఎక్స్‌పో ప్రారంభం

మాదాపూర్: నగరంలో పరుగు సంస్కృతిని పెంచాలని సినీనటుడు మంచువిష్ణు పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం స్పోర్ట్స్ ఎక్స్‌పో ఇండియా– 2023ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంచు విష్ణు మాట్లాడుతూ.. మనం ఫిట్‌గా ఉండాలంటే నగరంలో పరుగు సంస్కృతిని పెంపొందించాలని సూచించారు. హైటెక్స్ బిజినెస్ సెంటర్ హెడ్ టీజీ.శ్రీకాంత్ మాట్లాడుతూ.. 100 ఎగ్జిబిటర్లు, గేమ్‌లు, సౌకర్యాలు, ఫిట్‌నెస్ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు. మూడ్రోజుల పాటు ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు ఎక్స్‌పో అందుబాటులో ఉంటుందని, ప్రవేశం ఉచితమని తెలిపారు. మూడు రోజుల్లో దాదాపు 30వేల మంది సందర్శించనున్నట్టు తెలిపారు. ఎక్స్‌పోలో భాగంగా వివిధ క్రీడా చాంపియన్‌షిప్‌లు, సైక్లోథాన్, మిస్టర్ స్పోర్టెక్స్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్‌లు నిర్వహించనున్నట్టు చెప్పారు. భాగ్యనగర్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిస్టర్ స్పోర్టెక్స్ క్లాసిక్ ఇండియాను నిర్వహించి.. ప్రైజ్ మొత్తం రూ.5 లక్షల నగదు పురస్కారాలు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఐడీఎఫ్‌సీ రీజినల్ హెడ్ శ్రీనివాస్ గుత్తి, హైదరాబాద్ రన్నర్స్ ప్రెసిడెంట్ అభిజిత్ మద్నూర్కర్, ఎన్ఎండీసీ రేస్ డైరెక్టర్ ప్రశాంత్ మోర్పారియా, హైదరాబాద్ రన్నర్స్ సెక్రటరీ అరుణ్ కాలియప్పన్ తదితరులు పాల్గొన్నారు.


స్పోర్ట్స్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న మంచు విష్ణు

రెండు కంపెనీలు..150 బ్యాంక్ ఖాతాలు

భరత్ కుమార్ లావాదేవీలు రూ1900 కోట్లు
- చైనా, యూరోప్, దుబాయ్‌లకు చెందిన సైబర్ నేరగాళ్లతో ఒప్పందం
- హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసుల విచారణలో వెలుగులోకి

హిమాయత్‌నగర్: పార్ట్‌టైమ్ జాబ్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాల్లో ఇటీవల హైదారాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసిన ముంబైకి చెందిన రోనక్ భరత్‌కుమార్ కక్కడ్ రూ.1900 కోట్ల ఆర్థిక లావాదేవీలు నిర్వహించినట్లు పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది. తన నెట్‌వర్క్‌లోని 150 బ్యాంకు ఖాతాల్లో సుమారు రూ.1500 కోట్ల ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు తాజాగా గుర్తించారు. ఇది వరకే రెండు బ్యాంకు ఖాతాల్లో రూ.400 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించిన విషయం తెలిసిందే. దీంతో ఇప్పటి వరకు రూ.1900 కోట్ల ఆర్థిక లావాదేవీలను సైబర్‌క్రైమ్ పోలీసులు గుర్తించారు. చైనా సైబర్ నేరగాళ్లు తైవాన్, దుబాయ్, యూరోప్ దేశాల్లో ఉంటూ భారతదేశంలో కొందరు ఏజెంట్లను ఉద్యోగులుగా నియమించుకుని పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో దేశ వ్యాప్తంగా అమాయకుల నుంచి భారీగా పెట్టుబడులు పెట్టిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో విదేశీ సైబర్ నేరగాళ్లకు భారతదేశంలో కింగ్‌పిన్‌గా వ్యవహరించిన ముంబైకి చెందిన భరత్‌కుమార్‌ను వారం రోజుల క్రితం సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేయడంతో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

రెండు కంపెనీల పేర్లపై ఖాతాలు..
ముంబైకి చెందిన రోనక్ భరత్‌కుమార్ కక్కడ్ డిజిటల్ మార్కెటింగ్ వ్యాపారం నిర్వహించేవాడు. ఇందులో భాగంగా రొలైట్ మార్కెట్, బ్లాక్ వే డిజిటల్ పేర్లతో రెండు కంపెనీలను ప్రారంభించి వాటి పేర్లతో బ్యాంకు ఖాతాలు నిర్వహిస్తున్నాడు. ఇతనికి టెలిగ్రామ్‌లో తైవాన్‌కు చెందిన స్వాంగ్ లిన్, యూరోప్‌కు చెందిన ఐరీశ్‌తో పరిచయం ఏర్పడింది. తమకు ఇండియాలో భారీగా డబ్బు జమ అవుతుందని, అందుకు సంబంధించిన బ్యాంకు ఖాతాలు కావాలని వారు కోరారు. పార్ట్‌టైమ్ జాబ్‌లు చేయిస్తూ అందుకు అడ్వాన్స్‌గా డబ్బులు తీసుకుంటామని, ఆ డబ్బును వివిధ ఖాతాల్లో డిపాజిట్ చేయిస్తామంటూ నమ్మించే ప్రయత్నం చేశారు.

20శాతం కమీషన్‌తో ఒప్పందం
మీరు చేస్తున్న అక్రమ దందాలు, సైబర్‌నేరాలు తనకు తెలుసంటూ వారితో వ్యాపార భాగస్వామానికి అయితే సరేనంటూ భరత్‌కుమార్ వారితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇండియాలో వివిధ బ్యాంకు ఖాతాలో పడే డబ్బంతా క్రిప్టో కరెన్సీ యుఎస్‌డీటీగా మార్చి పంపిస్తానని, అందుకు తనకు 20 శాతం కమిషన్ ఇవ్వాలని కోరాడు. అనంతరం దుబాయ్‌లో ఉంటున్న తన స్నేహితుడు ప్రశాంత్‌తో కలిసి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి బ్యాంకు ఖాతాలు కమిషన్ పద్ధతిలో సేకరించేవారు. ఆయా ఖాతాల్లో పడిన సొమ్మును ప్రశాంత్, భరత్ దినార్‌లు, క్రిప్టోలోకి మార్చి విదేశాల్లో ఉన్న సైబర్‌నేరగాళ్లకు పంపేవారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు అందించిన ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు భరత్‌కుమార్ నెట్‌వర్క్‌ను వెలుగులోకి తెచ్చారు. మొదట భరత్‌కుమార్‌కు చెందిన రెండు బ్యాంకు ఖాతాలను పరిశీలించగా అందులో రూ.400 కోట్ల ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు, వీటితో పాటు మరో 150బ్యాంకు ఖాతాలను పరిశీలించగా రూ.1500 కోట్ల ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. భరత్ మరిన్ని ఖాతాలు నిర్వహించినట్లు అనుమానిస్తున్న సైబర్ క్రైం పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ప్రొఫెసర్ ఆత్మహత్య

హఫీజ్‌పేట్ : ఓ ప్రొఫెసర్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శేరిలింగంపల్లి ఓల్డ్ ఎంఐజీలో నివాసముంటున్న తళ్లూరి రాధా ఫణి ముఖర్జీ (47) ఓ కాలేజీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. అతని భార్య గత సంవత్సరం అనారోగ్యంతో మృతి చెందింది. కుమారుడు రేవంత్ గుంటూరులో ఉంటున్నాడు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ముఖర్జీ గత కొన్ని రోజులుగా మనస్తాపంతో బాధపడుతున్నాడు. ఈ నెల 24న అతను కాలేజీకి రావడం లేదంటూ సమాచారం అందించాడు. రెండు రోజులుగా సోదరుడి నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో ముఖర్జీ సోదరి అవంతి కృష్ణ ప్రసాద్ అతని ఇంటికి వెళ్లి చూడగా తలుపులు మూసి ఉన్నాయి. ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో స్థానికుల సహాయంతో తలుపులు తెరిచి చూడగా అతను ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. 'నా చావు ఎవరు బాధ్యులు కారు.. నా ఆస్తి మొత్తం తన కుమారుడు రేవంత్ ఇవ్వాలని సూసైడ్ లెటర్‌లో పేర్కొన్నాడు. మృతుని సోదరి ఫిర్యాదు మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

స్నానం చేసేందుకు వెళ్లి..

- చెరువులో మునిగి ఇద్దరు గల్లంతు
- ఒకరి మృతదేహం వెలికితీత
- మరొకరి కోసం కొనసాగుతున్న గాలింపు


రాజు (ఫైల్)


ప్రకాష్ (ఫైల్)

నిజాంపేట్: స్నానం చేసేందుకు చెరువులోకి దిగిన ఇద్దరు వ్యక్తులు నీట మునిగి గల్లంతైన సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. న్యూఢిల్లీకి చెందిన రాజు(35), ప్రకాష్ రాథోడ్ (45) బాచుపల్లి విష్ణుగార్డెన్స్‌లో ఉంటూ వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నారు. గురువారం సాయంత్రం వారు స్నానం చేసేందుకు బాచుపల్లిలోని బైరాన్ చెరువుకు వెళ్లారు. చెరువులో దిగిన ఇద్దరికీ ఈత రాకపోవడంతో నీటిలో మునిగి గల్లంతయ్యారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీసులు డీఆర్ఎఫ్ బృందాల సహాయంతో చెరువు వద్ద గాలింపు చేపట్టారు. శుక్రవారం రాజు మృతదేహం లభ్యం కాగా ప్రకాష్ కోసం గాలిస్తున్నారు.

స్వచ్ఛంద సంస్థ పేరుతో డబ్బులు వసూలు

నిందితుడి అరెస్ట్

గన్‌ఫౌండ్రీ: స్వచ్ఛంద సంస్థ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిని సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. బేగంబజార్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లాకు చెందిన బనావత్ రామకృష్ణ బోడుప్పల్ ప్రాంతంలోని వికలాంగుల కోసం పనిచేస్తున్న ఫౌండేషన్‌లో పనిచేసేవాడు. ఆ తర్వాత ఆ ఉద్యోగం మానేసిన అతను సులభంగా డబ్బులు సంపాదించేందుకు శ్రీకృష్ణ ఫౌండేషన్ పేరుతో సంస్థను ప్రారంభించాడు. కొందరు వికలాంగులను చేరదీసి ఫౌండేషన్ పేరుతో తన వ్యక్తిగత ఫోన్‌నెంబర్ లింక్‌చేసిన క్యూఆర్ కోడ్‌తో స్టిక్కర్లను ముద్రింపజేశాడు. అనంతరం ఆ బాక్సులను వికలాంగులకు అప్పగించి ప్రధాన సిగ్నళ్ల వద్ద డబ్బులు వసూలు చేయించే వాడు. వారు సేకరించిన నగదులో 20 శాతం వారికి ఇచ్చి 80 శాతం తాను తీసుకునేవాడు. దీనిపై సమాచారం అందడంతో ఎంజేమార్కెట్ చౌరస్తాలో పోలీసులు పలువురు వికలాంగులతో సహా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. వెయ్యి నగదు. సెల్‌ఫోన్, ద్విచక్రవాహనం, ఫౌండేషన్ పేరుతో ఉన్న రశీదులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో సెంట్రల్‌జోన్ పోలీసులు, బేగంబజార్ పోలీస్‌స్టేషన్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

జాతీయ అవార్డులు రావడం గర్వకారణం

బంజారాహిల్స్: తెలుగు చలన చిత్ర చరిత్రలో తొలిసారిగా హీరో అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు దక్కడం నటుడిగా ఎంతో గర్వపడుతున్నానని సినీ హీరో నందమూరి బాలకృష్ణ అన్నారు. బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో జరుగుతున్న కార్యక్రమానికి విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలుగు సినిమా సత్తా దేశ, విదేశాల్లో చాటారని విదేశీయులు కూడా తెలుగు సినిమా చూసే స్థాయికి మన చలనచిత్ర పరిశ్రమ చేరుకోవడం సంతోషించదగ్గ విషయం అన్నారు. పుష్పతో పాటు ఆర్ఆర్ఆర్. ఉప్పెన సినిమాలకు కూడా పలు అవార్డులు దక్కడం తెలుగువారికి గర్వకారణం అన్నారు. ఈ అవార్డుల స్ఫూర్తితో తెలుగు సినిమా పనిచేయాలని సూచించారు.

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగులు నింపండి

బంజారాహిల్స్: ఈ నెల 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నగరానికి చెందిన అమ్మ నేత్ర అవయవ శరీరదాన ప్రోత్సాహకుల సంఘం అధ్యక్షుడు గంజి ఈశ్వరలింగం తెలిపారు. ఒకరు చేసే నేత్రదానం, ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. నేత్ర, అవయవ, శరీరదానాలు మానవత్వానికి ప్రతీక అన్నారు. నేత్రదానం, దృష్టిదానం, అవయవదానం, ప్రాణదానం, శరీరదానంపై తమ సంస్థ ఆధ్వర్యంలో గత కొన్నేళ్ళుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నేత్రదానం చేసే వారు 9493814940 నెంబర్‌లో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

రెండో రోజూ కొనసాగిన కార్మికుల ఆందోళన



వెంగళరావునగర్: తమను పర్మినెంట్ చేయాలంటూ జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ కార్మికులు రెండోరోజు కూడా సర్కిల్–19 కార్యాలయం వద్ద ఆందోళనా కార్యక్రమాన్ని కొనసాగించారు. శుక్రవారం జరిగిన ఆందోళనలో సీఐటీయు జూబ్లీహిల్స్ నాయకులు రాపర్తి అశోక్ మద్దతు తెలిపారు. సీఐటీయు సర్కిల్–19 నాయకులు మచ్చ గిరి, రవిశంకర్, సంతోష్, దాసులతో పాటు వందలాదిమంది జిహెచ్ఎంసి కార్మికులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం కావాలి

శ్రీనగర్‌కాలనీ: విద్యావంతులు, ఉన్నత స్థానాల్లో ప్రజలతో మమేకమై ప్రజల్లో మార్పును తీసుకురావాలని కర్ణాటక ఎంఎల్‌సీ గోపీనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీనగర్ కాలనీ శాలివాహననగర్‌లో బీజేపీ మహిళా మోర్చా నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ పద్మ వీరపనేని ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉన్నత విద్యావంతుల సమావేశాన్ని నిర్వహించారు. పలు రంగాల్లో ఉన్న ఉద్యోగులు ఈ సమావేశానికి హాజరై సలహాలు, సూచనలు అందించారు.

ఉద్యోగికి బదిలీ ఒక మజలీలాంటిది



అబ్దుల్ ఖాధర్‌కు వీడ్కోలు పలుకుతున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్

రహమత్‌నగర్: ఉద్యోగ ప్రయాణంలో బదిలీ ఒక మజిలీ లాంటిందని బోరబండ ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ పేర్కొన్నారు. బోరబండ పీఎస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నషేక్ అబ్దుల్‌ఖాధర్ ఏఎస్ఐగా పదోన్నతి చెంది బదిలీపై వెళ్తున్న సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. రవికుమార్ మాట్లాడుతూ బదిలీపై వెళ్తున్న అబ్దుల్ ఖాధర్ బోరబండ పోలీస్ స్టేషన్‌లో సమర్థవంతంగా విధులు నిర్వహించారని గుర్తుచేశారు. డీఐ భూపాల్‌గౌడ్, ఎస్ఐలు తుల్జారాం, మనోజ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

పంజగుట్ట: చెన్నైలో ఆకస్మికంగా సినిమాలోకి తనను తీసుకువచ్చింది కిట్టు అయితే తెలుగు సినిమాకు తనను పరిచయం చేసింది నా సోదరుడు భానుచందర్ అని ప్రముఖ హీరో సుమన్ అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రజా మీడియా డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హీరోలు సుమన్, భానుచందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ .. తాను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానంటే అది నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులే అన్నారు. జీవితంలో ఒక మంచి మిత్రున్ని సంపాదించుకోవడం ఎంతో ముఖ్యమని, ఎన్నో వస్తాయి, పోతాయి కాని స్నేహితుడు చిరకాలం ఉంటాడన్నారు.





ఫిలింనగర్ రోడ్ నెం. 1లోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో



బంజారాహిల్స్ రోడ్ నెం. 14లో..

శ్రావణ వైభవం

అమ్మవారి ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి

- వరలక్ష్మీ వ్రతాలు, విశేష పూజలు

బంజారాహిల్స్: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శ్రావణ శుక్రవారంతో పాటు వరలక్ష్మీ వ్రతం కూడా కావడంతో పెద్ద ఎత్తున మహిళలు అమ్మవార్లను దర్శించుకునేందుకు తరలి వచ్చారు. దీంతో ఆలయాలు భక్తజన సందోహంతో కిటకిటలాడాయి. జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మతల్లి ఆలయానికి భక్తులు భారీగా విచ్చేయడంతో ఆవరణ ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఫిలింనగర్ దైవ సన్నిధానంలో కొలువుదీరిన శ్రీ ధనలక్ష్మి అమ్మవారికి, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి మహిళలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయానికి భక్తులు వందలాదిగా తరలి రావడంతో ప్రాంగణం కిటకిటలాడింది. ఫిలింనగర్ రోడ్ నెం. 1లోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి సన్నిధిలో శ్రావణ శోభ ఉట్టిపడింది. అమ్మవారి దివ్య అలంకారాన్ని తిలకించిన భక్తులు విశేష పూజలు నిర్వహించారు. వరలక్ష్మి వ్రతాలు కూడా అమ్మవారి సన్నిధిలో వైభవంగా నిర్వహించారు. శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఇక్కడ కొలువుదీరిన శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో మహిళలు విశేష పూజలు నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్‌నెం. 14లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆండాల్ అమ్మవారి దివ్య అలంకారాన్ని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. విజయారెడ్డి ఆచరించారు. అనంతరం ఆమె మహిళలకు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.




ఫిలింనగర్ దైవసన్నిధానంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు..



మహిళలకు వాయినాలు ఇస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. విజయారెడ్డి

ఆకట్టుకుంటున్న వస్త్రప్రదర్శన



శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో కృతి వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ పేరిట ఏర్పాటుచేసిన చేనేత వస్త్రప్రదర్శన మహిళలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శనలోని చీరలు నగర ఫ్యాషన్‌ప్రియులను ఆకట్టుకునేలా రంగురంగుల చీరలు ప్రదర్శనలో ఉంచారు. వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేతకళకారులు వారి ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ ఆభరణాలు, పలు ఫ్యాన్సీవస్తువులను సుమారు 70స్టాల్స్‌లో అందుబాటులో ఉంచారు. ఈనెల 27 వరకూ కొనసాగుతుందని నిర్వాహకులు యలమంచిలి శ్రీలత తెలిపారు.

అంధ క్రీడాకారులకు అండగా ఉంటాం



క్రీడాకారులతో ప్రణవగ్రూప్ ప్రతినిధి రాజ్‌కుమర్

పంజగుట్ట: అంతర్జాతీయ స్థాయిలో అంధులకు జరుగుతున్న పలు క్రీడల్లో అండగా ప్రణవగ్రూప్. బ్రిటన్‌లోని బర్మింగ్‌హామ్‌లో ప్రపంచ అంధ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరుగుతున్న పలు పోటీల్లో పాల్గొంటున్న భారత జట్టుకు ప్రణవాగ్రూప్ ఆర్థికసాయాన్ని అందచేసింది. భారత క్రీడాకారులు క్రికెట్, జూడో, అథ్లటిక్స్ విభాగాల్లో పాల్గొంటుండగా వీరికి అన్నిరకాలుగా సాయాన్ని అందచేస్తున్నామని ప్రణవగ్రూప్ ప్రతినిధి రాజ్‌కుమార్ తెలిపారు. విజయాలు సాధించి దేశానికి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు.

మామా అర్త్ ఔట్‌లెట్ ప్రారంభం



లక్డీకాపూల్: సురక్షితమైన సహజమైన టాక్సిన్ రహిత వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులను అందించడంలో మామాఅర్త్ ప్రత్యేకతను సంతరించుకుందని యాంకర్ లాస్య పేర్కొన్నారు. పంజాగుట్ట మెట్రో మాల్‌లో ఏర్పాటు చేసిన అవుట్‌లెట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా హోనాసా కన్స్యూమర్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్, కో ఫౌండర్ గజల్ అలఘ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ కేంద్రంగా పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని నెలకొల్పనున్నట్టు పేర్కొన్నారు.

పర్మనెంట్ చేయాలని జీహెచ్ఎంసీ కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న జీహెచ్ఎంసీ ఎస్ఎఫ్ఏలు

బంజారాహిల్స్: తమను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని జీహెచ్ఎంసీ స్వీపర్లు, శానిటేషన్ సిబ్బంది నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం జూబ్లీహిల్స్ సర్కిల్–18 శానిటేషన్ సూపర్‌వైజర్లు బంజారాహిల్స్ లోటస్‌పాండ్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. గతంలో సీఎం కేసీఆర్ తమను పర్మినెంట్ ఉద్యోగులుగా చేస్తానని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తమను పర్మినెంట్ చేసే వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏలు, కృష్ణ, శానప్ప, లవకుమార్, మహేందర్ పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన బీఆర్ఎస్ ప్రభుత్వం



లిబర్టీ: గిరిజనులకు ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్ తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదవర్గ సమావేశం హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షులు అజ్మీరా రాంమూర్తి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి నుంచి గిరిజనులను మోసం చేస్తున్న కేసిఆర్‌కు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. గిరిజనులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని మాట మార్చారన్నారు. రాష్ట్రంలోని పోడు భూముల సమస్యలను శాశ్వత పరిష్కారం అని చెప్పి కొద్ది మందికి హక్కు పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. సమస్యలు పరిష్కరించాలని సెప్టెంబర్ 2వ తేదీన అంబేద్కర్ విగ్రహం ముందు ఆందోళన నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నరు. సమావేశంలో రమేష్, కుటుంబరావు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

బంజారాహిల్స్: అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఖైరతాబాద్ నియోజక వర్గం ఎన్నికల అదికారిణి ప్రశాంతి తెలిపారు. రెండో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల కమిషనర్ చేపట్టిందన్నారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 21న జారీచేసిన ముసాయిదా ఓటరు జాబితాపై ఆక్షేపణలు, అభ్యంతరాలు తీసుకోవడం, ఆగస్టు 26, 27, సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటరు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. నియోజక వర్గం పరిధిలో ముసాయిదా ఓటరు జాబితాను జారీచేశామన్నారు. జాబితాలో తప్పొప్పుల సవరణ, పేర్లపై అభ్యంతరాలు తెలపడానికి ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 19 వరకు గడువు ఇచ్చామని ఈ నెల 26, 27, వచ్చే నెల 2, 3 తేదీల్లో నియోజక వర్గంలోని 245 పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ క్యాంపెయిన్ డేలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సంబంధిత బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల్లో 10 గంటల్లోగా హాజరుకావాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు.



డీఎంసి ప్రశాంతి

గంగమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

రహమత్‌నగర్: గంగమ్మతల్లి దయవల్ల తెలంగాణ రాష్ట్ర సుభిక్షంగా ఉండాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ఆకాంక్షించారు. రహమత్‌నగర్ డివిజన్ సంతోషగిరిలో గంగమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వ హించారు. కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇన్వెస్టిగేషన్ కౌన్సిల్ రెండింటిలోనూ తాత్కాలిక సభ్యత్వం



బంజారాహిల్స్: భారతదేశంలోని ప్రముఖ విశ్వ విద్యాలయం అయిన కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఎంబీఏ ఫిన్‌టెక్ ప్రోగ్రామ్‌కు ఫిన్‌టెక్ కౌన్సిల్, సైబర్ క్రైం ఇంటర్‌నేషనల్, ఇన్వెస్టిగేషన్ కౌన్సిల్ రెండింటిలోనూ తాత్కాలిక సభ్యత్వం పొందినట్లు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి, సెంటర్ హెడ్ డాక్టర్ రవీందర్ వాడపల్లి వెల్లడించారు. ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు ఆర్థిక సాంకేతికత, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ఆవిష్కరణ, సహకారం, శ్రేష్ఠతను పెంపొందించడంలో విశ్వ విద్యాలయం యొక్క నిబద్ధతను నొక్కి చెబుతుందన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పంజగుట్ట: మార్నింగ్ వాక్‌కు వెళుతూ కిందపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. బీఎస్ మక్తాలో నివాసం ఉండే భానుచందర్ (32) ఈ నెల 14వ తేదీన ఉదయం వాకింగ్‌కు వెళ్లేందుకు ఇంటినుండి బయలుదేరాడు. మెట్లపైకి రాగానే ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో మెట్లపైనే కిందపడిపోయిన భానుచందర్ తలకు తీవ్ర గాయమైంది. దీంతో భార్య అరుణశ్రీ నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న భానుచందర్ ఆరోగ్యం విషమించి గురువారం రాత్రి మృతి చెందాడు. భార్య అరుణశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం

వెంగళరావునగర్: మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. అన్నపురెడ్డి అశోక్‌రెడ్డి వెంగళరావునగర్‌లోని చర్చి గల్లీలో నివాసముంటూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో పనిచేస్తున్నాడు. ఈనెల 22న ఉదయం రూములో బర్త్‌డే సందర్భంగా కేక్‌ను కట్ చేశాడు. సాయంత్రం 4 గంటల సమయంలో బయటకు వెళ్ళి వస్తానని చెప్పి రూమునుంచి వెళ్ళాడు. నాలుగురోజులైనా రాలేదు. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువతి ఆత్మహత్య

ఖైరతాబాద్: ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాల్ గోపాల్ తెలిపిన మేరకు.. ఒరిస్సాకు చెందిన జస్మిత నహక్ (23) ఖైరతాబాద్ ప్రేమ్‌నగర్‌లో నివాసముంటూ సోమాజిగూడలోని ఏషియన్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తుంది. శుక్రవారం ఉదయం తలుపులు తెరవకపోవడంతో ఇంటియజమాని అనుమానం వచ్చి మధ్యాహ్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి చూడగా ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకున్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న సంస్థపై చర్యలు తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్

పంజగుట్ట: గత 18 సంవత్సరాలుగా కార్మిక చట్టాలను, మానవహక్కులను కాలరాస్తూ ఉద్యోగులను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని సంస్థ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టర్బోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మోహన్, ప్రతినిధులు కృష్ణారావు, శ్రీనివాసరావులు మాట్లాడుతూ .. కంపెనీలో ఉద్యోగం చేస్తూ ఏడుగురు మృత్యువాత పడ్డారని, ఎంతో మంది అంగవైకల్యం అయ్యారని ఎవ్వరికీ యాక్సిడెంట్ పాలసీ కూడా ఇవ్వలేదని ఆగ్రహంవ్యక్తం చేశారు. కంపెనీలో సరైన సేఫ్టీ ప్రికాషన్స్ లేకపోవడం, కంపనీలో ఎక్కువగా సెకండ్‌హ్యాండ్ యంత్రాలు ఉండడంవల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ విషయమై సంగారెడ్డి లేబర్ కోర్టులో, డిప్యూటీ లేబర్ కమీషనర్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని అయినా స్పందన లేదని ఆగ్రహంవ్యక్తం చేశారు.

లిటిల్ స్టార్ ఆస్పత్రిలో నేత్ర వైద్య శిబిరం



నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న అస్మతున్నీసా

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10లోని గాయత్రిహిల్స్ లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ క్యాపిటల్ నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అస్మతున్నీసా ప్రారంభించారు. మ్యాక్స్‌విజన్, ఐకేర్ ఆస్పత్రి ఈ స్క్రీనింగ్ క్యాంపును నిర్వహించింది. విద్యార్థులతో పాటు స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు నిర్వహించుకోవడం ద్వారా కంటి చూపును మెరుగుపర్చుకోవచ్చునని ఇతరత్రా సమస్యల నుంచి బయటపడవచ్చునని ఈ సందర్భంగా అస్మతున్నీసా తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు రమాదేవి, లావణ్య, రజిని తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలను ఉధృతం చేస్తేనే సమస్యల పరిష్కారం

హిమాయత్‌నగర్: మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిర్వహించే ఉద్యమాలను ఉధృతం చేస్తేనే ఆ సమస్యలు పరిష్కారమవుతాయని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్–అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర సమితి సమావేశం యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షులు పి. వెంకటయ్య అధ్యక్షతన జరిగింది. ఎస్. బాలరాజ్ హాజరై మాట్లాడుతూ..కనీస వేతనాల పెంపు, స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కార్మికుల వేతనాల పెంపు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల క్రమబద్ధీకరణ, జనరల్ ప్రావిడెన్షియల్ ఫండ్, హెల్త్ కార్డులు, భీమా, భద్రతా చర్యలు కిట్లు వంటి మున్సిపల్ కార్మికుల ప్రధానమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నందూరి కరుణ కుమారి, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద వెంకటేశ్వర్లు, కార్యదర్శులు జైపాల్ రెడ్డి, బొడ్డుపల్లి కిషన్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



ఆత్మగౌరవ సదస్సు పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఫోరం

హిమాయత్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేసి రూ.10వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం(టీయూఎఫ్) చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రం ఏర్పడక మునుపు కేసీఆర్ ఉద్యమకారుల విషయంలో చూపిన ఆప్యాయత రాష్ట్రం ఏర్పాడ్డాక లేదని విమర్శించారు. ఈ డిమాండ్‌పై ఈనెల 27(ఆదివారం)న ఇందిరాపార్క్ వేదికగా 'తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు'ను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈమేరకు శుక్రవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. అనంతరం చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ..రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు తెలంగాణ ఉద్యమకారులకే టిక్కెట్లు కేటాయించాలన్నారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేస్తామని అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చాలన్నారు. ఉద్యమకారులని స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వీరస్వామి, కోశాధికారి జంగ సుదర్శన్, రవీంద్ర చారి, శ్రీనివాస్ గౌడ్, మత్తయ్య, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

దానం గెలుపునకు కృషిచేస్తాం



ఎమ్మెల్యే దానంతో కాజా సూర్యనారాయణ

ఫిలింనగర్: ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా మరోసారి దానం నాగేందర్ ను నియమించినందుకు సీఎం కేసీఆర్ కు జూబ్లీహిల్స్ మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. ఖైరతాబాద్‌లో దానం విజయం నల్లేరు మీద నడకే అన్నారు.ఆయన మాస్, క్లాస్ లీడర్ అని సంక్షేమ పథకాలు ఆయనకు అండగా వుంటాయని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఆయనకు ప్రచారం చేస్తామని గెలుపుకు కృషి చేస్తామని తెలిపారు.

ఫిర్యాదులపై స్పందించండి



వీధి దీపాల పై సమీక్ష నిర్వహించిన జోనల్ కమిషనర్ వెంకటేష్ దొత్రే

ఫిలింనగర్: వీధి దీపాలు వెలగడం లేదని వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దొత్రే ఆదేశించారు. శుక్రవారం జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెలుగు కు నోచుకొని దీపాలకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ప్రతి లైటు వెలిగే విధంగా చూడాలన్నారు.

ఆంకాలజీ నర్సింగ్‌పై జాతీయ స్థాయి సింపోజియం



సదస్సును ప్రారంభిస్తున్న ఆస్పత్రి ప్రతినిధులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, ఆంకాలజీ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా రెండు రోజుల పాటు జరగనున్న అడ్వాన్స్‌డ్ ఆంకాలజీ నర్సింగ్ సింపోజియం శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని కొమురం భీం ఆదివాసీ భవన్‌లో ప్రారంభమైంది. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సులో ఆంకాలజీ నర్సింగ్‌కు సంబంధించిన పలు అంశాలపై చర్చించడమే కాకుండా అందుబాటులోకి వస్తున్న ఆధునిక పద్ధతులపై శిక్షణ ఇవ్వనున్నారు. తెలంగాణలోని పలు వైద్యశాలలు, వైద్య కళాశాలలు, నర్సింగ్ కాలేజీలు, నర్సింగ్ స్కూల్స్ నుంచి వచ్చిన వందలాది మంది నర్సింగ్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సదస్సును బాలకృష్ణ ప్రారంభించగా కార్యక్రమంలో ఆస్పత్రి సీఈవో డాక్టర్ ఆర్వి. ప్రభాకర్‌రావు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టిఎస్.రావు, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ కల్పనా రఘునాథ్, సిహెచ్. నాగమణి, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఐవీ డయాజ్, బి. విద్యుల్లతా తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి

హిమాయత్‌నగర్: డిక్కీ సంస్థ పేరుతో దళితులను లక్ష్యంగా చేసుకుని ఉపాధి కల్పిస్తానని ఎస్.బి.ఐ బ్యాంకు రుణాలు ఇప్పిస్తానని సుమారు 60 మంది బాధితులను మోసం చేసిన పుట్టాపాగ శ్రీనివాస్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలంటూ వివిధ జిల్లాలకు చెందిన బాధితులు అభ్యర్థించారు. ఒక్కొక్కరి నుంచి రూ.2లక్షలు తీసుకుని వీటితో పాటు బ్యాంకు నుంచి తమ పేర్లపై రూ.10లక్షల మేర రుణాలు పొంది వాటిని తమపై వేశారంటూ ఆరోపించారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వివిధ జిల్లాలకు చెందిన బాధితులు శ్రీరాం సత్యనారాయణ, కందుల రాములు, చంద్రశేఖర్, నవీన్, చేతన్, ఎర్ర వెంకటేష్, లత, రమాదేవి, వెన్నెల తదితరులు మాడారు. .2019లో ఎస్‌బీఐ బ్యాంక్, ఎస్సీ కార్పొరేషన్ అధికారులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకునేందుకు బ్యాంకుల నుంచి సబ్సిడీపై రుణాలు ఇప్పిస్తానని సమాజంలో గౌరవంగా బ్రతికేలా చేస్తానని తమకు మోసపూరితమైన మాటలు చెప్పిన పుట్టపాగ శ్రీనివాస్ తమని నిండా ముంచారన్నారు.

గిరిజనుల్లో విద్యాకాంతులు

సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీకి శంకుస్థాపనలో ఏపీ సీఎం జగన్

- ఈ విశ్వవిద్యాలయం వీరి జీవితాల్లో గొప్ప మార్పునకు నాంది
- రూ.830 కోట్ల ప్రాజెక్టును మూడేళ్లలో జాతికి అంకితం చేస్తాం



వర్సిటీ భవనాల శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, సీఎం జగన్ తదితరులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం స్థాపన ద్వారా గిరిజనుల జీవితాల్లో గొప్ప మార్పునకు నాంది పలికామని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. గిరిజనుల్లో విద్యాకాంతులు నింపే ఈ ప్రాజెక్టును రూ.830 కోట్ల ఖర్చుతో మూడేళ్లలో పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు నియోజకవర్గం మెంటాడ మండలం చిన మేడపల్లిలో ప్రతిష్టాత్మక కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం శాశ్వత భవనాల నిర్మాణానికి, ఇతర మౌలిక వసతుల కల్పనకు శుక్రవారం ఆయన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అందుకు సంబంధించిన శిలా ఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలంలోని మరడాం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఈ విశ్వవిద్యాలయం వచ్చిందని, రాష్ట్రంలో రెండవ సెంట్రల్ వర్సిటీ అని చెప్పారు. గిరిపుత్రుల జీవితాల్లో ఉన్నత విద్యాకాంతులు నింపడానికి రాబోయే రోజుల్లో ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

నాలుగేళ్లుగా గుండెల్లో పెట్టుకున్నాం

- ఈ నాలుగేళ్లలో గిరిజనుల అభివృద్ధి కోసం అన్ని విధాలా కృషి చేశాం. వారిని గుండెల్లో పెట్టుకున్నాం. మారుతున్న ప్రపంచంలో వారి జీవన ప్రమాణాలు పెంచడానికి, దోపిడీ నుంచి రక్షించే విషయంలో అండగా నిలబడ్డాం. వారిని తోటి ప్రపంచంలో నిలబెట్టేలా ఉన్నత విద్యను అందించాలనే సంకల్పంతో అడుగులు ముందుకు వేశాం.
- నా ఎస్టీలు.. అనే పదానికి అర్థం చెబుతూ గతంలో ఏ ప్రభుత్వమూ ఇవ్వనంతగా గిరిజనులకు రాజకీయ పదవులిచ్చి నా పక్కనే పెట్టుకున్నాను. ఏ నామినేటెడ్ పదవి, ఏ నామినేటెడ్ కాంట్రాక్టు తీసుకున్నా నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కచ్చితంగా 50 శాతం కేటాయించేలా చట్టం చేసి మరీ మన ప్రభుత్వం కార్యరూపం తీసుకొచ్చింది. నా ఎస్టీల కష్టాలు, కన్నీళ్లు తెలిసిన మనిషిగా వారికి మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి హామీని మనసా వాచా కర్మణా త్రికరణశుద్ధితో అమలు చేస్తున్నాం.
- గిరిజనుల కోసం ఇంతగా తపించిన ప్రభుత్వం ఏదీ లేదు. 1,53,820 కుటుంబాలకు మేలు చేస్తూ 3,22,538 ఎకరాలను ఆర్వోఎఫ్‌ఆర్ డీకేటీ పట్టాలు వారి చేతికి అందించింది కూడా మీ బిడ్డ ప్రభుత్వమే.
- నాలుగేళ్ల పాలనలో 36.12 లక్షల గిరిజన కుటుంబాలకు ప్రయోజనం కలిగిస్తూ రూ.11,548 కోట్లు డీబీటీ ద్వారా ఇచ్చాం. నాన్ డీబీటీ అంటే ట్యాబ్‌లు, ఇళ్ల పట్టాలు, విద్యా కానుక, సంపూర్ణ పోషణ, గోరుముద్ద వంటివి కలుపుకుంటే 22.26 లక్షల కుటుంబాలకు మరో రూ.5,257 కోట్ల మేలు కలిగింది. మొత్తంగా డీబీటీ, నాన్ డీబీటీ కలుపుకుంటే 58.39 లక్షల గిరిజన కుటుంబాలకు రూ.16,805 కోట్ల లబ్ధి చేకూరింది.

ఈ ఘనత మోదీ, జగన్‌దే

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు ఘనత ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలకే దక్కుతుందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రశంసించారు. శుక్రవారం వర్సిటీ ఏర్పాటుకు సీఎం జగన్‌తో కలిసి శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు నడయాడిన ఈ ప్రాంతానికి రావడం పట్ల గర్వంగా భావిస్తున్నానని తెలిపారు. విజయవంతమైన చంద్రయాన్–3 ప్రయోగానికి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట వేదిక కావడం సంతోషకరం అన్నారు. ఇలాంటి రాష్ట్రంలో గిరిజనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు అభినందనీయం అని చెప్పారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమష్టి కృషితో రూ.800 కోట్లతో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం సాకారమవుతోందన్నారు. 581 ఎకరాల భూమి, విద్యుత్తు, రోడ్డు, నీరు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సీఎం జగన్ చొరవ తీసుకొని ముందుకు వచ్చారని తెలిపారు. 21వ శతాబ్దానికి ఆధునిక దేవాలయమైన ఈ విశ్వ విద్యాలయం సాలూరు గిరిజన ప్రాంతంలో ఏర్పాటవ్వడం వల్ల పొరుగునున్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని గిరిజనులతో సామాజిక అనుబంధం ఏర్పడుతుందన్నారు.

24 మంది సభ్యులతో టీటీడీ నూతన పాలక మండలి



మేకా శేషుబాబు



సామినేని ఉదయభాను



ఎం. తిప్పేస్వామి



గడ్డం సీతారెడ్డి

సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలక మండలి నూతన సభ్యులను ప్రభుత్వం ఖరారు చేసింది. ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం పాలక మండలిలో చోటు కోసం పలు రాష్ట్రాలు, పలు రంగాల నుంచి అనేక వినతులు వచ్చాయి. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటూనే మన రాష్ట్రానికి చెందిన నలుగురు బీసీలు, ఒక ఎస్సీ, ఒక ఎస్టీకి కూడా ప్రభుత్వం పాలక మండలిలో స్థానం కల్పించింది. టీటీడీ పాలక మండలి చైర్మన్‌గా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని ప్రభుత్వం ఈ నెల 5వ తేదీనే నియమించింది. ఆయన 10న బాధ్యతలు స్వీకరించారు. కాగా, శుక్రవారం పాలక మండలి సభ్యులుగా 24 మంది పేర్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఖరారు చేశారు.

ఎమ్మెల్యేలు పొన్నాడ వెంకట సతీష్ కుమార్, సామినేని ఉదయభాను, ఎం.తిప్పేస్వామిలకు కమిటీలో చోటు దక్కింది. సిద్ధవటం యానాదయ్య, చందే అశ్వర్థ నాయక్, మేకా శేషుబాబు, ఆర్.వెంకట సుబ్బారెడ్డి, ఎల్లారెడ్డిగారి సీతారామరెడ్డి, గాదిరాజు వెంకట సుబ్బరాజు, పెనక శరశ్చంద్రారెడ్డి, రామిరెడ్డి సాముల, బాల సుబ్రమణియన్ పళనిసామి, ఎస్.ఆర్.విశ్వనాథ్ రెడ్డి, గడ్డం సీతారెడ్డి (ఎంపీ రంజిత్‌రెడ్డి భార్య), కృష్ణమూర్తి వైద్యనాథన్, సిద్ధా వీర వెంకట సుధీర్‌కుమార్, సుదర్శన్ వేణు, నెరుసు నాగసత్యం, ఆర్.వి.దేశ్‌పాండే, అమోల్ కాలే, డా.ఎస్.శంకర్, మిలింద్ కేశవ్ నార్వేకర్, డాక్టర్ కేతన్ దేశాయ్, బోరా సౌరభ్ పాలక మండలి సభ్యుల జాబితాలో ఉన్నారు.

జనశక్తి నేతలు రాజన్న, అమర్ విడుదల



విలేకరులతో మాట్లాడుతున్న జనశక్తి నేతలు కూర రాజన్న, అమర్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జనశక్తి నేతలు కూర రాజన్న, అమర్‌తోపాటు మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. రెండు రోజుల విచారణ అనంతరం విడుదల చేశారు. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం గాజువాక సమీపంలోని ఓ బత్తాయి తోటలో ఆల్ ఇండియా కిసాన్ సంయుక్త మోర్చా రెండు రోజుల సమావేశం నిర్వహిస్తుండగా గురువారం మధ్యాహ్నం అందించిన సమాచారం మేరకు పోలీసులు రెక్కీ నిర్వహించి అరెస్ట్ చేశారు. సుమారు 3గంటల పాటు ఆ తోటలోనే విచారించారు. అనంతరం జిల్లా పోలీసు అధికారుల సూచన మేరకు జిల్లా కేంద్రంలోని డీటీఎస్‌కు తరలించారు. శుక్రవారం జిల్లా పోలీసు అధికారుల ముందు ప్రవేశపెట్టారు. అరెస్ట్ అయిన వారిలో కూర రాజన్న, అమర్‌తో పాటు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన మరో ముగ్గురు రైతు నాయకులు ఉన్నట్లు సమాచారం. దేశవ్యాప్తంగా జరగబోయే రైతు ఉద్యమాల గురించి చర్చించేందుకు రెండు రోజులపాటు ఇక్కడ సమావేశాలు పెట్టుకున్నట్లు చెబుతున్నారు. అదుపులోకి తీసుకున్న తరువాత వీరి వద్ద ఉన్న బ్యాగులను క్షుణ్ణంగా పోలీసులు పరిశీలించగా ఎలాంటి ఆయుధాలు లభించలేదని తెలిసింది. అమర్‌కు సంబంధించిన బ్యాగులో ఒక లేఖ లభ్యమైనట్లు సమాచారం. సమావేశాలు ఎందుకు పెట్టుకున్నారు.. భవిష్యత్తులో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్యక్రమాలు చేయబోతున్నారా.. రాబోయే ఎన్నికల సందర్భంగా ఏదైనా కుట్ర పన్నారా అనే అంశాలపై విచారించినట్లు తెలిసింది. శుక్రవారం సాయంత్రం వారిని పోలీసులు వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

అన్యాయంగా అరెస్టు చేశారు: రాజన్న, అమర్

దేశ వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు సమావేశం పెట్టుకుంటే పోలీసులు తమను అన్యాయంగా అరెస్ట్ చేశారని జనశక్తి నేతలు కూర రాజన్న, అమర్ ఆరోపించారు. పోలీసుల వేధింపులు ఇటీవల ఎక్కువయ్యాయని విమర్శించారు. శుక్రవారం వారు తమను కలిసిన విలేకరులతో మాట్లాడారు. వరంగల్ జిల్లాలో ముంపు బాధితులను పరామర్శించేందుకు వెళ్తే అక్కడ పోలీసులు ఇబ్బందులు పెట్టారని, ఖమ్మంలో జిల్లాలో కూడా పోలీసులు అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేశారని చెప్పారు. తమ సంఘం నిషేధితం కాదని, అలాంటప్పుడు తమను ఎందుకు ఇబ్బందులు గురిచేస్తున్నారో పోలీసులకే తెలియాలన్నారు.

ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ పరీక్షలో 87 శాతం మంది ఫెయిల్

- ఎఫ్‌ఎంజీఈ పరీక్షలో 13 శాతమే పాస్
- విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసినవారికి ఇండియాలో నిర్వహించే పరీక్ష ఇది
- దేశవ్యాప్తంగా 24,269 మంది పరీక్ష రాయగా కేవలం 3,089 మందే పాస్

సాక్షి, హైదరాబాద్: ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ పరీక్ష (ఎఫ్‌ఎంజీఈ) పాసవడం కష్టతరంగా మారింది. ఇటీవల జరిగిన ఎఫ్‌ఎంజీఈ పరీక్షలో 13 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులైనట్లు జాతీయ పరీక్షల బోర్డు (ఎన్‌బీఈ) ప్రకటించింది. దీంతో విదేశాల్లో ఎంబీబీఎస్ చదువుపై విమర్శలు వస్తున్నాయి. నాణ్యమైన వైద్య విద్య ఆయా దేశాల్లో ఉండటం లేదన్న ఆరోపణలకు ఈ ఫలితాలు నిదర్శనంగా చెబుతున్నారు.

- విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేశాక మన దేశంలో ప్రాక్టీస్ చేసేందుకు, లైసెన్స్ పొందడానికి, మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్‌కు, పీజీ మెడికల్ చదవడానికి ఎఫ్‌ఎంజీఈ పాస్ కావాలి. 2015–18 మధ్య జరిగిన ఎఫ్‌ఎంజీఈ పరీక్షకు ఆ నాలుగేళ్లలో 61,418 మంది విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసినవారు హాజరుకాగా, 8,731 మంది మాత్రమే పాసయ్యారని కేంద్రం వెల్లడించింది. అంటే ఆ నాలుగేళ్లలో కేవలం 14.22 శాతమే పాస్ అయ్యారు. ఈ ఏడాది అది మరింత తక్కువగా ఉండటం విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ ఏడాది జూలైలో 24,269 మంది ఎఫ్‌ఎంజీఈ పరీక్ష రాయగా, కేవలం 3,089 మందే పాసయ్యారు. మిగిలిన 21,180 మంది ఫెయిల్ అయ్యారు. అంటే ఏకంగా 87 శాతం మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. చైనా, రష్యాలకు ఎక్కువగా వెళుతుండగా, ఆయా దేశాల్లో చదివినవారిలో తక్కువ శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రతీ విద్యార్థి ఈ ఎఫ్‌ఎంజీఈ పరీక్ష రాయడానికి మూడుసార్లు మాత్రమే అవకాశముంటుంది. కొన్ని దేశాలు, కొన్ని కాలేజీల్లో నాసిరకమైన వైద్య విద్య ఉండటం, మన దేశంలోని వైద్య విద్యకు సమాన స్థాయిలో ప్రమాణాలు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంటుందని చెబుతున్నారు. పైగా చైనా, రష్యాల్లో ఆయా దేశ భాషలోనే వైద్య విద్య నేర్చుకుంటారు. ఇక్కడకు వచ్చాక ఎఫ్‌ఎంజీఈ పరీక్ష ఇంగ్లిష్‌లో ఉంటుంది. దీనివల్ల చాలామంది ఫెయిల్ అవుతున్నారు. పైగా ఎఫ్‌ఎంజీఈ పూర్తిగా థియరీగా ఉండటం వల్ల కూడా ఫెయిల్ అవుతున్నట్లు చెబుతున్నారు. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, కెనడా, అమెరికా, యూకేల్లో ఎంబీబీఎస్ లేదా తత్సమాన వైద్య విద్య పూర్తి చేసినవారికి మన దేశంలో ఎఫ్‌ఎంజీఈ పరీక్ష రాయాల్సిన అవసరంలేదు. .

ఎక్కువ ఫీజుతో విదేశాలకు

దేశంలో ఎంబీబీఎస్ సీట్లు ఎన్ని పెరుగుతున్నా, డిమాండ్‌కు తగినంతగా సీట్లు లేకపోవడంతో అనేకమంది విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 20.38 లక్షల మందికి విద్యార్థులు నీట్ పరీక్ష రాయగా, అందులో 11.45 లక్షల మంది అర్హత సాధించారు. కానీ మన దేశంలో కేవలం 1.08 లక్షల ఎంబీబీఎస్ సీట్లే ఉన్నాయి. దీంతో మన దేశంలో సీటు రానివారు, విదేశాల్లో ఎంబీబీఎస్ కోసం వెళ్తుంటారు. మరికొందరు మన దేశంలోనే ఎండీఎస్ లేదా ఆయుష్ కోర్సులు చేస్తుంటారు. ఇక మన రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో మొత్తం 8,490 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. కాగా, తెలంగాణ నుంచి ఈ ఏడాది 72,842 మంది నీట్ పరీక్షకు హాజరయ్యారు. అందులో 42,654 మంది ఉత్తీర్ణత సాధించారు. అంటే ఇంకా చాలామంది సీటు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో సీటు పొందాలంటే డొనేషన్లు ఎక్కువగా ఉంటాయి. కోర్సు పూర్తి చేయాలంటే బీ కేటగిరీ ఫీజు ఏడాదికి రూ. 11.55 లక్షలు, ఎన్ఆర్ఐ సీటు ఫీజు రూ. 23.10 లక్షల వరకు ఉంటుంది.

ఆయా దేశాల్లో ఫీజు తక్కువే కానీ..

అదే విదేశాల్లో చదివితే దేశాన్ని బట్టి ఎంబీబీఎస్ కోర్సు మొత్తం పూర్తి చేసేందుకు రూ. 30 లక్షల నుంచి రూ. 40 లక్షల ఫీజు మాత్రమే ఉంటుంది. దీంతో చాలామంది విద్యార్థులు చైనా, రష్యా, ఉక్రెయిన్, నేపాల్, కజకిస్తాన్, జార్జియా, పిలిప్పైన్స్, కిర్గిస్తాన్, బంగ్లాదేశ్, అర్మేనియా తదితర దేశాల్లో ఎంబీబీఎస్ చదువుతున్నారు.

నగర వార్తలు

పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ముట్టడి

ఖైరతాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పిన లెక్కల ప్రకారం 13500 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం డీఎడ్, బీఎడ్ అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ముట్టడించారు. గత సంవత్సరం అసెంబ్లీలో సీఎం కేసీఆర్ 13500 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేస్తామని ప్రకటించి ఇప్పుడు కేవలం 5 వేల పోస్టులకు డీఎస్సీ షెడ్యూల్ ఇస్తామని విద్యాశాఖ మంత్రి వెల్లడించడం పట్ల డీఎడ్, బీఎడ్ అభ్యర్థులు పెద్ద ఎత్తున ముట్టడించారు. తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం ఆధ్వర్యంలో 1500 మంది విద్యార్థులు ముట్టడిలో పాల్గొన్నారు. ముట్టడిలో పాల్గొన్న వారిని పోలీసులు ఎక్కడికక్కడ అరెస్ట్‌చేసి గోషామహల్ స్టేడియానికి తరలించారు.

దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర మరువలేం

- 2030 నాటికి విద్యుత్‌కు ప్రత్యామ్నాయంపై చర్యలు చేపట్టాలనే నిర్ణయం హర్షణీయం
- ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ గుర్తింపు
- తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ వెల్లడి
- గచ్చిబౌలిలోని 'ఎస్కీ'లో ఈ–20 అంతర్జాతీయ సదస్సు



మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్


హాఫీజ్‌పేట్: దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర మరువలేమని, ఇంజినిరింగ్ ఫీల్డ్ ఎంతో విలువైనదని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ) ప్రాంగణంలో ది ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా, ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఈ–20 సమ్మిట్, అంతర్జాతీయ సదస్సును ఆమె జ్యోతి వెలిగించి ఆమె ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఇంజినీర్లు భారతదేశంతోనే కాకుండా ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కూడా సమగ్ర అభివృద్ధికి కావాల్సిన అవసరాన్ని కూడా గుర్తించి వారికి అందరికీ అందేలా చేయాల్సిన అవసరాన్ని కూడా గుర్తించాలన్నారు. ఇంజినీరింగ్ రంగంలో ఉండే వాళ్లు మొదట వారి అమ్మను సంతోషపరిచేలా చేస్తే దేశాన్ని కూడా సంతోషపరిచేలా చేస్తారన్నారు. 2030 నాటికి విద్యుత్‌కు ప్రత్యామ్నాంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిర్ణయించడం మంచి నిర్ణయమన్నారు. ప్రతియేటా దశాబ్దాలుగా విద్యుత్ రంగంలో 50 మిలియన్ కొత్త కనెక్షన్లు అందిస్తున్నామని, ఇవి మరింత పెరిగేలా చూడాలన్నారు. విద్యుత్‌కు ప్రత్యామ్నాయం ఆలోచిస్తే పర్యావరణ పరిరక్షణకు కూడా ఎంతో తోడ్పడుతుందన్నారు. 2070 ఎనర్జీ డిమాండ్ గణనీయంగా పెరగడంపై అందరూ దృష్టి పెట్టాలన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై పెద్ద ఎత్తున దృష్టి పెట్టడం సంతోషించదగ్గవిషయమని, 70 నుంచి 80 శాతం విద్యుత్‌ను సోలార్ ద్వారా వినియోగించేలా చూడాలన్న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంటుందన్నారు. భారత దేశం ఆర్థిక రంగం ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మరింత పటిష్టంగా మారుతోందన్నారు. చంద్రుడిపై అడుగిడడం కూడా శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల పాత్ర మరువలేనిదని, అందరినీ అభినందించాల్సిన అవసరం ఉందన్నా రు. అనంతరం సదస్సు బ్రోచర్‌ను గవర్నర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా అధ్యక్షుడు శివానంద్ రాయ్, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ పి సూర్యప్రకాశ్, 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర జి రామేశ్వరరావు ప్రసంగించారు. తర్వాత జరిగిన చర్చా కార్యక్రమంలో ప్లానింగ్ కమిషన్ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ కీరిట్‌పారిఖ్, ఐఈఐ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ ఐ సత్యనారాయణరాజు, సెంటర్ ఫర్ సోషల్ ఎకనామిక్ ప్రొగ్రెస్ సీనియర్ ఫెల్లో రాహుల్‌టాంగియా,రీ సస్టేనబిలిటీ లిమిటెడ్, రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర పీజీ శాస్త్రి, హడ్కో సీఎండీ వి సురేష్, ప్రణాళికాసంఘం మాజీ కమిషనర్ అశోక్‌కుమార్ జైన్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ పోటీలు ప్రారంభం



వెంగళరావునగర్: స్లాన్ ఇంటర్నేషనల్ ఓపెన్ ఫిడే రేటెడ్ చెస్ పోటీలు శుక్రవారం నుంచి యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో మూడు దేశాలు, 15 రాష్ట్రాలకు చెందిన దాదాపు 570 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్లాన్ సంస్థ వ్యవస్థాపకులు సుబ్రహ్మణ్యం, సీఈఓ నవీన్‌నాయక్ మాట్లాడుతూ.. బిలో 1600 ఫీడే రేటెడ్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. నాలుగేళ్ల బాలుడి దగ్గర నుంచి 90 ఏళ్ల వృద్ధుల వరకు ఎంతో ఉత్సాహంగా చెస్ టోర్నీలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ పోటీలు మూడురోజుల పాటు కొనసాగుతాయని చివరి రోజు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు.

ప్రపంచ నెంబర్ వన్ చెస్ ప్లేయర్‌లు కావడమే లక్ష్యం



తల్లిదండ్రులతో అమయ, అనయ్ అగర్వాల్

పంజగుట్ట: 8 ఏళ్ల వయస్సులో చెస్‌లో నెంబర్‌వన్ స్థాయికి ఎదిగారు సూపర్ ట్విన్స్ కిడ్స్. స్పెయిన్‌లో గతవారం జరిగిన ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్‌లో మంచి రేటింగ్‌తో అండర్–8 బాయ్స్, గర్ల్స్ కేటగిరిల్లో చాంపియన్స్‌గా నిలిచారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో చాంపియన్‌షిప్‌కు సంబంధించిన వివరాలను కోచ్‌లు చైతన్య సురేష్, స్రవంతి, సందీప్‌నాయుడు, గరినాథ్ వెల్లడించారు. కోచ్‌లు చైతన్య, స్రవంతి మాట్లాడుతూ.. అమయ అగర్వాల్ 278 పాయింట్లు, అనయ్ అగర్వాల్ 225 పాయింట్లతో అండర్–8 కేటగిరిలో గతవారం స్పెయిన్ టోర్నమెంట్‌లో ఆడి చాంపియన్స్‌గా నిలిచారన్నారు. అక్టోబర్‌లో 15 నుంచి ఈజిప్ట్‌లో జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్‌కి అర్హత సాధించడం గర్వంగా ఉందని తెలిపారు. అమయ, అనయ్ మాట్లాడుతూ.. వరల్డ్ చాంపియన్‌షిప్‌కి వెళ్లడం చాలా సంతోషంగా ఉందని, కోచ్‌లు, మా తల్లిదండ్రుల సహకారం మరులేనిదన్నారు. అమయ, అనయ్ వరల్డ్ చాంపియన్స్‌గా తప్పక విజయం సాధిస్తారని అమయ, అనయ్ తల్లిదండ్రులు తనాషా అగర్వాల్, వరుణ్ అగర్వాల్ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

సాక్షి రియల్టీ



4.5% పెరిగిన అద్దెలు

- గచ్చిబౌలి, కొండాపూర్‌లో డిమాండ్
- ఔటర్, ఆఫీసులకు చేరువలో ఉండటమే కారణం
- మ్యాజిక్‌బ్రిక్స్.కామ్ నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కరోనా ప్రభావం నుంచి అద్దె గృహాల విపణి క్రమంగా తేరుకుంది. దీంతో కార్యాలయాలు పునఃప్రారంభం కావటం, ప్రధాన నగరాలకు విద్యార్థులు తిరిగి రావటం వంటి కారణాలతో గత ఏడాది కాలంగా దేశంలోని ప్రధాన నగరాలలో అద్దె గృహాలకు డిమాండ్ పెరిగింది. ప్రధానంగా మెరుగైన ప్రయాణ సాధనాలు, పని కేంద్రాలకు చేరువలో ఉన్న అద్దె ఇళ్లకు డిమాండ్ ఉందని మ్యాజిక్‌బ్రిక్స్.కామ్ సీఈఓ సుధీర్ పాయ్ తెలిపారు. ప్రాపర్టీల విలువ పెరగడంతో గృహయజమానులు అద్దెల కంటే లాభదాయకమైన ఆస్తుల విక్రయాల కోసం అన్వేషిస్తున్నారని, దీంతో సప్లయ్ తగ్గిందని వివరించారు. దీంతో అద్దె గృహాలకు డిమాండ్‌తో పాటు రెంట్లు కూడా పెరిగాయని పేర్కొన్నారు.

- ఈ ఏడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో హైదరాబాద్‌లో అద్దె గృహాలకు డిమాండ్ 22% మేర పెరిగింది. సరఫరా 2.1% క్షీణించగా.. సగటు రెంట్లు 4.5 % మేర పెరిగాయి. అద్దెల మార్కెట్‌లో డిమాండ్, సప్లయి వాటా 50, 39 శాతంగా ఉన్నాయి.
- గచ్చిబౌలి, కొండాపూర్‌లో అత్యధికంగా అద్దెలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. కార్యాలయాలు, ఉపాధి కేంద్రాలకు సమీపంలో ఉండటం, ఔటర్ రింగ్ రోడ్డుతో మెరుగైన కనెక్టివిటీ కారణం. 55 శాతం మంది అద్దెదారులు రూ.10 వేల నుంచి రూ.20 వేలు నెలవారీ అద్దెల కోసం వెతుకుతున్నారు. 1,000 చ.అ. నుంచి 1,500 చ.అ. విస్తీర్ణంలో ఉన్న గృహాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది.

వైవిధ్య పెట్టుబడులతో అధిక లాభాలు

Assetmonk Growing together

సాక్షి, హైదరాబాద్: అస్థిరత, వేగంగా మారుతున్న మార్కెట్ యుగంలో పెట్టుబడులకు ఆశించిన లాభాలు రావాలంటే వ్యూహాత్మక, వైవిధ్యభరిత ఇన్వెస్ట్‌మెంట్స్ చేయాలని అసెట్‌మాంక్ కో–ఫౌండర్, సీఓఓ పృథ్వీ రెడ్డి సూచించారు. పెట్టుబడి సాధనాలలో రియల్ ఎస్టేట్ దీర్ఘకాలిక సంపద సృష్టి సాధనంగా మారింది. వైవిధ్యభరితమైన పెట్టుబడులతో రిస్క్ తక్కువగా ఉండటమే కాకుండా స్థిరమైన, నిరంతర లాభాలను అందుకోవచ్చు. పన్ను ప్రయోజనాలతోపాటు దీర్ఘకాల మూలధన లాభాలు అందుతాయి. సాంప్రదాయ పెట్టుబడి పోర్ట్‌ఫోలియోలో మార్కెట్ హెచ్చుతగ్గులు పెట్టుబడిదారులను అనిశ్చితిలోకి నెట్టేసే భయాందోళనలు కలిగిస్తుంది. ఇలాంటి ప్రతికూల సమయంలో లగ్జరీ రియల్టీ పెట్టుబడులు తక్కువ అస్థిరత, స్థిరమైన, సమతుల్య పెట్టుబడి విధానంతో మార్కెట్ గందరగోళ పరిస్థితుల నుంచి బయటపడవచ్చు. మార్కెట్ సెంటిమెంట్‌పై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. అద్దె ఆదాయం, నిరంతర నగదు ప్రవాహం ఉంటుంది. నివాస, వాణిజ్య, రిటైల్ ఇలా ప్రాపర్టీ రకాలు, ప్రాంతాలను బట్టి ఆదాయ వృద్ధిలో ప్రయోజనాలను అందుకోవచ్చు. పెట్టుబడులకు భద్రతతో పాటు దీర్ఘకాలిక రాబడులు ఉంటాయి.

మంచి సాహిత్యంతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న బుర్రా వెంకటేశం, జూలూరు గౌరీశంకర్

గన్‌ఫౌండ్రీ: మంచి సాహిత్యం ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిస్తుందని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ విరచిత దీపాంజలి కావ్యాన్ని, డాక్టర్ లక్ష్మీనారాయణ అనువాదించిన స్వేచ్ఛానువాద గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ మట్టికి అమోఘమైన శక్తి ఉందని, ఈ మట్టి నుంచి ఎందరో జీవ కవిత్వాన్ని రాసిన జీవ కవులు ఉద్భవించారని పేర్కొన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ.. రఘువర్మ, డాక్టర్ టి.లక్ష్మీనారాయణ ఎంతో సరళమైన భాషలో కవిత్వాలను అనువాదిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్‌డీ టి.గంగాధర్, సాహిత్య అకాడమి కార్యదర్శి ఎస్.బాలచారి పాల్గొన్నారు.

పర్యాటక రంగంలో పంజాబ్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం



మాట్లాడుతున్న అన్మోల్ గగన్ మాన్

లక్డీకాపూల్: 2030 నాటికి పంజాబ్ ప్రముఖ అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మారనున్నదని ఆ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల మంత్రి అన్మోల్ గగన్ మాన్ తెలిపారు. భారతీయ పర్యాటక రంగంలో పంజాబ్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దాలని పర్యాటక శాఖ భావిస్తోందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో పంజాబ్ టూరిజం రోడ్డు షో సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. హైదరాబాద్ బిర్యానీ ఫేమస్ అయితే.. పంజాబ్ రోటీ కేరాఫ్ అని పేర్కొన్నారు. పంజాబ్ ను ప్రధాన పర్యాటక ప్రాంతంగా నిలపాలన్న ఉద్దేశంతో సెప్టెంబరు 11 నుంచి 13వ తేదీ వరకు మొహాలీలో టూరిజం సమ్మిట్ అండ్ ట్రావెల్ మార్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ల్యాండ్‌మార్క్ ఈవెంట్ పంజాబ్‌ను ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా నిలుపుతుందన్నారు. ఈ డైనమిక్ కన్వర్జెన్స్‌తో పంజాబ్ ఒక ప్రధాన ప్రపంచ పర్యాటక హాట్‌స్పాట్‌గా మారనుందన్నారు. ఐదు ప్రముఖ నగరాలు అమృత్‌సర్, రూప్‌నగర్, లూధియానా, పాటియాలా, ఫతేఘర్ సాహిబ్ ఇప్పటికే విదేశీ పర్యాటకుల దృష్టిని ఆకర్షించాయన్నారు. ఆ రాష్ట్ర టూరిజం అండ్ కల్చరల్ అఫైర్స్, టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ రాఖీ గుప్తా భండారీ మాట్లాడుతూ.. టూరిజంలో వెల్నెస్, మహిళలు అనే రెండు కీలక కార్యక్రమాల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. పర్యాటక రంగంలో మహిళలకు సాధికారత కల్పించడం సామాజిక ఆర్థిక వృద్ధికి హామీ ఇస్తుందన్నారు.

అంతర్భాగం

వడ్డించేవారు మనవారే



● తన సిబ్బందితో సోనమ్...



● రెస్టరెంట్‌లో సైన్ లాంగ్వేజ్‌లో ఆర్డర్ తీసుకుంటున్న వెయిటర్

డౌన్ సిండ్రోమ్, ఆటిజమ్, మూగ, బధిర... వీరిని 'మనలో ఒకరు' అని అందరూ అనుకోరు. వీరికి ఉద్యోగం ఇవ్వాలంటే 'వాళ్లేం చేయగలరు' అని విడిగా చూస్తారు. కాని ప్రతి ఒక్కరూ ఈ సమాజంలో అంతర్భాగమే అంటుంది డాక్టర్ సోనమ్ కాప్సే. కేవలం దివ్యాంగులనే స్టాఫ్‌గా చేసుకుని ఆమె నడుపుతున్న రెస్టరెంట్ పూణెలో విజయవంతంగా నడుస్తోంది. 'ఇక్కడంతా వడ్డించేవారు మనవారే' అంటుంది సోనమ్.

పుణెలో ఆంకాలజిస్ట్‌గా, కేన్సర్ స్పెషలిస్ట్‌గా పని చేస్తున్న సోనమ్ కాప్సేకు బాల్యం నుంచి రకరకాల వంట పదార్థాలను రుచి చూడటం ఇష్టం. 'మా అమ్మానాన్నలతో విదేశాలకు వెళ్లినప్పుడు హోటళ్ల లో రకరకాల ఫుడ్ తినేదాన్ని. మంచి రెస్టరెంట్ ఎప్పటికైనా నడపాలని నా మనసులో ఉండేది' అంటుంది సోనమ్. అయితే ఆ కల వెంటనే నెరవేర లేదు. కేన్సర్ స్పెషలిస్ట్‌గా బిజీగా ఉంటూ ఆమె ఆ విషయాన్నే మర్చిపోయింది.

యూరప్‌లో చూసి

'నేను ట్రావెలింగ్‌ని ఇష్టపడతాను. యూరప్‌కు వెళ్లినప్పుడు ఒక బిస్ట్రో (కాకా హోటల్ లాంటిది)లో ఏదైనా తిందామని వెళ్లాను. ఆశ్చర్యంగా అక్కడ సర్వ్ చేస్తున్నవాళ్లంతా స్పెషల్ వ్యక్తులే. అంటే బుద్ధి మాంద్యం, వినికిడి లోపం, అంగ వైకల్యం, మూగ... ఇలాంటి వాళ్లు. వాళ్లంతా సైన్ లాంగ్వేజ్‌లో ఆర్డర్ తీసుకుంటున్నారు. కస్టమర్లు వారికి ఎంతో సహకరిస్తున్నారు. ఇటువంటి వారి జీవితం మర్యాదకరంగా గడవాలంటే వారిని ఉపాధి రంగంలో అంతర్భాగం చేయడం సరైన మార్గం అని తెలిసొచ్చింది. మన దేశంలో సహజంగానే ఇలాంటివారికి పని ఇవ్వరు. అందుకే మన దేశంలో కూడా ఇలాంటి రెస్టరెంట్లు విరివిగా ఉండాలనుకున్నాను. ఇప్పటికే కొన్నిచోట్ల ఉన్నాయి కానీ, నేను కూడా ఇలాంటి రెస్టరెంట్ ఒకటి ఎందుకు మొదలు పెట్టకూడదు... అని ఆలోచించాను. అలా పుట్టినదే 'టెర్రసిన్' రెస్టరెంట్. టెర్రసిన్ అంటే భూమి రుచులు అని అర్థం. పొలం నుంచి నేరుగా వంటశాలకు చేర్చి వండటం అన్నమాట' అందామె.

> **దురదృష్టవశాత్తు దివ్యాంగులుగా జన్మిస్తే వివిధ కారణాల వల్ల శారీరక దురవస్థలు ఏర్పడితే ఇక వారిని విడిగా పెట్టడం... వారిని ఉపాధికి దూరం చేయడం సరికాదు. వీలైనంత వరకూ వారిని అంతర్భాగం చేసుకోవాలనే ఉద్యమాలు అనేకచోట్ల నడుస్తున్నాయి.**

2021లో ప్రారంభం

పూణెలో బిజీగా ఉండే ఎఫ్.సి.రోడ్‌లో స్పెషల్ వ్యక్తులే సిబ్బందిగా 2021లో కోటిన్నర రూపాయల ఖర్చుతో 'టెర్రసిన్' పేరుతో రెస్టరెంట్ ప్రారంభించింది సోనమ్. ఇందు కోసం స్పెషల్ వ్యక్తులను ఎంపిక చేసి వారికి ట్రయినింగ్ ఇచ్చింది. 'వారితో మాట్లాడటానికి మొదట నేను ఇండియన్ సైన్ లాంగ్వేజ్ నేర్చుకున్నాను. ఆర్డర్ తీసుకోవడం, సర్వ్ చేయడం వంటి విషయాల్లో ట్రయినింగ్ ఇచ్చాం. కస్టమర్లు సైన్ లాంగ్వేజ్‌లో ఆర్డర్ చెప్పొచ్చు లేదా మెనూలో తాము ఎంచుకున్న ఫుడ్‌ను వేలితో చూపించడం ద్వారా చెప్పొచ్చు. అయితే ఆటిజమ్ వంటి బుద్ధిమాంద్యం ఉన్నవాళ్లను ఉద్యోగంలోకి పంపడానికి కుటుంబ సభ్యులు మొదట జంకారు. వారిని ఒప్పించడం కష్టమైంది. ఒకసారి వారు పనిలోకి దిగాక ఆ కుటుంబ సభ్యులే చూసి సంతోషించారు. మా హోటల్‌ను బిజీ సెంటర్‌లో పెట్టడానికి కారణం మా సిబ్బంది నలుగురి కళ్లల్లో పడి ఇలాంటివారికి ఉపాధి కల్పించాలనే ఆలోచన ఇతరులకు రావడానికే. మా హోటల్ బ్రేక్ ఈవెన్ సాధించింది. ఇప్పుడు ఆదాయంలో ఉంది. త్వరలో దేశంలో మరో ఐదుచోట్ల ఇలాంటి హోటల్స్ పెట్టాలనుకుంటున్నాను' అని తెలిపింది సోనమ్.

వారూ మనవారే

సమాజ ఫలాలకు అందరూ హక్కుదారులే. దురదృష్టవశాత్తు దివ్యాంగులుగా జన్మిస్తే వివిధ కారణాల వల్ల శారీరక దురవస్థలు ఏర్పడితే ఇక వారిని విడిగా పెట్టడం, ఉపాధికి దూరం చేయడం సరి కాదు. వీలైనంత వరకూ వారిని అంతర్భాగం చేసుకోవాలి. ఇలాంటి ఉద్యమాలు అనేకచోట్ల నడుస్తున్నాయి. కొందరు పదిలో రెండు ఉద్యోగాలైనా ఇలాంటివారికి ఇస్తున్నారు. సోనమ్ లాంటి వారు పూర్తి అవకాశాలు కల్పిస్తున్నారు. ఈ రంగంలో ఇంకా ఎంతో జరగాల్సి ఉంది.

● ఎకో ఫ్రెండ్లీ

ఎర్రమట్టి రాఖీలు

ఎకో ఫ్రెండ్లీ వినాయకుడిని చేశాం. ఎకో ఫ్రెండ్లీ ఆభరణాలను చూశాం. ప్రకృతి- పర్యావరణాల బంధానికి... ఇకపై... ఎకో ఫ్రెండ్లీ రక్షాబంధనం. బంధాల అల్లిక రాఖీ పండుగకు... అనుబంధాల లతలల్లింది శ్రీలత.



నిజామాబాద్‌కు చెందిన శ్రీలత సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లమో చేశారు. పెళ్లి తర్వాత కుటుంబ బాధ్యతల వల్ల ఉద్యోగం మానేయాల్సి వచ్చింది. గృహిణిగా ఇంటి నాలుగ్గోడలే జీవితం అనుకోలేదామె. నాలుగు గోడలను సృజనాత్మకతతో తీర్చిదిద్దారు.

శ్రీలత తన ఇంట్లో సోఫాలో కూర్చుని ఏ గోడను చూసుకున్నా తాను చేసిన ఫ్లవర్ వాజ్, కార్నర్ స్టాండ్, తలమీద కుండలు పేర్చుకుని భవనంలోకి అడుగుపెడుతున్న ఎంబ్రాయిడరీ గొల్లభామ, రాధాకృష్ణుల వాల్ హ్యాంగింగ్‌లు కనిపిస్తాయి. తలెత్తి చూస్తే షాండ్లియర్ కనువిందు చేస్తుంది. బీరువా తెరిస్తే తాను పెయింటింగ్ చేసుకున్న చీరలు. ఏక్‌తార మీటుతున్న భక్త మీరాబాయి ఆమె కుంచెలో ఒదిగిపోయి చీర కొంగులో జాలువారి ఉంది. మెడలో ధరించిన టెర్రకోట ఆభరణంలో రాధాకృష్ణులు వయ్యారాలొలికిస్తుంటారు. మరోదిక్కున వర్లి జానపద మహిళలు కొలువుదీరిన మినీ టేబుల్ స్టాండ్. డాబా మీదకెళ్తే మొక్కల పచ్చదనం, చుట్టూ ఎర్రటి పిట్టగోడల మీద తెల్లటి చుక్కల ముగ్గులు... ఖాళీ సమయాన్ని ఇంత ఉపయుక్తంగా మార్చుకోవచ్చా... అన్న విస్మయం, అందరికీ రోజుకు ఇరవై నాలుగ్గంటలే కదా ఉంటాయి... ఇన్ని రకాలెలా సాధ్యం అనే ఆశ్చర్యం ఏకకాలంలో కలుగుతాయి. ఇప్పుడామె రాబోతున్న రాఖీ పండుగకు పర్యావరణహితమైన టెర్రకోట రాఖీల తయారీకి సిద్ధమయ్యారు. తన కళాభిరుచిని సాక్షితో పంచుకున్నారు శ్రీలత.

రంగు... బ్రష్ ఉంటే చాలు!

"మా సొంతూరు దోమకొండ. మా చిన్నప్పుడే నిజామాబాద్‌కి వచ్చేశాం. అత్తగారిల్లు బాన్సువాడ, కానీ మావారి వ్యాపారరీత్యా నిజామాబాద్‌లోనే స్థిరపడ్డాం. అత్తగారిల్లు ఉమ్మడి కుటుంబం, ఇంటి బాధ్యతల కోసం పూర్తి సమయం కేటాయించాల్సిన అవసరం ఉండేది. దాంతో ఉద్యోగం మానేయక తప్పలేదు. అయితే నిజామాబాద్‌కి వచ్చిన తర్వాత ఖాళీ సమయం ఎక్కువగా ఉంటోంది. పిల్లలు ముగ్గురూ స్కూళ్లకు, కాలేజీకి, మా వారు బయటకు వెళ్లిన తర్వాత రోజంతా ఖాళీనే. టీవీ చూస్తూ గడిపేయడం నాకు నచ్చేది కాదు. చిన్నప్పుడు మా అమ్మ చేస్తూ ఉంటే చూసి నేర్చుకున్న కళలన్నీ గుర్తుకు వచ్చాయి. నా క్రియేటివ్ జర్నీ అలా మొదలైంది. వీటన్నింటినీ చేయడానికి ముడిసరుకు కోసం మార్కెట్‌కెళ్లే పనే ఉండదు. ఇంటికి వచ్చిన పెళ్లి పత్రిక, చాక్లెట్ బాక్సులు, కేక్ కట్ చేసిన తర్వాత మిగిలిన అట్టముక్క... దేనినీ వదలను. రంగులు, బ్రష్‌లు కొంటే చాలు ఇక నాకు చేతినిండా పని. నా మెదడు చివరికి ఎంతగా ట్యూన్ అయిపోయిందంటే... ఉపయోగంలో లేని ఏ వస్తువును చూసినా దాంతో ఏమి చేయవచ్చు... అనే ఆలోచనలు తిరుగుతూనే ఉంటాయి. ఆలోచనలకు ఒక రూపం వచ్చిందంటే పని మొదలు పెట్టడమే. వచ్చిన ఐడియాని మర్చిపోతానేమోనని ఒక్కోసారి ఒకటి పూర్తికాక ముందే మరొకటి మొదలు పెడతాను.

మట్టితో రాఖీ!

కోవిడ్ లాక్‌డౌన్ సమయం నాకు బాగా కలిసి వచ్చింది. ఒక్క రోజు కూడా బోరు కొట్టలేదు. అప్పటి వరకు ఇంటి అలంకరణ వస్తువులు, ఆభరణాలు మాత్రమే చేసిన నేను రాఖీల తయారీ కూడా మొదలు పెట్టాను. మొక్కల కోసం తెప్పించుకునే ఎర్రమట్టిని రాఖీలు, ఆభరణాలకు అనుగుణంగా సిద్ధం చేసుకుంటాను. మట్టిని నీటిలో నానబెట్టి కరిగిన తర్వాత సన్నని చిల్లులున్న జల్లెడలో వేసి బకెట్‌లోకి వడపోయాలి. రాళ్లు, నలకలు, పుల్లల వంటివి జల్లెడ పైన ఉండిపోతాయి. ఓ గంట సేపటికి బకెట్‌లో నీరు పైకి తేలుతుంది. అడుగుకు చేరిన మట్టిని తీసి ఎండబెట్టాలి. తేమ ఆరిపోతూ ముద్దగా ఉన్నప్పుడు ఆభరణాలు తయారుచేసి ఎండబెట్టాలి. ఎండిన తర్వాత కొబ్బరి పీచు, వరిపొట్టులో వేసి కాల్చాలి. ఇటుకలు కాల్చినట్లేనన్నమాట. వేడి చల్లారిన తర్వాత రంగులు వేసి, దారాలు చుడితే రాఖీ రెడీ. లాకెట్‌లు, చెవుల జూకాలు కూడా ఇలాగే చేస్తాను.

మొక్క నాటుతాం!

రాఖీలను మొదట్లో మా ఇంట్లో వరకే చేశాను. ఇప్పుడు నా రాఖీలు కావాలని బంధువులు, స్నేహితులు అడుగుతున్నారు. ఓ వంద రాఖీలు అవసరమవుతున్నాయి. అందుకే ఈ ఏడాది ఆగస్టు మొదటివారం నుంచే పని మొదలుపెట్టాను. పర్యావరణ పరిరక్షణ పట్ల ఆసక్తి కలిగినప్పటి నుంచి మట్టి వినాయకుడి బొమ్మనే తెచ్చుకుంటున్నాం. పండుగ తరవాత గణపతిని పూలకుండీలో పెట్టి నీరు పోసి కరిగిన తరవాత మొక్క నాటుతాను. మరో విషయం... మా ఇంట్లో ఏటా పుట్టినరోజులు, పెళ్లిరోజుకు కొత్త మొక్కను నాటుతాం" అని చెప్తూ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియచేశారు శ్రీలత.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



ముఖానికి ద్రాక్ష

జిడ్డుతత్వం ఉన్న చర్మానికి గ్రేప్స్ ప్యాక్ బాగా పనిచేస్తుంది. ఈ ప్యాక్ వేసుకుంటే అధికంగా ఉన్న జిడ్డు పోతుంది. పది నల్ల ద్రాక్ష పండ్లను పేస్టులా చేసుకోవాలి. ఈ పేస్టులో టేబుల్ స్పూను ముల్తాని మట్టి, టీస్పూను రోజ్ వాటర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి అరగంటపాటు ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

***

కొన్ని నల్ల ద్రాక్షపళ్లను బాగా పిసికి గుజ్జు తీయాలి. దానికి చెంచా పంచదార, చిటికెడు పసుపు కలిపి ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి సున్నితంగా మర్దన చేయాలి. 20 నిమిషాల తర్వాత కడిగేయాలి. వారానికి ఒకటి లేదా రెండుసార్లు ఇలా చేస్తే ముఖంపై మృత కణాలన్నీ తొలగిపోతాయి. 5 వారాలపాటు క్రమం తప్పకుండా చేస్తే ముఖం కాంతిమంతంగా.. యంగ్‌లుక్‌తో కనిపిస్తుంది.

***

ఒక కప్పు ద్రాక్ష పళ్లు తీసుకుని చేతులతో పిసికి గుజ్జులా చేయాలి. వాటిలో రెండు చెంచాల పాలు, చెంచా తేనె కలిపి ముఖానికి రాసుకోవాలి. 15 నిమిషాల తర్వాత చల్లని నీటితో ముఖం కడుక్కోవాలి. ఇలా తరచూ చేస్తుంటే ముఖంపై ఉండే మొటిమలు తాలూకు మచ్చలు పోయి చర్మం మృదువుగా మెరుపులీనుతుంటుంది.

***

చిన్న టొమాటో తీసుకుని ముక్కలుగా తరగాలి. ఈ ముక్కలకు ఆరు ద్రాక్షపండ్లను జోడించి మెత్తని పేస్టులా రుబ్బుకోవాలి. ఈ మిశ్రమాన్ని పెదవులు, కళ్లకు అంటకుండా ముఖానికి, మెడకు అప్లై చేసి ఇరవై నిమిషాలపాటు ఆరనివ్వాలి. తరువాత చల్లని నీటితో కడిగేయాలి.

మక్రామీ

చీకటిని తరిమికొట్టిన దారి దీపం



● సంప్రీత్ కౌర్





● మక్రామీ ఆర్ట్

'ఇదేమీ జీవితం' అనే మాట సంప్రీత్ కౌర్ నోటి నుంచి ఎన్నోసార్లు వచ్చేది. నరకాన్ని తలపించే ప్రదేశంలో ఆమె బందీగా లేదు. ఎప్పటిలాగే, అదే ఇంట్లో అదే కుటుంబ సభ్యుల మధ్య ఉంది. 'ఇదేమీ జీవితం నుంచి ఎందుకీ జీవితం' వరకు కౌర్ ఆలోచనలు వెళుతున్న చీకటి కాలంలో ఆమె ముందు ఒక వెలుగు కిరణం పడింది. దాని పేరు... మక్రామీ!

స్కూల్ నుంచి కాలేజీ వరకు స్టార్ స్టూడెంట్‌గా పేరు తెచ్చుకుంది హరియాణాలోని గురుగ్రామ్‌కు చెందిన సంప్రీత్‌కౌర్. ప్రెగ్నెన్సీ సమయంలో తొమ్మిదేళ్ల కెరీర్‌కు గుడ్‌బై చెప్పింది. ఎన్నో ప్రసిద్ధ సంస్థల్లో క్రియేటివ్ డైరెక్టర్‌గా పనిచేసిన కౌర్‌కు ఖాళీగా కూర్చోవడం అంటే ఇష్టం ఉండదు. కాని అనివార్య పరిస్థితులలో ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది.

డెలివరీ తర్వాత కౌర్ ప్రసూతి వైరాగ్యానికి అంటే పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్‌కు గురైంది.

తాను తనలాగా ఉండలేకపోయేది.

ఏవేవో ప్రతికూల ఆలోచనలు.

ఎప్పుడూ సందడిగా ఉండే కౌర్‌కు ఎవరితో మాట్లాడాలనిపించే కాదు. 'మనసుంటే మార్గం ఉంటుంది' అంటారు. అయితే ఆమె మనసు చీకట్లో కొట్టుమిట్టాడుతోంది. అయినప్పటికీ ఆ మనసు ఒక మార్గాన్ని వెలుతురుగా ఇచ్చింది... అదే మక్రామీ ఆర్ట్.

ఆ ఆర్ట్‌కు దగ్గరవుతున్నకొద్దీ తనలోని డిప్రెషన్ మూడ్స్ దూరంగా వెళ్లిపోయేవి. చివరికి అవి కనిపించకుండా పోయాయి. కౌర్ గతంలోలాగే చురుగ్గా ఉండడం మొదలుపెట్టింది.

'మక్రామీ'లో నేర్పు సాధించిన కౌర్ ఆ కళను గాలికి వదిలేయలేదు. తాను ఎంటర్‌ప్రెన్యూర్ కావడానికి దాన్ని ఒక దారిగా చేసుకుంది

'అబ్బాయి పుట్టిన తరువాత, తరచుగా డిప్రెసివ్ మూడ్స్ వచ్చేవి. నా కాలేజి చదువు కోసం తల్లిదండ్రులు ఎంతో ఖర్చు చేశారు. ఉద్యోగ జీవితాన్ని మిస్ అవుతున్నాననే బాధ ఉండేది. ఎంతో కష్టపడి చదివి ఉద్యోగం సంపాదించాను. ఇప్పుడు ఇలా ఖాళీగా ఉండడం ఏమిటీ అని ఆలోచించేదాన్ని. గుంపులో ఉన్నా ఒంటరిగానే ఫీలయ్యేదాన్ని. పిల్లాడితో ఆడుకుంటూ ఆనందించడం కంటే, పిల్లాడు ఎప్పుడు నిద్రపోతాడా అని ఎదురు చూసేదాన్ని. పిల్లాడు నిద్రపోగానే ఒంటరిగా కూర్చొని ఏవేవో ఆలోచించేదాన్ని. 'పిల్లాడి మీద శ్రద్ధ పెట్టు. వృథాగా ఆలోచించకు' అని అమ్మ మందలించేది. ఎప్పుడూ సరదాగా ఉండే నేను సీరియస్‌గా మారిపోవడం చూసి మా ఆయన అయోమయానికి గురయ్యేవారు. ఆయనకు ఏం అర్థమయ్యేది కాదు. ఒకరోజు యూట్యూబ్‌లో పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్‌కు సంబంధించిన వీడియో చూశాను. తల్లి మూడ్‌స్వింగ్స్ పిల్లాడిపై ప్రభావం చూపుతాయనే విషయం విన్న తరువాత భయమేసింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని నా సమస్యకు నేనే పరిష్కారాన్ని వెదుక్కున్నాను' గతాన్ని గుర్తు చేసుకుంటుంది కౌర్.

'జస్ట్ ఏ హాబీ'గా పరిచయం అయిన మక్రామీ ఆర్ట్ కౌర్‌ను పూర్తిగా మార్చివేసింది. మునుపటి చురుకుదనాన్ని, హాస్యచతురతను తెచ్చి ఇచ్చింది.

'మక్రామీ ఆర్ట్ ద్వారా అర్థం లేని ఆలోచనకు అడ్డుకట్ట పడింది. మనసు చాలా తేలిక అయింది. కొన్ని ఫ్లవర్ పాట్ హోల్డర్స్‌ను తయారుచేసి వాటి ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాను. ఒక ఫ్రెండ్ ఇది చూసి తనకు ఆరు పీస్‌లు కావాలని అడిగింది. ఆమె నా ఫస్ట్ కస్టమర్. నా హాబీ అనేది విజయవంతమైన వ్యాపారంగా మారడానికి ఎంతో కాలం పట్టలేదు. ఆర్థికంగా ఒకరి మీద ఆధారపడడం ఇష్టంలేని నాకు ఇది చాలా గర్వంగా అనిపించింది' అంటుంది కౌర్.

కౌర్ ఆర్ట్‌వర్క్‌కు ఎంతో మంది అభిమానులు ఏర్పడ్డారు. వారిలో ఒకరు... రెగ్యులర్ కస్టమర్ అయిన అర్చన.

'కౌర్ ఆర్ట్‌వర్క్ అంటే నాకు ఎంతో ఇష్టం. అత్యంత కఠిన సమయంలో ఆర్ట్ ద్వారా ఎలా బయటపడిందో తెలుసుకున్నాక ఆమె మీద అభిమానం రెట్టింపు అయింది. గోరంత సమస్యనే కొండంత చేసుకొని బాధపడే వారికి కౌర్ గురించి చెబుతుంటాను. ఆమె ఆర్ట్ వర్క్‌లో క్వాలిటీ, చూడగానే ఆకట్టుకునే సృజన నాకు ఇష్టం' అంటుంది అర్చన.

బాలీవుడ్ నటి తాప్సీ పన్ను నుంచి కౌర్‌కు పెద్ద ఆర్డర్ వచ్చింది. విదేశాల నుంచి కూడా ఆర్డర్లు రావడం మొదలైంది. దేశ, విదేశాల నుంచి ప్రతి నెల పదిహేను వందలకు పైగా ఆర్డర్లు వస్తున్నాయి.

'నాలాగే సమస్యలు ఎదుర్కొంటున్న తల్లుల దగ్గరకు వెళ్లి నేను పడిన ఆందోళన, దానినుంచి బయటపడడానికి చేసిన కృషి గురించి చెప్పి మామూలు స్థితికి తీసుకువచ్చే దాన్ని. ఎంటర్‌ప్రెన్యూర్‌గా సాధించిన విజయం కంటే వారిలో మార్పు తీసుకువచ్చాననే సంతృప్తి ఎక్కువ సంతోషాన్ని ఇచ్చింది' అంటుంది సంప్రీత్ కౌర్.

నిజాయితీగా, విరామం లేకుండా కృషి చేస్తే విజయం తప్పక సాధిస్తామని నమ్మే ట్రీ టీచర్... అతిపెద్ద థార్ ఎడారిని సస్యశ్యామలం చేసేందుకు నిర్విరామంగా కృషిచేస్తున్నాడు. ఇసుకమేటలను పచ్చని అడవులుగా మార్చేందుకు తను తాపత్రయపడుతూ.. అందరిలో అవగాహన కల్పిస్తున్నాడు. "ప్రకృతిని తన కుటుంబంలో ఒకరిగా చూసుకుంటూ భూమాతను కాపాడుకుందాం రండి" అంటు పచ్చదనం పాఠాలు చెబుతున్నాడు ట్రీ టీచర్ భేరారం భాఖర్.

ఎడారిలో... పచ్చదనం పాఠాలు

రాజస్థాన్‌లోని బార్మర్ జిల్లా కుగ్రామం ఇంద్రోయ్‌కుచెందిన భేరారం భాఖర్ స్కూల్లో చదివే రోజుల్లో .. విద్యార్థులందర్నీ టూర్‌కు తీసుకెళ్లారు. ఈ టూర్‌లో యాభై మొక్కలను నాటడం ఒక టాస్క్‌గా అప్పగించారు పిల్లలకు. తన స్నేహితులతో కలిసి భేరారం కూడా మొక్కలను ఎంతో శ్రద్ధగా నాటాడు. అలా మొక్కలు నాటడం తనకి బాగా నచ్చింది. టూర్ నుంచి ఇంటికొచ్చిన తరువాత మొక్కలు నాటి, వాటిని పరిరక్షించడం వల్ల ప్రకృతి బావుంటుంది అని తెలిసి భాఖర్‌కు చాలా సంతోషంగా అనిపించింది. మిగతా పిల్లలంతా మొక్కలు నాటడాన్ని ఒక టాస్క్‌గా తీసుకుని మర్చిపోతే భేరారం మాత్రం దాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నాడు."ప్రకృతిని ఎంత ప్రేమగా చూసుకుంటే అది మనల్ని అంతగా ఆదరిస్తుంది. పర్యావరణాన్ని జాగ్రత్తగా చూసుకోవడం మన బాధ్యత" అని నిర్ణయించుకుని అప్పటి నుంచి మొక్కలు నాటడం మొదలు పెట్టాడు.

ట్రీ టీచర్‌గా...

మొక్కలు నాటుతూ చదువుకుంటూ పెరిగిన భాఖర్‌కు ప్రభుత్వ స్కూల్లో టీచర్ ఉద్యోగం వచ్చింది. దీంతో తనకొచ్చిన తొలిజీతాన్ని మొక్కల నాటడానికే కేటాయించాడు.'మొక్క నాటండి, జీవితాన్ని కాపాడుకోండి' అనే నినాదంతో తన తోటి టీచర్లను సైతం మొక్కలు నాటడానికి ప్రేరేపించాడు. ఇతర టీచర్ల సాయంతో బర్మార్ జిల్లా సరిహద్దుల నుంచి జైసల్మేర్, జోధర్, ఇంకా ఇతర జిల్లాల్లో సైతం మొక్కలు నాటుతున్నాడు. ఒకపక్క తన విద్యార్థులకు పాఠాలు చెబుతూనే, మొక్కల ప్రాముఖ్యాన్ని వివరిస్తూ ప్రకృతిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాడు. మొక్కలను ఉచితంగా సరఫరా చేస్తూ మొక్కలు నాటిస్తున్నాడు. తన స్కూలు విద్యార్థులకేగాక, ఇతర స్కూళ్లకు కూడా తన మోటర్ సైకిల్ మీద తిరుగుతూ మొక్కలు నరకవద్దని చెబుతూ ట్రీ టీచర్‌గా మారాడు భేరారం.







అడవి కూడా కుటుంబమే...

బర్మార్‌లో పుట్టిపెరిగిన భాఖర్‌కు అక్కడి వాతావరణ పరిస్థితులపై మంచి అవగాహన ఉంది. సరిగా వర్షాలు కురవకపోవడం, నీళ్ల లేక పంటలు పండకపోవడం, రైతుల ఆవేదనను ప్రత్యక్షంగా చూసి ఎడారిలో ఎలాగైనా పచ్చదనం తీసుకురావాలని కంకణం కట్టుకున్నాడు. ఈ క్రమంలోనే... 'ఫ్యామిలీ ఫారెస్ట్రీ' పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. మొక్కను మన కుటుంబంలో ఒక వ్యక్తిగా అనుకుంటే దానిని కచ్చితంగా కాపాడుకుంటాము. అప్పుడు మొక్కలు పచ్చగా పెరిగి ప్రకృతితోపాటు మనమూ బావుంటాము అని పిల్లలు, పెద్దల్లో అవగాహన కల్పిస్తున్నాడు. భేరారం మాటలతో స్ఫూర్తి పొందిన యువతీ యువకులు వారి చుట్టుపక్కల ఖాళీస్థలాల్లో మొక్కలు నాటుతున్నారు.

నాలుగు లక్షలకుపైగా...

అలుపెరగకుండా మొక్కలు నాటుకుంటూ పోతున్న భేరారం ఇప్పటిదాకా నాలుగు లక్షలకు పైగా మొక్కలు నాటాడు. వీటిలో పుష్పించే మొక్కలు, పండ్ల మొక్కలు, నీడనిచ్చే మొక్కలతో సహా మొత్తం లక్షన్నర ఔషధ మొక్కలు కూడా ఉన్నాయి. ఇక్కడి మట్టిలో చక్కగా పెరిగే మునగ మొక్కలు ఎక్కువగా ఉండడం విశేషం. రాజస్థాన్‌లోని ఎనిమిది జిల్లాల్లో పన్నెండు లక్షల విత్తనాలను నాటాడు. 28వేల కిలోమీటర్లు బైక్ మీద తిరుగుతూ లక్షా ఇరవైఐదు వేలమందికి మొక్కల నాటడం తోపాటు, వాటి ప్రాముఖ్యం గురించి అవగాహన కల్పించాడు. మొక్కలే కాకుండా 25 వేల పక్షులకు వసతి కల్పించి వాటిని ఆదుకుంటున్నాడు. గాయపడిన వన్యప్రాణులను సైతం చేరదీస్తూ పర్యావరణాన్ని పచ్చగా ఉంచేందుకు కృషిచేస్తున్నాడు.

చంద్రయాన్ మిషన్ విజయవంతమైనట్టుగా.. భేరారం కృషితో ఎడారి ప్రాంతం కూడా పచ్చదనంతో కళకళలాడాలని కోరుకుందాం.





చాలా మంది ముఖవర్చసును మెరుగుపరుచుకునేందుకు ఎన్నో విధాలుగా ప్రయత్నిస్తుంటారు గానీ, శరీరంలోని ఇతర అవయవాలపై అంత శ్రద్ధ చూపరు. ముఖంతోపాటు చేతులు, కాళ్లు కూడా శుభ్రంగా ఆరోగ్యంగా ఉంటేనే ఆ అందానికి అర్థం. ఆరోగ్యానికి ఆరోగ్యం కూడా... పాదాల పరిరక్షణకు, గోళ్ల అందానికి చేసే పెడిక్యూర్ సంరక్షణనే పెడిక్యూర్, మేనిక్యూర్ అంటారు. వాటి గురించి తెలుసుకుందాం.

క్యూర్ చేసుకుంటున్నారా?









రోజువారి స్నానంలో పాదాలను చాలా మంది అశ్రద్ధ చేస్తుంటారు. ఫలితంగా వివిధ రకాల ఇన్ఫెక్షన్లు వస్తుంటాయి. పెడిక్యూర్ చేయించుకోవడం వల్ల ఈ ఇన్ఫెక్షన్‌లు దూరమవుతాయి. స్త్రీలకు సర్వసాధారణం గా ఎదురయ్యే పాదాల పగుళ్లను పెడిక్యూర్ నివారిస్తుంది. గోళ్లకు రక్తప్రసరణ బాగా జరగడం వల్ల అవి ఆరోగ్యంగా పెరుగుతాయి. గోళ్లకు కూడా పుష్కలంగా పోషకాలు అందడం వల్ల పెరుగుదల బాగుండి అందంగా మెరుపులీనుతాయి.

- పెడిక్యూర్ విధానంలో పాదాలకు మంచి మర్దన (మసాజ్) లభిస్తుంది. దీనివల్ల పాదాల్లో రక్తప్రసరణ బాగా జరుగుతుంది. దీంతో ఎటువంటి నొప్పులు, ఆర్థరైటీస్, వెరికోస్ వెయిన్స్ వంటివి తలెత్తవు.
- పాదాలకు చేసే మసాజ్‌తో శరీరం మొత్తం ఒకేరకమైన ఉష్ణోగ్రతలు కొనసాగడంతోపాటు, లింఫ్‌నోడ్స్ లోని టాక్సిన్స్ బయటకు వెళ్లిపోతాయి.

పాదాలకు మసాజ్ చేయడం వల్ల మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. మసాజ్‌తో ఒత్తిడి తగ్గి మనస్సు ఉత్సాహంగా ఉంటుంది. దీంతో మనలో ఆత్మవిశ్వాసం పెరిగి నూతనోత్సాహంతో మరిన్ని విజయాలు సాధించవచ్చు.

- ఇన్ని ప్రయోజనాలు ఉండబట్టే బ్యూటీ పార్లర్లు, స్పాలు అందించే క్యూర్‌లపై చాలామంది ఆసక్తి కనబరుస్తుంటారు.

పెడిక్యూర్

మర్దన ద్వారా పాదాలను కాపాడుకోవడమే పెడిక్యూర్. రోజంతా పనిచేసి అలసిపోయిన మోకాళ్లు, పాదాలు, మడమలు, కాలివేళ్లు, గిలకలకు మసాజ్ ద్వారా ఉపశమనం కలిగించడం పెడిక్యూర్‌లో ఒక భాగం. ఈ విధానంలో ప్యూమిస్ స్టోన్, మసాజ్ క్రీమ్, నెయిల్ బ్రష్, నెయిల్ కట్టర్, టబ్‌లను ఉపయోగిస్తారు.

ఇలా క్యూర్ చేస్తారు...

ముందుగా కాలిగోళ్లకు అంతకుముందే ఉన్న పాలిష్‌ను, మురికిని తొలగిస్తారు. తరువాత గోళ్లను నీట్‌గా కట్ చేస్తారు. ఆ తరువాత ఒక టబ్‌లో గోరువెచ్చని నీళ్లు తీసుకుని దానిలో చిటికెడు ఉప్పు, సుగంధ తైలం, నిమ్మరసం షాంపు వేసి 30 నిమిషాల పాటు పాదాలను నానబెడతారు. నానిన తరువాత ప్యూమిస్ స్టోన్ లేదా గరుకుగా ఉండే పిండితో మడమలను, అరికాళ్లను మురికి పోయేలా శుభ్రంగా రుద్దుతారు. ఈ ప్రక్రియంతా పూర్తయిన తరువాత మసాజ్ ఆయిల్ లేదా మాయిశ్చరైజర్‌తో పాదాలను అవసరానికి తగ్గట్టు మృదువుగా లేదా గట్టిగా మసాజ్ చేస్తారు. ఆ తరువాత పాదాలను శుభ్రంగా తుడవడంతో పెడిక్యూర్ పూర్తవుతుంది. ఈ విధంగా నెలకు రెండుసార్లు పెడిక్యూర్ చేసుకుంటూ ఉంటే పాదాలు ఆరోగ్యంగా, అందంగా ఉంటాయి. పెడిక్యూర్‌కు కావాల్సిన పరికరాలు మన దగ్గర ఉంటే ఇంట్లో కూడా చేసుకోవచ్చు.

మెనీక్యూర్ ఎలాగంటే...

ముందుగా చేతిగోళ్లకు ఉన్న పాత నెయిల్ పెయింట్‌ను తుడిచివేస్తారు. తర్వాత గోళ్లను నచ్చిన ఆకృతిలో అందంగా ట్రిమ్ చేస్తారు. ఇలా రెండు చేతుల గోళ్లను ట్రిమ్ చేశాక, ఒక గిన్నెలో సోప్ వాటర్‌ను తీసుకుని దానిలో హైడ్రోజన్ పెరాక్సైడ్, గ్లిజరిన్, నిమ్మరసం వేసి రెండు చేతుల వేళ్లు మునిగేలా అందులో ముంచి 10 నిమిషాలు ఉంచుతారు. ఇలా చేయడం వల్ల గోళ్లలో ఉండే మలినాలు, సూక్ష్మజీవులు నశించి గరుకుగా ఉంటే క్యూటికల్స్ మెత్తగా అవుతాయి. గోరు చుట్టూ ఉండే చర్మం కూడా మెత్తబడుతుంది. తరువాత అరిచేతుల నుంచి మోచేతుల వరకు శుభ్రంగా క్లీన్ చేస్తారు. ఆపై రెండు చేతులను తుడుస్తారు. క్యూటికల్ రిమూవర్‌తో గోరు చుట్టూ ఇంకా ఏమైనా క్యూటికల్ బిట్స్ ఉంటే తీస్తారు. దీనివల్ల గోరు పెద్దదిగాను అందంగాను కనిపిస్తుంది. తరువాత చేతులను శుభ్రంగా తుడిచి మాయిశ్చరైజర్‌తో చేతులకు వేళ్లకు మర్దన చేస్తారు. ఇలా 15 రోజులకొకసారి చేయడం వల్ల చేతులు అందంగా ఆరోగ్యంగా కనిపిస్తాయి.

ఖర్చులు భరించగలిగినవారైతే నిపుణులతో పెడిక్యూర్, మెనీక్యూర్ చేయించుకుంటే మరిన్ని మంచి ఫలితాలను పొందే అవకాశం ఉంది.

> **పాదాలను, గోళ్లను అందంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దడాన్నే పెడిక్యూర్ అంటారు. లాటిన్‌లో పెస్ లేదా పెడ్ అంటే పాదం, క్యూర్ అంటే రక్షణ అని అర్థం. అలాగే చేతులు, చేతివేళ్లు, గోళ్లను అందంగా తీర్చిదిద్దే పద్ధతే మెనీక్యూర్. నిజానికి మెనీక్యూర్ కూడా లాటిన్ పదమే. మానస్ అంటే చేయి, క్యూర్ అంటే జాగ్రత్త అని అర్థం. పెడిక్యూర్‌లో పాదాల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే... మెనీక్యూర్‌లో చేతుల ఆరోగ్యం పై ఫోకస్ చేస్తారు.**

దీర్ఘాయుష్మాన్ భవ



మీరు ఎక్కువ కాలం జీవించాలనుకుంటున్నారా? అయితే, మీరు మీ జీవనశైలిలో కొన్ని సర్దుబాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే, ప్రపంచంలో ఎక్కువ కాలం జీవించే వ్యక్తులు ఆరోగ్యకరమైన తిండి, నిద్రవేళలను కచ్చితంగా కలిగి ఉంటారని అధ్యయనాలు చెబుతున్నాయి.

- ఆరోగ్యకరమైన జీవనశైలికి మంచి నిద్ర ప్రణాళిక అవసరం. ప్రతిరోజూ ఒకే సమయంలో పడుకోవడం, మేల్కొనడం వంటి స్థిరమైన నిద్ర షెడ్యూల్‌ను పాటించడం మీకు ఎక్కువ కాలం జీవించడంలో ఉపకరిస్తుంది. అలాగని ఎప్పుడు పడితే అప్పుడు పడుకోవద్దు. ప్రతిరోజు ఒక షెడ్యూల్ ఫిక్స్ చేసుకుని అదే సమయంలో కచ్చితంగా నిద్రించాలి. అంతేకాదు, రోజూ ఒకే సమయంలో నిద్ర నుంచి మేలుకోవాలి.
- కొన్ని అధ్యయనాల ప్రకారం, దీర్ఘకాలం జీవించాలనుకుంటే, మీ మెదడు, శరీరాన్ని పునరుద్ధరించడానికి ప్రతి రాత్రి 8 గంటల నిద్ర అవసరం. తగినంత నిద్ర మీ మెదడు పనితీరు, రోగనిరోధక శక్తి, శక్తి స్థాయిలను మెరుగుపరుస్తుంది. చెదిరిన లేదా కలత నిద్ర మీ మెదడు పనితీరును, ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది.
- విశ్రాంతి తీసుకోవడానికి సమయాన్ని వెచ్చించాలి. దీనివల్ల మీ మనస్సుకే కాదు, శరీరానికి కూడా రోజంతా హాయిగా ఉండేందుకు అవసరమైన విరామం లభిస్తుంది. మీరు దీన్ని ఎలా చేస్తారు? మీరు ఎక్కడ నివసిస్తున్నారనేది వ్యక్తి నుండి వ్యక్తికి మారుతూ ఉంటుంది.
- ప్రపంచంలోని చాలా మంది ప్రజలు మధ్యాహ్నం విశ్రాంతి తీసుకోవడం అలవాటు చేసుకుంటారు. వారు క్రమం తప్పకుండా నడవడం, పుస్తకం చదవడం, వెచ్చని చామంతి టీ తాగడం వంటివి చేస్తారు. ఆనందంగా ఉండటమే.. ఎక్కువ కాలం జీవించేందుకు కారణం.
- సుదీర్ఘ జీవితాన్ని గడపడంలో మీ ఆహారం కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యంగా తినొద్దు. సరైన సమయంలో తగినంత తినడం శరీర బరువును ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. మీరు అల్పాహారం, మధ్యాహ్న భోజనం మీకు నచ్చినట్లుగా తినవచ్చు. రాత్రి భోజనాన్ని మితంగా తీసుకోవచ్చు.
- కుటుంబ సభ్యులతో, స్నేహితులతో కలిసి కబుర్లు చెప్పుకుంటూ సంతోషంగా భోజనం చేయడం వల్ల ఎక్కువ కాలం జీవించవచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి.

లాలన.. పాలన

ఇలా దారికి తెచ్చుకోవాలి



ఈకాలం పిల్లలు తల్లిదండ్రుల మాట వినడం కష్టమే. ఇది చేయకు, అది చేయకు, అలా, ఇలా ఉండకూడదు అని చెబితే అస్సలు వినరు. పెద్దవాళ్లు చెప్పేది తమ మంచికే అన్న స్పృహ ఉండదు వారికి. అయినా పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని తపన పడుతుంటారు తల్లిదండ్రులు. మాట వినకుండా పెంకిగా ప్రవర్తించే పిల్లలను ఇలా మీ దారిలోకి తెచ్చుకోండి. అప్పుడు ఇక పిల్లలతోపాటు మీరూ సంతోషంగా ఉంటారు.

- మాట వినడం లేదని పిల్లలను తిట్టకూడదు. నువ్వు చెడ్డదానివి లేదా చెడ్డవాడివి అని వారిని నిందించకూడదు. నువ్వు పెద్దదానివి లేదా పెద్దవాడివు అవుతున్నావు కదా... అందుకే ఇలా చేస్తే బాగుంటుంది... అని లాలనగా చెప్పాలి.
- కోపంలో మనం అనే కొన్ని రకాల మాటలు పిల్లల మనసుకు గాయం చేసి, వారి మనసును విరిచేస్తాయి. కొన్నిసార్లు వారి ఆత్మవిశ్వాసాన్ని కూడా దెబ్బతీస్తాయి. అందుకే వీలైనంత వరకు వారికి ఓపికగా అర్థమయ్యేలా వివరించి చెప్పాలి.
- పిల్లలు ఎంత విసిగించినప్పటికీ పెద్దగా అరవకూడదు. పైన చెప్పుకున్నట్టు సున్నితంగా పదేపదే చెబుతూ బుజ్జగించాలి. ఎంత చెప్పినా వినకుండా ఉంటే ముందు వాళ్ల కోపం తగ్గించాలి. తరువాత పిల్లలు వినకుండా జాగ్రత్తగా చెప్పాలి.
- చెప్పేది ఏదైనా ప్రేమగా చెబితే ఎంత మొండి చేసేవారైనా తప్పకుండా వింటారు. నచ్చిన డ్రెస్ వేసుకోనివ్వడం, హోం వర్క్ అయిన తరువాత టీవీ చూడనివ్వడం, డాడీతో కలిసి బయటకు వెళ్లడానికి అనుమతించడం వంటివి. ఇలా పిల్లలకు తల్లిదండ్రుల మీద నమ్మకం కలిగించి, తరువాత వారికి మంచి చెడులు వివరించాలి.
- ప్లీజ్, థ్యాంక్యూ, యూ ఆర్ వెల్‌కమ్ వంటి మర్యాదలు నేర్పించాలి. తల్లిదండ్రులు ఏం మాట్లాడతారో పిల్లలు అదే నేర్చుకుంటారు. అందుకే మీరు మాట్లాడేటప్పుడు ఆచితూచి జాగ్రత్తగా మాట్లాడాలి.
- పిల్లలు వారికి హాని జరిగే పనులు కొన్నిసార్లు చేస్తుంటారు. వెంటనే కేకలేసి, లెక్చర్ ఇవ్వకూడదు. కాస్త దెబ్బలు తగిలినప్పటికీ... వాళ్లు తేరుకున్నాక, మీ మాటలు వినే మూడ్‌లో ఉన్నప్పుడు మాత్రమే దాని గురించి వివరించాలి. అప్పుడు వారు మరోసారి అటువంటి పనులు చేయరు.

సినిమా

ఆ రోజు పుష్పగాడి రూల్?



● అల్లు అర్జున్

పుష్పరాజ్‌గా అల్లు అర్జున్ మాంచి జోష్‌లో ఉన్నారు. 'పుష్ప' చిత్రంలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్'లో పుష్పరాజ్‌గా అల్లు అర్జున్ నటనకు జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సంబరాలు పూర్తి స్థాయిలో పూర్తి కాకుండానే 'పుష్ప' సినిమాకు సంబంధించిన ఓ వార్త తెరపైకి వచ్చింది. 'పుష్ప' చిత్రంలోని మలి భాగం 'పుష్ప: ది రూల్' చిత్రీకరణ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా విడుదల విషయంలో మేకర్స్ ఓ క్లారిటీకి వచ్చారని, వచ్చే ఏడాది మార్చి 22న 'పుష్ప: ది రూల్'ను విడుదల చేసేలా సన్నాహాలు చేస్తున్నారని టాక్. విడుదల తేదీపై అతి త్వరలో అధికారిక ప్రకటన రానుందని తెలిసింది. 'ఆర్య', 'ఆర్య 2' చిత్రాల తర్వాత హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో 'పుష్ప' చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్, శ్రీ వల్లి పాత్రలో రష్మికా మందన్నా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త.

వినాయక చవితికి...



● విశాల్

విశాల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'మార్క్ ఆంటోని'. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రీతూ వర్మ హీరోయిన్. ఎస్‌జే సూర్య, సునీల్, సెల్వ రాఘవన్ ముఖ్య పాత్రలు పోషించారు. ఎస్. వినోద్ కుమార్ నిర్మించిన ఈ సినిమా వినాయక చవితి కానుకగా సెప్టెంబర్ 15న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ఐ లవ్ యూ నే..' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ని రిలీజ్ చేశారు. శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటను రామ్ మిరియాల పాడారు. ''హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'మార్క్ ఆంటోని'. ఈ చిత్రంలో విశాల్ లుక్ సరికొత్తగా ఉంటుంది. 'ఐ లవ్ యూ నే..' పాటలో హీరోహీరోయిన్ల మాస్ స్టెప్స్, అందుకు తగ్గట్టుగా వస్తున్న ఫాస్ట్ బీట్ ఆకట్టుకుంటాయి'' అని చిత్రబృందం పేర్కొంది.

ఎమోషనల్ వారియర్



● మోహన్‌లాల్

మోహన్‌లాల్, రోషన్ మేకా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ద్విభాషా (తెలుగు, మలయాళం) చిత్రం 'వృషభ'. 'ది వారియర్ అరైజ్' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంలో జహ్రా ఖాన్, శనయ కపూర్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. నంద కిషోర్ దర్శకత్వంలో అభిషేక్ వ్యాస్, విశాల్ గుర్నాని, జుహి పరేఖ్ మెహతా, శ్యామ్ సుందర్, ఏక్తా కపూర్, శోభా కపూర్, వరుణ్ మథూర్, సౌరభ్ మిశ్రా నిర్మాతలు. ఈ సినిమా తొలి షెడ్యూల్ పూర్తయింది. ''తండ్రీకొడుకుల మధ్య సాగే ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం ఉంటుంది. 'మన్యం పులి' తర్వాత మోహన్‌లాల్, పీటర్ హెయిన్స్ కాంబినేషన్‌లో ఆ తరహా యాక్షన్ సీన్స్ అలరిస్తాయి. హాలీవుడ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నిక్ తుర్లో మా సినిమాకు వర్క్ చేస్తున్నారు'' అని యూనిట్ పేర్కొంది. శ్రీకాంత్ మేకా, రాగిణి ద్వివేది తదితరులు కీలక పాత్రల్లో తెలుగు, మలయాళ భాషల్లో రూపొందుతోన్న ఈ చిత్రం హిందీ, కన్నడ, తమిళ భాషల్లో 2024లో రిలీజ్ కానుంది.

ఇది ప్రజలు గెల్చుకున్న అవార్డు - నిర్మాత అభిషేక్ అగర్వాల్



''ది కశ్మీర్ ఫైల్స్' సినిమాకి 69వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో రెండు అవార్డులు దక్కినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇది ప్రజల సినిమా.. దేశ ప్రజలు ఈ అవార్డు గెలుచుకున్నారు'' అని నిర్మాత అభిషేక్ అగర్వాల్ అన్నారు. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, దర్శన్ కుమార్, పల్లవీ జోషి కీలక పాత్రల్లో వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వం వహించిన చిత్రం 'ది కశ్మీర్ ఫైల్స్'. గత ఏడాది మార్చి 11న ఈ సినిమా విడుదలైంది. 69వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఉత్తమ జాతీయ సమగ్రతా చిత్రం, ఉత్తమ సహాయ నటిగా పల్లవి జోషి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా చిత్రనిర్మాతల్లో ఒకరైన అభిషేక్ అగర్వాల్ విలేకరులతో మాట్లాడుతూ– ''వివేక్ అగ్నిహోత్రిగారికి, పల్లవి జోషీగారికి, 'ది కశ్మీర్ ఫైల్స్' కోసం పని చేసిన అందరికీ ధన్యవాదాలు. ఈ చిత్రాన్ని ప్రజలు గొప్పగా ఆదరించారు. దేశ ప్రజలకు, కశ్మీర్ పండిట్లందరికీ ఈ పురస్కారాల్ని అంకితమిస్తున్నాం. అలాగే జాతీయ ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్‌గారు ఎంపికవడం చాలా ఆనందంగా ఉంది. 'ఆర్ఆర్ఆర్' సినిమాకి ఆరు అవార్డులు, బుచ్చిబాబు సన, చంద్రబోస్ గారికి అవార్డులు రావడం హ్యాపీ. ప్రస్తుతం రవితేజగారితో మేం నిర్మిస్తున్న 'టైగర్ నాగేశ్వర రావు' చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో అక్టోబర్ 20న విడుదల చేస్తాం. ఈ చిత్రానికి కూడా జాతీయ అవార్డు రావాలని కోరుకుంటున్నాను'' అన్నారు.

డీ గ్లామరస్ ఎంట్రీ



● జాన్వీ

ఇక్కడున్న జాన్వీ కపూర్ ఫోటో చూశారుగా.. ఎంత గ్లామరస్‌గా ఉన్నారో కదా. ఈ బ్యూటీ తెలుగు తెరపై కనిపించే సమయం ఆసన్నమైంది. అయితే ఆమె తెలుగు ఎంట్రీ ఇక్కడ ఫోటోలో కనిపించేంత గ్లామరస్‌గా మాత్రం ఉండదట. ఇంతకీ విషయం ఏంటంటే... 'దేవర' చిత్రంతో జాన్వీ తెలుగు చలన చిత్ర పరిశ్రమకు పరిచయం అవుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో మత్స్యకారుల కుటుంబానికి చెందిన యువతిగా, డీ గ్లామరస్‌గా జాన్వీ పాత్ర ఉంటుందని ప్రచారం జరుగుతోంది. కాగా జాన్వీ పాత్రలో కొద్దిపాటి యాక్షన్ సన్నివేశాలు కూడా ఉన్నాయని తెలిసింది. 'దేవర' షూటింగ్‌లో ఆల్రెడీ జాన్వీ కపూర్ పాల్గొన్నారు. ఆ షెడ్యూల్‌లో ఆమెపై చిన్నపాటి యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరిగిందని సమాచారం. మళ్లీ సెప్టెంబరులో జరిగే 'దేవర' షెడ్యూల్‌లో పాల్గొననున్నట్లుగా జాన్వీ కపూర్ ఇటీవల ఓ సందర్భంలో పేర్కొన్నారు. ఇక 'జనతా గ్యారేజ్' తర్వాత ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ తెరకెక్కిస్తున్న 'దేవర' చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 5న రిలీజ్ కానుంది. ఈ చిత్రాన్ని కె. హరికృష్ణ, కల్యాణ్‌రామ్, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్నారు.

వాస్తవ ప్రేమకథ



● ఆముద శ్రీనివాస్, శ్రవణ్‌కుమార్

ఆముద శ్రీనివాస్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'నా.. నీ ప్రేమకథ'. కారుణ్య చౌదరి హీరోయిన్‌గా నటించారు. పోత్నాక్ శ్రవణ్‌కుమార్ నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో ఆముద శ్రీనివాస్ మాట్లాడుతూ– ''వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కించిన చిత్రం ఇది. పేపర్‌బాయ్, డాక్టర్‌ల ప్రేమకథ ఈ చిత్రం. ప్రేమ ఎలా అయినా పుట్టొచ్చు అనే అంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం'' అన్నారు. ''చాలా మంచి సినిమా. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు పోత్నాక్ శ్రవణ్‌కుమార్. ఈ కార్యక్రమంలో నిర్మాతలు ప్రసన్న కుమార్, ప్రతాని రామకృష్ణ గౌడ్, శోభారాణి మాట్లాడారు.

రీల్స్

ఘోస్ట్.. డేట్ ఫిక్స్



● శివ రాజ్‌కుమార్

కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్ అక్టోబర్‌లో 'ఘోస్ట్' సినిమాతో థియేటర్లకు రానున్నారు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'ఘోస్ట్'. శ్రీని (బీర్బల్) దర్శకత్వంలో సందేశ్ నాగరాజ్ పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాని నిర్మించారు. ఈ చిత్రాన్ని తెలుగు, కన్నడ, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో అక్టోబర్ 19న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ''హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా 'ఘోస్ట్' రూపొందింది. అక్టోబర్ రెండో వారం నుంచి దేశవ్యాప్తంగా ఈ సినిమా స్పెషల్ ప్రీమియర్స్ ప్లాన్ చేస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.


యాక్షన్ థ్రిల్లర్



● విక్రాంత్

విక్రాంత్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'స్పార్క్ ఎల్.ఐ.ఎఫ్.ఈ'. మెహరీన్, రుక్సార్ థిల్లాన్ హీరోయిన్లుగా నటించారు. విక్రాంత్ డెఫ్ ఫ్రాగ్ ప్రొడక్షన్స్‌పై రూపొందుతోన్న ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా హీరో–డైరెక్టర్ విక్రాంత్ మాట్లాడుతూ– ''సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. భావోద్వేగాలు, ప్రేమ, భారీ ఫైట్స్‌తో ఈ మూవీ రూపొందింది. ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ అనుభూతినిచ్చే సినిమా ఇది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో నవంబర్ 17న ఈ సినిమాని రిలీజ్ చేస్తాం'' అన్నారు.

జీవితం ఇంతందంగా ఉంది



● తన్వి, దీపక్

బాలనటుడిగా పలు సినిమాల్లో నటించిన దీపక్ సరోజ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'సిద్ధార్థ్ రాయ్'. ఈ చిత్రాన్ని వి. యశస్వి దర్శకత్వంలో జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన నిర్మిస్తున్నారు. రధన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'లైఫ్ ఈజ్ దిస్ బ్యూటిఫుల్..' (జీవితం ఇంతందంగా ఉంది) అంటూ సాగే పాటని నిర్మాత 'దిల్' రాజు విడుదల చేసి, పాట బాగుందని యూనిట్‌ని అభినందించారు. వి. యశస్వి సాహిత్యం అందించిన ఈ పాటని కార్తీక్, శ్రీనిషా జయశీలన్ పాడారు. తన్వి నేగి, నందిని, ఆనంద్, కల్యాణీ నటరాజన్, మాథ్యూ వర్గీస్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ కె. నాయుడు, లైన్ ప్రొడ్యూసర్: బి. శ్యామ్ కుమార్.

గల్లీ క్రికెట్



● సరోజ్‌కుమార్

బండి సరోజ్ కుమార్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహించనున్న చిత్రం 'పరాక్రమం'. బీఎస్‌కే మెయిన్ స్ట్రీమ్ పతాకంపై రూపొందనున్న ఈ చిత్రం ప్రీ టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. బండి సరోజ్ కుమార్ మాట్లాడుతూ– ''గోదావరి జిల్లాలో లంపకలోవ గ్రామంలోని లోవరాజు అనే యువకుడి జీవితంలో జరిగే గల్లీ క్రికెట్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. ప్రేమ, నాటక రంగ జీవితం, రాజకీయం.. వంటి అంశాలు ఉంటాయి. సెప్టెంబర్, అక్టోబర్‌లో షూటింగ్ పూర్తి చేసి, వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న సినిమా రిలీజ్ చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కథ, ఎడిటర్, సంగీతం, నిర్మాణం–దర్శకత్వం: బండి సరోజ్ కుమార్.

సాక్షి బిజినెస్
శనివారం
26-8-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
366	121
64,887	19,266

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	13,483	▲	18
డోజోన్స్	34,211	▲	111
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,339	▲	5
డాక్స్	15,632	▲	10
షాంఘై	3,083	▲	1
నికాయ్	31,624	▽	663

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్)	58,200
బంగారం (22 క్యారెట్)	55,430
వెండి (కిలో)	79,500

పేటీఎమ్‌లో వాటా విక్రయం

20.21 శాతానికి తగ్గిన యాంట్ గ్రూప్ వాటా

న్యూఢిల్లీ: చైనా ఫిన్‌టెక్ దిగ్గజం యాంట్ గ్రూప్ తాజాగా దేశీ డిజిటల్ పేమెంట్స్ దిగ్గజం వన్‌97 కమ్యూనికేషన్స్‌లో 3.58 శాతం వాటాను విక్రయించింది. అనుబంధ సంస్థ ద్వారా మొత్తం 2,27,54,823 షేర్లను దశలవారీగా అమ్మివేసింది. కంపెనీ ఈక్విటీలో 3.58 శాతం వాటాకు సమానమైన వీటిని ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి రూ. 895.2 సగటు ధరలో విక్రయించింది. వెరసి యాంట్‌ఫిన్(నెదర్లాండ్స్) హోల్డింగ్ బీవీ ద్వారా పేటీఎమ్ బ్రాండు కంపెనీ వన్‌97లో రూ. 2,037 కోట్ల విలువైన వాటాను సొమ్ము చేసుకుంది. తాజా లావాదేవీ కారణంగా పేటీఎమ్‌లో యాంట్ గ్రూప్ వాటా 23.79 శాతం నుంచి 20.21 శాతానికి తగ్గింది.

బీఎస్‌ఈలో పేటీఎమ్ షేరు 0.5 శాతం క్షీణించి రూ. 899 వద్ద ముగిసింది.

జియో ఫిన్‌లో మోతీలాల్‌కు వాటా

3.72 కోట్ల షేర్ల కొనుగోలు

న్యూఢిల్లీ: జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లను తాజాగా మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ కొనుగోలు చేసింది. వారాంతాన ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా 3.72 కోట్ల షేర్లను సొంతం చేసుకుంది. ఇందుకు షేరుకి రూ. 202.8 సగటు ధరలో రూ. 754.41 కోట్లు వెచ్చించింది. ఎన్ఎస్ఈ బల్క్ డీల్ గణాంకాల ప్రకారం జియో ఫైనాన్షియల్ ఈక్విటీలో 0.6 శాతం వాటాను మోతీలాల్ ఓస్వాల్ ఫండ్ కొనుగోలు చేసింది. లిస్టింగ్ నాటి (సోమవారం) నుంచి వరుస నష్టాలను చవిచూస్తున్న జియో ఫైనాన్సియల్ సర్వీసెస్ షేరు తొలిసారి శుక్రవారం స్వల్ప లాభంతో గట్టెక్కింది. ట్రేడింగ్‌లో వరుసగా అయిదో రోజూ 5% నష్టపోయి రూ.203 వద్ద లోయర్ సర్క్యూట్‌ను తాకింది. అయితే చివర్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో కోలుకొని అరశాతం స్వల్ప లాభంతో రూ.214.50 వద్ద నిలిచింది.

జీఆర్‌టీ జ్యువెలర్స్‌కు ప్రతిష్టాత్మక గుర్తింపు

జీజేఈపీసీ ఇండస్ట్రీ లెజెండ్ అవార్డు



హైదరాబాద్: ప్రముఖ జ్యువెలర్స్ సంస్థ జీఆర్‌టీ జ్యువెలర్స్‌ను ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. జ్యువెలరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్(జీజేఈపీసీ) ఇండస్ట్రీ లెజెండ్ అవార్డు లభించింది. గత అరవై ఏళ్లగా శ్రేష్టమైన, సృజనాత్మక ఆభరణాల కోసం అలుపెరగకుండా మేము చేస్తున్న కృషికి దక్కిన గౌరవం ఈ అవార్డు అని సంస్థ ఎండీ ఆనంద్ అనంత్ పద్మనాభన్ అన్నారు. ''వినియోగదారులు ఆనందంగా ఉంటే విజయం తప్పక లభిస్తుంది అని నమ్మి, అది సాధించడానికి మనసుపెట్టి పనిచేసిన దానికి ఇది రుజువు. మా కస్టమర్లకు, జీఆర్‌టీ కుటుంబ సభ్యులకు అవార్డును అంకితం చేస్తున్నాము'' అని కంపెనీ మరో ఎండీ జీఆర్ రాధాకృష్ణన్ తెలిపారు.

ధరల కట్టడికే కేంద్రం ప్రాధాన్యత

ఆర్థిక మంత్రి సీతారామన్



బీ20 సదస్సుకు విచ్చేసిన ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో బీ20 ఇండియా చెయిర్, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్, సీఐఐ ప్రెసిడెంట్ ఆర్ దినేష్

న్యూఢిల్లీ: సుస్థిర ఆర్థిక వృద్ధి సాధించే దిశగా ధరలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఆగస్టు 31న విడుదల కాబోయే తొలి త్రైమాసిక జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి) గణాంకాలు మెరుగ్గా ఉండగలవని ఆశిస్తున్నట్లు బీ20 సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆమె చెప్పారు. టమాటాలు, ఇతర కూరగాయల ధరలు ఎగియడంతో జూలైలో రిటైల్ ద్రవ్యోల్బణం 15 నెలల గరిష్ట స్థాయి 7.44 శాతానికి చేరిన నేపథ్యంలో మంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు, ఆర్థిక సంస్కరణల అమలును ప్రభుత్వం వేగవంతం చేస్తోందని నిర్మలా సీతారామన్ చెప్పారు. పెట్టుబడులకు ప్రభుత్వం బడ్జెట్‌లో గణనీయంగా కేటాయింపులు చేయడంతో ప్రైవేట్ రంగం నెమ్మదిగా ఇన్వెస్ట్ చేయడం ప్రారంభిస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయన్నారు.

ఏఐతో మరిన్ని ఉద్యోగాలు: చంద్రశేఖరన్

పైస్థాయి ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు అంతగా లేని వారికి కూడా కృత్రిమ మేధ (ఏఐ) తగు సాధికారత కల్పించగలదని బీ20 ఇండియా చెయిర్, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ చెప్పారు. ఏఐ నియంత్రణకు సంబంధించి లక్ష్యాలు, సూత్రాలపై స్పష్టత అవసరమని టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ప్రెసిడెంట్ బ్రాడ్ స్మిత్ అభిప్రాయపడ్డారు. ఏఐతో ఉత్పాదకత మరింత పెరగగలదని ఐబీఎం సీఈవో అరవింద్ కృష్ణ చెప్పారు. జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (జీఐ) ప్రయోజనాలను పూర్తి స్థాయిలో కనుగొనేందుకు వాటిని ఉపయోగించే సంస్థలు స్వీయ నియంత్రణను పాటించాల్సి ఉంటుందని మాస్టర్‌కార్డ్ సీఈవో మీబాక్ అభిప్రాయపడ్డారు. భారత్ తీర్చిదిద్దిన డిజిటల్ మౌలిక సదుపాయాలకు తాను అభిమానిగా మారానని ఎడోబ్ సీఈవో శంతను నారాయణ్ చెప్పారు.

ఎలక్ట్రిక్ కార్ తెస్తున్నాం: సజ్జన్ జిందాల్

జేఎస్‌డబ్ల్యు గ్రూప్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ విభాగంలోకి ఎంట్రీ ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకోసం ఎంజీ మోటార్ ఇండియాతో చర్చలు జరుపుతోంది. ఈ ప్రణాళిక కార్యరూపంలోకి రాకపోతే సొంతంగానూ ఎలక్ట్రిక్ కార్లను అభివృద్ధి చేయడానికి కసరత్తు చేస్తున్నట్లు జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ బీ20 సమ్మిట్‌లో పేర్కొన్నారు.

19,300 దిగువకు నిఫ్టీ

- సెన్సెక్స్ నష్టం 366 పాయింట్లు
- వడ్డీ రేట్ల పెంపు ఆందోళనలు



ముంబై: వడ్డీ రేట్ల పెంపు ఆందోళనలు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని బలహీన ప్రతికూలతల ప్రభావంతో స్టాక్ సూచీలు రెండో రోజూ నష్టపోయాయి. జాక్సన్ హోల్ ఎకనామిక్ సింపోజియంలో యూఎస్ ఫెడ్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ప్రసంగానికి ముందు అప్రమత్తత చోటు చేసుకుంది. ఉదయం సెన్సెక్స్ 251 పాయింట్ల నష్టంతో 65,001 వద్ద, నిఫ్టీ 90 పాయింట్ల పతనమై 19,297 వద్ద మొదలయ్యాయి. సూచీలు రోజంతా నష్టాల్లోనే కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 519 పాయింట్లు క్షీణించి 64,732 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. నిఫ్టీ సైతం 157 పాయింట్లు కోల్పోయి 19,297 స్థాయికి దిగివచ్చింది. సెన్సెక్స్ 366 పాయింట్లు నష్టపోయి 64,887 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 121 పాయింట్లు క్షీణించి 19,266 వద్ద నిలిచింది. ఇన్వెస్టర్లు రూ.1,414 కోట్ల షేర్లను కొన్నారు. రూపాయి విలువ 13 పైసలు క్షీణించి 82.69 స్థాయి వద్ద స్థిరపడింది. వరుసగా అయిదో వారమూ సూచీలు నష్టాలు మూటగట్టుకున్నాయి. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 61 పాయింట్లు, నిఫ్టీ 44 పాయింట్లు చొప్పున నష్టపోయాయి.

- కంపెనీ ఎండీ, సీఈవో వేణుగోపాల్ జీ నాయర్ రాజీనామా ప్రకటనతో బీఎస్ఈలో షాపర్స్ స్టాప్ షేరు 13% నష్టపోయి 709 వద్ద ముగిసింది. రాజీనామా ఈ ఆగస్టు 31 తర్వాత నుంచి అమల్లోకి రానుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-8-2023	
విశాఖ	480-00
చిత్తూరు	503-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475-00
విజయవాడ	475-00
రిటైల్ ధర (డజను)	72.00
25-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	435-00
వరంగల్	437-00
రిటైల్ ధర	4.95

30 శాతానికి మార్కెట్ వాటా

తెలుగు రాష్ట్రాల్లో గోద్రెజ్ ఇంటీరియో ప్రణాళిక



దేవ్ సర్కార్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫర్నిచర్, ఇంటీరియర్స్ సర్వీసుల సంస్థ గోద్రెజ్ ఇంటీరియో 2026 ఆర్థిక సంవత్సరానికల్లా తెలుగు రాష్ట్రాల్లో తమ మార్కెట్ వాటాను 30 శాతానికి, ఆదాయాన్ని రూ. 100 కోట్లకు పెంచుకోవాలని నిర్దేశించుకుంది. ప్రస్తుతం మార్కెట్ వాటా 25 శాతంగాను, ఆదాయాలు సుమారు రూ. 70 కోట్లుగాను ఉన్నాయి. అలాగే అప్పటికల్లా దక్షిణాది మార్కెట్లో ఆదాయాన్ని రూ. 275 కోట్ల నుంచి రూ. 350 కోట్లకు పెంచుకోనున్నట్లు సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (బీ2సీ విభాగం) దేవ్ సర్కార్ విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 40 ఔట్‌లెట్స్ ఉండగా, రాబోయే ఆరు నెలల్లో మరో 25 పైచిలుకు స్టోర్స్‌ను తెరవనున్నట్లు ఆయన చెప్పారు. పలు రియల్ ఎస్టేట్ సంస్థలతో కూడా జత కట్టినట్లు పేర్కొన్నారు. ఫర్నిచర్ కోసం తెలుగు రాష్ట్రాల్లో ఆన్‌లైన్‌లో ఆర్డరు చేసే ధోరణి గణనీయంగా ఉంటోందన్నారు.

యూనికార్న్‌గా జెప్టో



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆన్‌లైన్ గ్రాసరీ కంపెనీ జెప్టో తాజాగా రూ.1,653 కోట్ల నిధులను సమీకరించింది. యూఎస్‌కు అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ స్టెప్‌స్టోన్ గ్రూప్, గుడ్ వాటర్ క్యాపిటల్, ప్రస్తుత ఇన్వెస్టర్ల నుంచి ఈ మొత్తాన్ని అందుకుంది. తాజా డీల్ ద్వారా జెప్టోను రూ.11,580 కోట్లుగా విలువ కట్టారు. తద్వారా యూనికార్న్ జాబితాలో జెప్టో చేరిపోయింది. ఈ జాబితాలో 2023లో చోటు సంపాదించుకున్న తొలి స్టార్టప్ ఇదే. భారత కంపెనీల్లో 11 నెలల విరామం తరువాత యూనికార్న్‌గా జెప్టో అవతరించింది.

ఐహెచ్‌హెచ్ చేతికి గ్లెనీగల్స్ గ్లోబల్ హాస్పిటల్స్

డీల్ విలువ రూ.740 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వైద్య సేవల్లో ఉన్న గ్లెనీగల్స్ గ్లోబల్ హాస్పిటల్స్ పూర్తిగా ఐహెచ్‌హెచ్ హెల్త్‌కేర్ పరం కానుంది. రవీంద్రనాథ్ జీఈ మెడికల్ అసోసియేట్స్‌లో రవీంద్రనాథ్ కంచర్ల, ఇతరులకు ఉన్న మిగిలిన వాటాను కొనుగోలు చేసేందుకు మలేషియాకు చెందిన హాస్పిటల్స్ చెయిన్ ఐహెచ్‌హెచ్ హెల్త్‌కేర్ అనుబంధ కంపెనీ గ్లెనీగల్స్ డెవలప్‌మెంట్ చేతులు కలిపింది. డీల్ విలువ రూ.740 కోట్లు. డిసెంబరుకల్లా కొనుగోలు ప్రక్రియ పూర్తి కానుంది. ఐహెచ్‌హెచ్ 2015లో రూ.1,284 కోట్లు వెచ్చించి గ్లోబల్ హాస్పిటల్స్‌లో 73.4 శాతం వాటాను దక్కించుకుంది. డాక్టర్ రవీంద్రనాథ్ 1999లో గ్లోబల్ హాస్పిటల్స్‌ను ప్రారంభించారు. సంస్థకు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబైలో మొత్తం ఆరు ఆసుపత్రులు ఉన్నాయి. పడకల సామర్థ్యం 1,500 ఉంది. ఐహెచ్‌హెచ్ 10 దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది.

ఆసియా క్రీడలకు 634 మంది

చైనాలో హాంగ్జూలో సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 8 వరకు జరిగే ఆసియా క్రీడలకు భారత్ 634 మందితో భారీ బృందాన్ని పంపించనుంది. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ 38 క్రీడాంశాల్లో ఈ బృందానికి అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. 2018లో జకార్తాలో జరిగిన ఆసియా క్రీడల్లో భారత్ నుంచి 572 మంది పాల్గొన్నారు.

14

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు గెలిచిన పతకాల సంఖ్య. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు (1 స్వర్ణం, 2 రజతాలు, 2 కాంస్యాలు), సైనా నెహ్వాల్ (1 రజతం, 1 కాంస్యం), పురుషుల సింగిల్స్‌లో ప్రకాశ్ పదుకొనే (1 కాంస్యం), సాయిప్రణీత్ (1 కాంస్యం), కిడాంబి శ్రీకాంత్ (1 రజతం), లక్ష్య సేన్ (1 కాంస్యం), గుత్తా జ్వాల-అశ్విని పొన్నప్ప (1 కాంస్యం), సాత్విక్-చిరాగ్ శెట్టి (1 కాంస్యం) ఈ జాబితాలో ఉన్నారు. ప్రణయ్ సెమీస్‌లో ఓడితే కాంస్య పతకం దక్కుతుంది. ఫైనల్ చేరి గెలిస్తే స్వర్ణ పతకం, ఓడితే రజత పతకం లభిస్తుంది. 2011 నుంచి ప్రతి ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనూ భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు పతకాలు సాధిస్తుండటం విశేషం.

నీరజ్ మెరిసె...

మొదటి ప్రయత్నంలోనే ఫైనల్ బెర్త్ ఖరారు

పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత ● మను, కిశోర్ కూడా ఫైనల్‌కు
తొలిసారి ఒకే ఈవెంట్ ఫైనల్లో ముగ్గురు భారత అథ్లెట్లు



మను



కిశోర్



నీరజ్

బుడాపెస్ట్ (హంగేరి): కొన్నేళ్లుగా అంతర్జాతీయ అథ్లెటిక్స్ వేదికపై భారత ముఖచిత్రంగా మారిన జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మరోసారి తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయలేదు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకమే లక్ష్యంగా బరిలోకి దిగిన నీరజ్ చోప్రా తొలి అడ్డంకిని విజయవంతంగా అధిగమించాడు. శుక్రవారం జరిగిన క్వాలిఫయింగ్‌లో నీరజ్ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టాడు. తన మొదటి ప్రయత్నంలోనే ఈటెను ఏకంగా 88.77 మీటర్ల దూరం విసిరిన నీరజ్ ఆదివారం జరిగే ఫైనల్‌కు అర్హత సాధించాడు. అంతేకాకుండా పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రమాణాన్ని (85.50 మీటర్లు) కూడా దాటేసి వచ్చే ఏడాది జరిగే విశ్వ క్రీడలకు బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. శుక్రవారం జరిగిన క్వాలిఫయింగ్‌లో 12 మంది బరిలో ఉన్న గ్రూప్ 'ఎ'లో నీరజ్ పోటీపడ్డాడు. మైదానంలోని అభిమానులు ఉత్సాహపరుస్తుండగా నీరజ్ జావెలిన్‌ను 88.77 మీటర్ల దూరం విసిరి ఒక్క త్రోతో రెండు లక్ష్యాలను సాధించాడు. జావెలిన్‌ను 83 మీటర్ల దూరం విసిరిన వారు నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తారు లేదా టాప్-12లో నిలిచిన వారికి ఫైనల్ చేరే అవకాశం లభిస్తుంది. నీరజ్ తప్ప గ్రూప్ 'ఎ' నుంచి మరెవరూ నేరుగా ఫైనల్ చేరలేకపోయారు. గ్రూప్ 'ఎ'లోనే పోటీపడ్డ మరో భారత అథ్లెట్ డీపీ మనూ (81.31 మీటర్లు)... గ్రూప్ 'బి'లో బరిలో నిలిచిన కిశోర్ కుమార్ జేనా (80.55 మీటర్లు) కూడా ఫైనల్‌కు చేరారు. ఓవరాల్‌గా మనూ ఆరో స్థానంలో, కిశోర్ తొమ్మిదో స్థానంలో నిలిచారు. ఫలితంగా ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో తొలిసారి ఒకే ఈవెంట్‌లో ముగ్గురు భారత అథ్లెట్లు ఫైనల్లో పోటీపడనున్నారు. నీరజ్‌తోపాటు అర్షద్ నదీమ్ (పాకిస్తాన్; 86.79 మీటర్లు), జాకుబ్ వాద్లెచ్ (చెక్ రిపబ్లిక్; 83.50 మీటర్లు) మాత్రమే క్వాలిఫయింగ్ మార్క్‌ను అధిగమించి నేరుగా ఫైనల్ చేరారు. డిఫెండింగ్ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా; 78.49 మీటర్లు) ఓవరాల్‌గా 16వ స్థానంలో నిలిచి ఫైనల్ చేరలేకపోయాడు.

ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్, ఆసియా చాంపియన్‌షిప్, టోక్యో ఒలింపిక్స్, డైమండ్ లీగ్ మీట్ లాంటి ప్రతిష్టాత్మక ఈవెంట్స్‌లో స్వర్ణ పతకాలు గెలిచిన 25 ఏళ్ల నీరజ్ ఖాతాలో ప్రపంచ చాంపియన్‌షిప్ స్వర్ణ పతకం మాత్రమే చేరాల్సి ఉంది. గత ఏడాది అమెరికాలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఈ హరియాణా జావెలిన్ త్రోయర్ రెండో స్థానంలో నిలిచి రజత పతకం గెల్చుకున్నాడు. అంతా అనుకున్నట్లు జరిగితే ఆదివారం జరిగే ఫైనల్లో నీరజ్‌ను ఈసారి విశ్వవిజేతగా చూడవచ్చు.

ప్రణయ్ ప్రతాపం

ప్రపంచ నంబర్‌వన్, వరల్డ్ చాంపియన్, ఒలింపిక్స్ విజేత అక్సెల్‌సన్‌పై సంచలన విజయం
తొలిసారి సెమీస్‌లోకి ● ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పతకం ఖరారు

దశాబ్దకాలంగా భారత అగ్రశ్రేణి షట్లర్‌గా కొనసాగుతున్న హెచ్ఎస్ ప్రణయ్ ఎట్టకేలకు విశ్వవేదికపై తన సత్తా చాటుకున్నాడు. అత్యంత ప్రతిభావంతుడైనప్పటికీ నిలకడలేమితో ఇన్నాళ్లూ అందని ద్రాక్షగా ఊరించిన ప్రపంచ చాంపియన్‌షిప్ పతకం తొలిసారి ప్రణయ్ మెడలో పడనుంది. 2021, 2022 ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగి పతకానికి చేరువై దూరమైన ఈ కేరళ స్టార్ మూడో ప్రయత్నంలో మాత్రం అసాధారణ ఆటతీరుతో సక్సెస్ సాధించాడు. ప్రపంచ నంబర్‌వన్, టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత, ప్రపంచ చాంపియన్, యూరోపియన్ చాంపియన్ అయిన డెన్మార్క్ స్టార్ విక్టర్ అక్సెల్‌సన్‌ను అతని సొంతగడ్డపైనే ఓడించి ప్రణయ్ తన కెరీర్‌లోనే చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నాడు. ఈ మెగా ఈవెంట్‌లో తొలిసారి సెమీఫైనల్ చేరిన ప్రణయ్ కనీసం కాంస్య పతకాన్ని ఖరారు చేసుకున్నాడు.



ప్రణయ్



అక్సెల్‌సన్

కోపెన్‌హాగెన్ (డెన్మార్క్): ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న భారత స్టార్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ మరో అద్భుతం చేశాడు. ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాన్ని ఖరారు చేసుకున్నాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ ప్రణయ్ 13-21, 21-15, 21-16తో టాప్ సీడ్ విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్)ను ఓడించాడు. నేడు జరిగే సెమీఫైనల్లో కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్)తో ప్రణయ్ ఆడతాడు.

అక్సెల్‌సన్‌తో 68 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో ప్రణయ్ తొలి గేమ్‌ను చేజార్చుకున్నా నిరాశపడకుండా పట్టుదలతో ఆడి వరుసగా రెండు గేమ్‌లు గెలిచి ముందంజ వేశాడు. సొంతగడ్డపై జరుగుతున్న మెగా ఈవెంట్‌లో ప్రణయ్ ధాటికి అక్సెల్‌సన్‌కు అనూహ్య పరాజయం తప్పలేదు. తొలి గేమ్ కోల్పోయిన ప్రణయ్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, మరో కోచ్ గురుసాయిదత్ సూచనలతో తన వ్యూహం మార్చుకున్నాడు. సుదీర్ఘ ర్యాలీలు ఆడుతూ, అడపాదడపా కళ్లు చెదిరే స్మాష్‌లతో ప్రణయ్ ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టి అనవసర తప్పిదాలు చేసేలా చేశాడు. రెండో గేమ్‌లో స్కోరు 13-10 వద్ద ప్రణయ్ వరుసగా నాలుగు పాయింట్లు గెలిచి 17-10తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అదే ఊపులో రెండో గేమ్‌ను సొంతం చేసుకొని మ్యాచ్‌లో నిలిచాడు. మూడో గేమ్‌లోనూ ప్రణయ్ దూకుడు కొనసాగిస్తూ అక్సెల్‌సన్‌పై ఒత్తిడి పెంచాడు. స్కోరు 7-6 వద్ద ప్రణయ్ ఒక్కసారిగా చెలరేగి వరుసగా ఐదు పాయింట్లు నెగ్గి 13-6తో ముందంజ వేశాడు. ఆ తర్వాత అక్సెల్‌సన్ తేరుకునే ప్రయత్నం చేసినా ప్రణయ్ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఆడుతూ విజయం అందుకున్నాడు.

సాత్విక్-చిరాగ్ జోడీ ఓటమి

పురుషుల డబుల్స్ విభాగం నుంచి ప్రపంచ రెండో ర్యాంక్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) నిష్క్రమించింది. క్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ ద్వయం 18-21, 19-21తో ప్రపంచ 11వ ర్యాంక్ జంట కిమ్ అస్ట్రుప్-ఆండెర్స్ స్కారప్ రస్ముసెన్ (డెన్మార్క్) చేతిలో పోరాడి ఓడిపోయింది. గత ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం నెగ్గి చరిత్ర సృష్టించిన సాత్విక్-చిరాగ్ ద్వయం ఈసారి అలాంటి ఫలితాన్ని పునరావృతం చేయలేకపోయింది.

'ఇంకా ఎన్నో గెలవాలి'

ప్రజ్ఞానంద ప్రదర్శనపై తల్లి వ్యాఖ్య



బాకు (అజర్‌బైజాన్): ప్రపంచకప్‌లో ఫైనల్ చేరిన సంచలనం సృష్టించిన భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద ప్రదర్శనపై అతని తల్లి నాగలక్ష్మి సంతోషం వ్యక్తం చేసింది. అతని కెరీర్ ఆరంభం నుంచి అన్నింటా తోడుగా ఉంటూ వచ్చిన నాగలక్ష్మి వరల్డ్ కప్‌లోనూ ప్రజ్ఞానంద వెన్నంటే నిలిచింది. అతను ఫైనల్ చేరడంతో పాటు క్యాండిడేట్స్ టోర్నీకి కూడా అర్హత సాధించడం గొప్పగా అనిపిస్తోందన్న ఆమె... తన కొడుకు ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉందని వ్యాఖ్యానించింది. 'ప్రపంచకప్‌లో ప్రజ్ఞానంద ఫైనల్ వరకు రావడం చాలా సంతోషంగా ఉంది. పైగా క్యాండిడేట్స్‌కు అర్హత సాధించడం దానిని రెట్టింపు చేసింది. అతను ముందుముందు మరిన్ని విజయాలు సాధించాలి. అర్జున్‌తో క్వార్టర్ ఫైనల్ జరుగుతున్నప్పుడు ప్రజ్ఞ ఏం చేస్తున్నాడనే ఉత్కంఠతోనే అలా చూస్తూ ఉండిపోయాను. అప్పుడే నాకు తెలియకుండా కొందరు నా ఫోటోలు తీశారు. అవే జనంలోకి వెళ్లాయి. చివరకు ఆ మ్యాచ్‌లో మా అబ్బాయి గెలిచాడు' అని నాగలక్ష్మి గుర్తు చేసుకుంది.

ఫైనల్లో కోస్టల్ రైడర్స్

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ టి20 క్రికెట్ టోర్నీ రెండో సీజన్‌లో కోస్టల్ రైడర్స్ జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. రాయలసీమ కింగ్స్, కోస్టల్ రైడర్స్ జట్ల మధ్య క్వాలిఫయర్-1 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. దాంతో లీగ్ దశలో అగ్రస్థానంలో నిలిచిన కోస్టల్ రైడర్స్ జట్టు ఫైనల్ చేరింది. రాయలసీమ కింగ్స్, గోదావరి టైటాన్స్ మధ్య నేడు జరిగే క్వాలిఫయర్-2లో గెలిచిన జట్టు ఆదివారం జరిగే ఫైనల్లో కోస్టల్ రైడర్స్ జట్టుతో ఆడుతుంది. శుక్రవారం జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో గోదావరి టైటాన్స్ ఏడు వికెట్లతో ఉత్తరాంధ్ర లయన్స్‌పై నెగ్గింది.

ఒక్కో అంతర్జాతీయ మ్యాచ్‌కు రూ.4.20 కోట్లు!

బీసీసీఐ టైటిల్ స్పాన్సర్‌షిప్ హక్కులు చేజిక్కించుకున్న ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్

ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఖాతాలో కొత్త టైటిల్ స్పాన్సర్‌షిప్ ద్వారా వచ్చే మూడేళ్లలో రూ. 235 కోట్లు చేరనున్నాయి. ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్ అయిన 'ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్' బోర్డు మ్యాచ్‌ల టైటిల్ స్పాన్సర్‌షిప్ హక్కులు సొంతం చేసుకుంది. బీసీసీఐ నిర్వహించబోయే అంతర్జాతీయ (సీనియర్ పురుషుల, మహిళల) మ్యాచ్‌లతో పాటు దేశవాళీ టోర్నీలు, అండర్-19, అండర్-23 టోర్నీలకు ఈ హక్కులు వర్తిస్తాయి. కొత్త ఒప్పందం ప్రకారం ఐడీఎఫ్‌సీ ఒక్కో అంతర్జాతీయ మ్యాచ్‌కు బీసీసీఐకి రూ. 4 కోట్ల 20 లక్షలు చెల్లిస్తుంది. మూడేళ్ల వ్యవధిలో మొత్తం 56 అంతర్జాతీయ మ్యాచ్‌లు జరుగుతాయి. వచ్చే నెలలో ఆస్ట్రేలియాతో జరిగే మూడు వన్డేల సిరీస్‌తో మొదలయ్యే ఒప్పందం 2026 ఆగస్టు వరకు అమల్లో ఉంటుంది. తాజా ఒప్పందానికి ముందు వరకు 'మాస్టర్ కార్డ్' ఒక్కో మ్యాచ్‌కు రూ.3 కోట్ల 80 లక్షలు చెల్లించింది.

భారత షూటర్లకు 4 పతకాలు

బాకు: ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో శుక్రవారం భారత్‌కు నాలుగు పతకాలు దక్కాయి. మహిళల 50 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో టియానా, సాక్షి సూర్యవంశీ, కిరణ్‌దీప్ కౌర్‌లతో కూడిన భారత బృందం 1573 పాయింట్లతో పసిడి పతకం గెలిచింది. వ్యక్తిగత విభాగంలో టియానా 533 పాయింట్లతో కాంస్య పతకాన్ని గెల్చుకుంది. పురుషుల 50 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో రవీందర్ సింగ్, విక్రమ్ షిండే, కమల్జీత్ బృందం 1646 పాయింట్లతో కాంస్యం కైవసం చేసుకుంది. వ్యక్తిగత విభాగంలో రవీందర్ సింగ్ 556 పాయింట్లతో కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు.

క్లుప్తంగా...

ఐఎంఎస్ స్కామ్‌లో ఈడీ చార్జిషీట్ నమోదు

మాజీ డైరెక్టర్ దేవికారాణి సహా 15 మంది నిందితులు

సాక్షి, హైదరాబాద్: ఐఎంఎస్ (ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్) స్కామ్‌లో మనీలాండరింగ్‌పై దర్యాప్తు చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు శుక్రవారం చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద రూ.211 కోట్ల ఐఎంఎస్ మోసంపై ఈడీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో కీలక నిందితురాలు, అప్పటి ఐఎంఎస్ డైరెక్టర్ డాక్టర్ దేవికారాణితో పాటు పలు ఔషధసంస్థల ప్రతినిధులు, ఫార్మా కంపెనీల యజమానులు సహా 15మంది నిందితులపై అభియోగాలు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా రూ.144 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ ఇప్పటికే జప్తు చేసింది. తెలంగాణవ్యాప్తంగా ఉన్న డిస్పెన్సరీలు, ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ) ఆస్పత్రులకు మందులు, ఇతర సర్జికల్ కిట్‌ల సరఫరాలో ఆర్థిక అవకతవకలు, టెండర్ ప్రక్రియలో ఉల్లంఘనలపై ఏసీబీ నమోదు చేసిన ఎనిమిది ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ పీఎంఎల్ఏ కింద కేసు నమోదు చేసింది. దేవికారాణి, ఇతర ఐఎంఎస్ సిబ్బందితో కుమ్మక్కై బినామీసంస్థలతో పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టినట్టు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. డ్రగ్స్ సరఫరాదారులు కె.శ్రీహరిబాబు, పి.రాజేశ్వర్‌రెడ్డిలతో కలిసి ఏర్పాటుచేసిన బినామీ సంస్థలతో అన్ని నిబంధనలను ఉల్లంఘించారని చార్జిషీట్‌లో ప్రస్తావించారు. మరో కీలక నిందితురాలు ఐఎంఎస్ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ కె.పద్మ వైద్య శిబిరాల పేరుతో మందులు, సరుకులు స్వాహా చేశారన్నారు. డాక్టర్ రాణి, ఫార్మసిస్ట్ నాగలక్ష్మి, పీఎంజే జ్యువెలర్స్‌తో కలిసి కుట్ర పన్నారని, స్కామ్ డబ్బును ఉపయోగించి బిల్లులు లేకుండా దాదాపు రూ.6.3 కోట్ల విలువైన ఆభరణాలను కొనుగోలు చేశారని ఈడీ చార్జిషీట్‌లో ఆరోపించింది.

గోండి లిపిని గుర్తించాలి

రాష్ట్రపతికి జయధీర్ విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: ఆదివాసీ గుంజాల గోండి లిపిని భారత ప్రభుత్వం గుర్తించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆద్య కళా మ్యూజియం డైరెక్టర్ ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన రాష్ట్రపతి భవన్‌లో ముర్మును కలిసి తాము సేకరించిన ఆదివాసీ కళాఖండాలను సంరక్షించడంతోపాటు సాహిత్య రంగాల్లో రాణిస్తున్న ఆదివాసులకు తగు గౌరవం కల్పించేలా చొరవ తీసుకోవాలని జయధీర్ రాష్ట్రపతికి కోరారు.

జైతీర్థ్ జోషికి రాయల్ ఏరోనాటికల్ సొసైటీ ఫెలోషిప్



సాక్షి, హైదరాబాద్: నగరంలోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబొరేటరీ (డీఆర్‌డీఎల్) ప్రోగ్రాం డైరెక్టర్ జైతీర్థ్ ఆర్.జోషికి రాయల్ ఏరోనాటికల్ సొసైటీ ప్రతిష్టాత్మక ఫెలోషిప్ లభించింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ (ఐఐఎం)కి అందించిన విశేష కృషికి జైతీర్థ్ ఈ ఫెలోషిప్‌ను అందుకున్నారు.

సాంస్కృతిక సంబంధాల మెరుగుతోనే ఆర్థికవృద్ధి

నేడు వారణాసి జీ20 డిక్లరేషన్ ప్రకటన • జీ20 సదస్సులో కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డి

(వారణాసి నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

సాంస్కృతిక సంబంధాలు మెరుగుపడటం ద్వారా దేశాల మధ్య ఆర్థిక, దౌత్యపరమైన పురోభివృద్ధి సాధ్యమని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జీ.కిషన్‌రెడ్డి చెప్పారు. భారత్ నుంచి ఎన్నో విలువైన పురాతన విగ్రహాలు, వెలకట్టలేని అతి పురాతన విగ్రహాలు దేశం దాటి వెళ్లాయని, వాటిని తిరిగి భారత్‌కు తేవడానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. వారణాసిలో జరుగుతున్న జీ20 సాంస్కృతిక శాఖల మంత్రులు, అధికారుల సదస్సులో పాల్గొన్న అనంతరం ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 2014 ముందు ప్రభుత్వాలు విదేశాల నుంచి కేవలం 13 పురాతన విగ్రహాలను దేశానికి తిరిగి రప్పిస్తే,



మోదీ అధికారంలోకి వచ్చాక దాదాపు 400 పురాతన విగ్రహాలను రప్పించి ఆయా రాష్ట్రాలకు అప్పగించిన విషయాన్ని గుర్తు చేశారు. జీ20 సభ్య దేశాలు, ఆహ్వానిత దేశాలు, పలు అంతర్జాతీయ సంస్థలు ఈ సదస్సులో పాల్గొన్నాయని, అందరి సమ్మతితో శనివారం వారణాసి జీ20 డిక్లరేషన్ ప్రకటిస్తామని మంత్రి వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ సంస్కృతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం కోసం అధికారుల స్థాయిలో జరిగిన చర్చల్లో సానుకూల స్పందన వచ్చిందన్నారు. విలేకరుల సమావేశంలో ఆ శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖీ, ఆ శాఖ కార్యదర్శి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ టూరిజం క్లబ్స్‌దే కీలకపాత్ర

విద్యార్థుల్లో వివేకం పెంపొందించేందుకు యూత్ టూరిజం క్లబ్స్ కీలకపాత్ర పోషిస్తాయని కిషన్‌రెడ్డి అన్నారు. 'సాంస్కృతిక విరాసత్ స్పర్ధ -2023'లో భాగంగా యువ టూరిజం క్లబ్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. భారత భవిష్యత్తు అంతా విద్యార్థులదేనని, అందుకు అధ్యాపకులు, ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో అందిస్తున్న కృషి ఎనలేనిదన్నారు. 99 శాతం విద్యపై దృష్టి పెడితే.. కనీసం ఒక్క శాతమైనా పాఠ్యేతర అంశాలపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. స్పోర్ట్స్, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో గానీ, ఇతర సామాజిక సేవా కార్యక్రమాల్లో గానీ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో సేవా తత్పరతతోపాటు దేశం పట్ల అవగాహన పెంచే లక్ష్యంతోనే 'యువ టూరిజం క్లబ్స్'ను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతీ ఇంట్లో కుటుంబసమేతంగా పర్యాటక క్షేత్రాలను సందర్శించాలంటే.. ఎక్కడకు వెళ్లాలో నిర్ణయించేది ఆ కుటుంబంలోని చిన్నారులు, విద్యార్థులేనని అన్నారు. అందుకే వారికి దేశంలోని, సమీపంలోని పర్యాటక క్షేత్రాలపై, ప్లాస్టిక్ రహిత పర్యాటకాన్ని ప్రోత్సహించడంపై అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

గూగుల్ హ్యాక్ ఫర్ చేంజ్ విజేత 'టీమ్ అగ్రి హీరోస్'

ద నడ్జ్ ఇన్‌స్టిట్యూట్, టీ–హబ్ సంయుక్తంగా హ్యాకథాన్ నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: చిన్న, సన్నకారు రైతుల సమస్యల పరిష్కారానికి ఆండ్రాయిడ్ ఫోన్ ఆధారిత యాప్‌ను రూపొందించిన 'టీమ్ అగ్రిహీరోస్'.. గూగుల్ 'హ్యాక్ 4 చేంజ్'విజేతగా నిలిచింది. హైదరాబాద్‌కు చెందిన ఈ బృందం రూ.ఐదు లక్షల నగదు బహుమతి సాధించింది. 'ద నడ్జ్ ఇన్‌స్టిట్యూట్', టీ–హబ్ సంయుక్తంగా రెండు రోజుల పాటు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో నిర్వహించిన 'చర్చా–23'కార్యక్రమంలో భాగంగా ఈ హ్యాకథాన్ జరిగింది. దేశం మొత్తమ్మీద చిన్న, సన్నకారు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు ఆండ్రాయిడ్ అప్లికేషన్లను అభివృద్ధి చేయడం దీని లక్ష్యం కాగా.. మొత్తం 270 బృందాలు ఇందుకు దరఖాస్తు చేసుకున్నాయి. వీటిల్లోంచి గూగుల్, టీ–హబ్‌లు మొత్తం నలభై బృందాలను తుది దశ పోటీకి ఎంపిక చేశాయి. ఒక రోజు మొత్తం ఏకబిగిన సాగిన హ్యాకథాన్‌లో 'టీమ్ అగ్రిహీరోస్'తొలిస్థానంలో నిలిచింది. ఈ బృందం తయారు చేసిన అప్లికేషన్ డీప్.. టెక్నాలజీని ఉపయోగించి పరిశోధన సంస్థలకు చిన్న, సన్నకారు రైతులకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గిస్తుంది. శాస్త్రీయ పరిశోధనల ఫలాలను రైతు సమస్యల పరిష్కారానికి వినియోగిస్తుంది.



గూగుల్ సీనియర్ డైరెక్టర్ గురు భట్‌తో టీమ్ అగ్రిహీరోస్

'టీమ్ లైట్‌హెడ్స్'కి మూడో బహుమతి

కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారి సామ్యుల్ ప్రవీణ్ కుమార్, గూగుల్ కంపెనీ సీనియర్ డైరెక్టర్ (ఇంజనీరింగ్) గురు భట్, ప్రిన్సిపల్ ఇంజనీర్ అరుణ్ ప్రసాద్ అరుణాచలం, టీ–హబ్ సీఓఓ వింగ్ కమాండర్ ఆంటోని అనీశ్, ద నడ్జ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన రవి త్రివేదీ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన ఈ హ్యాకథాన్‌లో ఘజియాబాద్‌కు చెందిన 'టీమ్ ఇన్‌ఫెర్నోస్'రెండోస్థానంలో నిలిచి రూ.2.5 లక్షల నగదు బహుమతి అందుకుంది. వ్యవసాయంలో ఆల్టర్నేట్ రియాలిటీ టెక్నాలజీని ఉపయోగించేందుకు వీలుగా ఈ బృందం ఒక అప్లికేషన్‌ను రూపొందించింది. హైదరాబాద్‌కే చెందిన 'టీమ్ లైట్‌హెడ్స్'ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా పంటల ఉత్పాదకత పెంచేందుకు గరిష్ట స్థాయి దిగుబడులు సాధించేందుకు రూపొందించిన అప్లికేషన్‌కు మూడో బహుమతి(రూ.లక్ష నగదు) దక్కింది.

దాల్చిన చెక్కతో ప్రొస్టేట్ కేన్సర్ నివారణ!

జాతీయ పోషకాహార సంస్థ అధ్యయనంలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: భారతీయులు వంటకాల్లో తరచూ ఉపయోగించే దాల్చిన చెక్క ప్రొస్టేట్ కేన్సర్ నివారణకు దోహదపడుతుందని హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) జరిపిన అధ్యయనం తేల్చింది. దాల్చిన చెక్కతో మన ఆరోగ్యానికి ఎన్నో మేళ్లు జరుగుతాయన్నది చాలాకాలంగా తెలిసిన విషయమే. ఎన్ఐఎన్ తాజా అధ్యయనం ఈ విషయాన్ని మరోసారి రుజువు చేసింది. దాల్చిన చెక్కలోని సైనామాల్డీహైడ్, ప్రొసైనాడిన్ బీ–2లను ఎలుకలకు అందించినప్పుడు ప్రాథమిక దశలోని ప్రొస్టేట్ కేన్సర్‌పై సానుకూల ప్రభావం చూపినట్లు తెలిసింది. అధ్యయనంలో భాగంగా శాస్త్రవేత్తలు ఎలుకలకు 16 వారాలపాటు దాల్చిన చెక్క, దాంతోపాటు సైనామాల్డీహైడ్, ప్రొసైనాడిన్ బీ–2లను అందించారు. ఆ తరువాత ఈ ఎలుకలకు ప్రొస్టేట్ కేన్సర్ వచ్చేలా చేశారు. దాల్చిన చెక్క, దాంట్లోని రసాయనాలను ఆహారంగా తీసుకున్న 60–70 శాతం ఎలుకల్లో కేన్సర్ లక్షణాలేవీ కనిపించలేదు. ఈ పదార్థాలు శరీరంలోని ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను సమర్థంగా తట్టుకోగలగడం వల్లనే వాటికి కేన్సర్ సోకలేదని భావిస్తున్నట్లు ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన డాక్టర్ అయేశా ఇస్మాయిల్ తెలిపారు. ప్రొస్టేట్ గ్రంథిలో కేన్సర్ కణాల వ్యాప్తి కూడా తక్కువగా ఉన్నట్లు తమ పరిశీలనలో తెలిసిందన్నారు. అంతేగాకుండా... ఎముకల్లోని ఖనిజాల మోతాదు ఎక్కువైందని, ఎముకలు బలహీనమయ్యే ప్రమాదం తగ్గిందని వివరించారు. ప్రొస్టేట్ కేన్సర్ నివారణలో దాల్చిన చెక్క ఉపయోగపడగలదన్న విషయం ఎలుకల్లో రుజువైనప్పటికీ మనుషుల్లో వాడకానికి సంబంధించి మరిన్ని పరిశోధనలు జరగాల్సి ఉందని సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్.హేమలత తెలిపారు. 'కేన్సర్ ప్రివెన్షన్ రీసెర్చ్'జర్నల్ తాజా సంచికలో ఈ పరిశోధన వివరాలు ప్రచురితమయ్యాయి.

NIN
National Institute of Nutrition

అమ్మకు బహుమతిగా చందమామపై స్థలం!

- వినూత్నంగా ఉండాలన్న ఆలోచనతో ఓ కుమార్తె కానుక
- అంతర్జాతీయ చట్టాల ప్రకారం చంద్రుడిపై ఎవరికీ హక్కులేని వైనం

గోదావరిఖని (రామగుండం): తల్లిపై ప్రేమతో వినూత్న కానుక ఇవ్వాలని ఆ కుమార్తె భావించింది. ఇందుకోసం ఏకంగా చందమామపైనే ఎకరం భూమిని కొనుగోలు చేసి తల్లికి బహుమతిగా అందించింది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జీఎం కాలనీకి చెందిన సింగరేణి ఉద్యోగి సుద్దాల రాంచందర్, వకుళాదేవి దంపతుల పెద్ద కుమార్తె సాయి విజ్ఞత. ఆమె అమెరికాలోని ఐయోవాలో ఫైనాన్షియల్ అడ్వైజర్‌గా పనిచేస్తున్నారు. మదర్స్ డే సందర్భంగా లూనార్ రిజిస్ట్రీ వెబ్‌సైట్‌లో ఓ ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని ఎకరం భూమిని కొనుగోలు చేసినట్టు వెల్లడించారు. రూ.35 లక్షలు చెల్లించి తన తల్లి వకుళాదేవి పేరిట దానిని రిజిస్టర్ చేయించానని వివరించారు. ఈ మేరకు రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు కూడా వచ్చేశాయన్నారు.



తల్లిదండ్రులతో సాయివిజ్ఞత

చంద్రుడి స్థలాలపై హక్కు ఎవరిది?

1967లో కుదిరిన అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం.. చందమామ సహా అంతరిక్షంలోని సహజ ఉపగ్రహాలు, గ్రహాలు, నక్షత్రాలపై ఏ వ్యక్తికీ, దేశానికీ హక్కులు ఉండవు. కానీ ఇంటర్నేషనల్ లూనార్ ల్యాండ్ రిజిస్ట్రీ (ఐఎల్ఎల్ఆర్), లూనా సొసైటీ ఇంటర్నేషనల్‌తోపాటు పలు ఇతర సంస్థలు వెబ్‌సైట్లు పెట్టి చందమామపై స్థలాలను అమ్ముతున్నాయి. చంద్రుడిపై మానవులు ఆవాసాలు ఏర్పర్చుకోవడానికి ఇంకా ఎన్నేళ్లు పడుతుందో కూడా తెలియదు. అయినా చాలా మంది వినూత్నంగా ఉంటుందనో, భిన్నమైన బహుమతి ఇవ్వాలనో, సరదాకో చంద్రుడిపై భూములను కొనుగోలు చేస్తున్నారు. బాలీవుడ్ దివంగత నటుడు సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ గతంలో చంద్రుడిపై స్థలాన్ని కొన్నట్టు చెప్పారు. షారుక్‌ఖాన్ వీరాభిమాని ఒకరు ఆయనకు చంద్రుడిపై స్థలాన్ని కొని బహుమతిగా ఇవ్వడం గమనార్హం.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.